www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
గురువారం 06 మార్చి 2025
సంపుటి :06 సంచిక : 276 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH

# ఎమ్మెల్సీ "ఛాంపియన్ ట్రోఫీ" బీజేపీదే

తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల "ఛాంపియన్ ట్రోఫీ"లో బీజేపీ విజయం సాధించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఒక వర్గానికి కొమ్ము కాస్తున్న కాంగ్రెస్ కు ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు గుణపాఠమన్నారు. ముస్లింలంతా ఏకమై బీజేపీని ఓడించాలని చూస్తే హిందూ సమాజమంతా కాంగ్రెస్ ను ఓడించి ఆ పార్టీకి "రంజాన్" గిఫ్ట్ ఇచ్చారని పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తల పోరాటాలకు హ్యాట్సాఫ్ చెప్పిన బండి సంజయ్ బీజేపీకి అండగా నిలిచిన ఓటరు మహాశయులకు శిరస్సు వంచి వందనాలు తెలిపారు. డబ్బులు పంచి గెలవాలని కాంగ్రెస్ అభ్యర్థి చెంప చెళ్లుమన్పించారని చెప్పారు. నోట్లు పంచిన వారిని వదిలిపెట్టబోమని, గూగుల్ పే వివరాల లెక్కలు తీస్తున్నామని తెలిపారు.



- ఒక వర్గానికి కొమ్ము కాస్తున్న కాంగ్రెస్ కు గుణపాఠమిది
- హిందూ సమాజమంతా కాంగ్రెస్ కు ఇచ్చిన "రంజాన్" గిఫ్ట్ ఈ తీర్పు
- బీజేపీ కార్యకర్తల పోరాటాలకు హ్యాట్సాఫ్....
- ఓటరు మహాశయులకు శిరస్సు వంచి వందనాలు
- డబ్బులు పంచి గెలవాలని కాంగ్రెస్ చెంప చెళ్లుమన్పించారు
- నోట్లు పంచినోళ్ల గూగుల్ పే లెక్కలన్నీ తీస్తాం....ఎవరినీ వదిలిపెట్టబోం
- కాంగ్రెస్ పై యుద్ధ భేరీ మోగిస్తున్నాం
- దమ్ముంటే తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించండి
- ఇకపై ఏ ఎన్నికలు జరిగినా గెలుపు బీజేపీదే
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్....
- గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుతో అంబురాన్నంటిన సంబురాలు
- కార్యకర్తలతో కలిసి సంబురాలు చేసుకున్న సంజయ్

**కరీంనగర్ వెలుతురు మార్చి 05:**
కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు తదితరులతో కలిసి బండి సంజయ్ "విక్టరీ" గుర్తును చూపిస్తూ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బండి సంజయ్ ఏమన్నారంటే.... బీజేపీ విజయానికి అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలందరికీ హ్యాట్సాఫ్. టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించిన ఓటర్లకు శిరస్సు వంచి వందనాలు చెబుతున్నా. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇది నాలుగో విజయం. 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలతోపాటు నిన్న టీచర్స్ ఎమ్మెల్సీ, ఇయాళ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటు సాధించాం. నరేంద్రమోదీ నీతి, నిజాయితీ పాలనను, తెలంగాణకు కేంద్రం కేటాయించిన నిధులను గుర్తించడంతోపాటు కార్యకర్తలు చేసిన పోరాటాలును గుర్తు చేసుకుని అద్భుతమైన

2 లో..

## అంతర్గత విషయాలు బయట చర్చిస్తే ఖబడ్దార్

- నటనలు మాని...పార్టీకోసం నిజాయితీగా పనిచేయండి
- కాంగ్రెస్ శ్రేణులకు మీనాక్షి నటరాజన్ హెచ్చరిక



**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**
పార్టీ అంతర్గత విషయాలపై బయట చర్చ పెట్టొద్దని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. అంతర్గత విషయాలపై బయట చర్చ పెట్టిన వారిపై చర్యలు తప్పవని అన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ అనుబంధ సంఘాల సమావేశంలో

2 లో..



## సీఎంను కలిసిన సీపీఐ బృందం

**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**
సీఎం రేవంత్ రెడ్డిని ఆయన స్వగృహంలో సీపీఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు గురించి కొద్దిసేపు చర్చించారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక పరిస్థితుల ప్రభావం ఉంటుంది తప్పితే ఆయా పార్టీలు అలాగే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాల విధానాలు ప్రతిబింబించవని అన్నారు. అదే సందర్భంగా కాంగ్రెస్, సీపీఐల మధ్య 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన ఒప్పందం

2 లో..

## బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకై మల్లన్న మాటలు

- ఏఐసీసీ అధినేతతో పోల్చుకునే స్థాయి మల్లన్నకు లేదు
- సమయం ఇచ్చినా స్పందించలేదు : మంత్రి సీతక్క ఆగ్రహం




**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**
ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీతో తీన్మార్ మల్లన్న పోల్చుకునే స్థాయి అతనికి లేదని మంత్రి సీతక్క అన్నారు. మల్లన్న వ్యాఖ్యలపై ఆమె బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో

2 లో..

## టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం

- చురుకుగా సహాయక చర్యలు
- కార్పొరేట్ కాలేజీలకు దీటుగా జూనియర్ కాలేజీలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి





**నల్లగొండ,మార్చి5( వెలుతురు):**
నల్లగొండ వరప్రదాయిని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలడం చాలా దురదృష్టకరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్-ఎల్‌బీసీ ప్రాజెక్ట్ పూర్తి అయితే నల్గొండ నియోజకవర్గం పూర్తిగా సస్యశ్యామలమవుతుందన్నారు. టన్నెల్ వద్ద సహాయక పనులు చురుకుగా సాగుతున్నాయని, బిఆర్ఎస్ అర్థం లేని విమర్శలను పట్టించుకోబోమని అన్నారు. కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను

2 లో..

## నేను ఆత్మహత్య చేసుకోలేదు

- అధికమొత్తంలో నిద్రమాత్రలు వాడా
- పోలీసులకు వాంఙ్మూలం ఇచ్చిన గాయని కల్పన



2 లో..

## తప్పులను ప్రశ్నించినందుకే సస్పెండ్ చేశారు

- బీసీల రాజ్యాధికారం కోసం పోరాటం
- రేవంత్ ఒత్తిడితోనే సస్పెండ్ చేశారు
- బెదిరింపులకు భయపడేది లేదు : తీన్మార్‌మల్లన్న

**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**
ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నించినందుకే పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేశారని తీన్మార్ మల్లన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... తనను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయించి రేవంత్ రెడ్డి చాలా పెద్ద పొరపాటు చేశారని అన్నారు. బీసీలకు రాజ్యాధికారం ఎందుకు రాదో.. చూస్తామన్నారు. "నన్ను సస్పెండ్ చేస్తే.. బీసీ ఉద్యమం ఆగిపోతుందన్న భ్రమలోంచి రేవంత్



2 లో..

## ఎపిని ఆర్థికంగా గట్టెక్కించండి



- ఆర్థికమంత్రి నిర్మలా సీతారమన్‌కు చంద్రబాబు వినతి
- హోంమంత్రి అమిత్ షా, గడ్కరీలతో భేటీ

**న్యూఢిల్లీ,మార్చి5( వెలుతురు):**
ఎపిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఇతోధికంగా నిధులు అందించాలని కేంద్రానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విన్నవించారు. ఈ మేరకు ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌తో చర్చించారు. దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు.మధ్యాహ్నం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి.. అరకు కాఫీతో పాటు ఓ

2 లో..

## అహంకారానికి నిలువెత్తు రూపం జగన్



- విధ్వంసం చేసిన రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నం
- అసెంబ్లీకి రాకుండా అబద్ధాలు చెబితే ఎలా
- అధికారం ఉన్నా..లేకున్నా జగన్ ఎప్పుడూ ప్రజలకు దూరమే
- జగన్ విమర్శలపై కౌంటర్ ఇచ్చిన మంత్రి లోకేశ్

**అమరావతి,మార్చి5( వెలుతురు):**
అహంకారానికి ప్యాంటు, షర్టు వేస్తే జగన్ లాగే ఉంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చుని అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మరని అన్నారు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే నిజాలంటే మేమూ చెబుతామని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నా, కోల్పోయినా జగన్ ప్రజలకు

2 లో..

## ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీలు

- జనసేన నుంచి నాగబాబు పేరు ఖరారు
- నామినేషన్‌కు సిద్ధంగా ఉండాలని పవన్ సూచన



**అమరావతి,మార్చి5( వెలుతురు):**
ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబు పేరు ఖరారైంది. ఎమ్మెల్యేల కోటాలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమిలో భాగంగా జనసేన అభ్యర్థిగా నాగబాబు పేరును పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ ఖరారు చేశారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగబాబు సేవలందిస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

2 లో..

## బాహుబలి బడ్జెట్ అంటూ గొప్పలు

- లెక్కలు తప్ప...అన్నింటా సున్నాలే
- బడ్జెట్ గారడీ అని తేలిపోయింది.
- సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు టోపీ
- నిరుద్యోగ భృతి పేరుతో మోసం
- 4లక్షల ఉద్యోగాల కల్పన ఓ దగా
- మా హయాంలో 40 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం
- పరిశ్రమలు వెనక్కి పోతున్నాయి
- గతానికి..నేటికీ తేడాను ప్రజలు గుర్తించారు
- అసెంబ్లీలో మాట్లాడే అవకాశం లేదు కనుకే మీడియా ముందుకు వచ్చా
- బడ్జెట్‌పై నిలదీసిని వైకాపా అధినేత జగన్



7 లో..

**అమరావతి,మార్చి5( వెలుతురు):**
కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం పేరుతో ప్రతీ వర్గాన్ని చంద్రబాబు మోసం చేశారని, బడ్జెట్ గారడీతో అది బయటపడిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు.

(మొదటి పేజీ తరువాయి..)

## అంతర్గత విషయాలు బయట చర్చిస్తే ఖబడ్దార్

ఆమె మాట్లాడారు. నివేదికలు ఇవ్వకపోయినా వారి పనితీరు ఏంటనేది తమకు తెలుస్తుందని అన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్నది ఎవరు..? పనిచేసినట్టు యాక్టింగ్ చేస్తున్నది ఎవరనేది కూడా తెలుస్తుందంటూ చురకలు అంటించారు. పార్టీ కోసం సమయం ఇవ్వండి.. పార్టీ అంతర్గత విషయాలు బయట చర్చ చేయకండి.. అలాంటి వారిపై చర్యలు తప్పవు అని హెచ్చరించారు. తన పని తీరు నచ్చకపోయినా.. రాహుల్, సోనియాకు ఫిర్యాదు చేయొచ్చు అన్నారు. ఐదు రోజుల క్రితం మధ్య ప్రదేశ్ నుంచి రైలులో హైదరాబాద్?కు వచ్చిన మీనాక్షి నటరాజన్.. పార్టీని సెట్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. సింప్లిసిటీకి ప్రాధాన్యం ఇస్తూ.. అంతర్గతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతూ ఆమె సమావేశాలు సాగుతున్నాయి.తన దృష్టిలో పడాల్సిన అవసరం లేదంటూనే.. పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేయాలని నేతలకు సూచిస్తున్నారు. ఇవాళ ఉదయం పీసీసీ చీఫ్?మహేశ్ కుమార్ గౌడ్?తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన మీనాక్షి నటరాజన్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై చర్చించారు. అనంతరం పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో మాట్లాడారు. తర్వాత ఆదిలాబాద్ జిల్లా నేతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కీలక అంశాలను ప్రస్తావిస్తూనే పలువురికి చురకలు అంటించారు.

## సీఎంను కలిసిన సీపీఐ బృందం

ప్రకారంగా సీపీఐకి రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికి ప్రస్తుతం ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధిష్ఠానంతో మాట్లాడి సానుకూలంగానే స్పందించారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ పాల్గొన్నారు.

## నేను ఆత్మహత్య చేసుకోలేదు

**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**

తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడలేదని, తన కుమార్తె విషయంలో చోటుచేసుకున్న మనస్పర్థల వల్ల నిద్ర పట్టక అధిక మొత్తంలో నిద్ర మాత్రలు వేసుకోవడం వల్ల అపస్మారక స్థితిలోకి వెళ్లినట్టు గాయని కల్పన తెలిపారు. ఈ విషయానికి సంబంధించి కేపీహెచ్‌బీ పోలీసులు ప్రెస్‌నోట్ విడుదల చేశారు. 'కల్పన గత 5 సంవత్సరాల నుంచి భర్తతో కలిసి హైదరాబాద్‌లోని విల్లాలో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె దయ ప్రసాద్‌కి, కల్పనకు మధ్య చదువు విషయంలో ఇటీవల మనస్పర్థలు వచ్చాయి. అనంతరం ఆమె హైదరాబాద్‌కు చేరుకున్నారు. అదే సమయంలో కల్పన భర్త ప్రసాద్.. ఆమెకు పలుమార్లు ఫోన్ చేయగా స్పందన లేదు. దీంతో, ప్రసాద్ కాలనీ వెల్ఫేర్ సభ్యులకు ఫోన్ చేసి చెప్పగా, వారు ఆఎంఒ 100కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కేపీహెచ్‌బీ పోలీసులు, కాలనీ వెల్ఫేర్ మెంబర్స్ ఇంటి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో వెనుక వైపు ఉన్న కిచెన్ డోర్ నుంచి లోపలికి ప్రవేశించి, బెడ్ రూమ్‌లో అపస్మారక స్థితిలో ఉన్న కల్పనను సమీపంలోని ఆస్పత్రికి తరలించాం ' అని పోలీసులు వెల్లడించారు. తాను ఆత్మహత్యాయత్నం చేయలేదని, ఈ ఘటనలో ఎవరి ప్రమేయం లేదని కల్పన చెప్పినట్టు పోలీసులు పేర్కొన్నారు. తనకు, తన కుమార్తెకు జరిగిన విషయంలో నిద్ర పట్టక అధిక మొత్తంలో నిద్ర మాత్రలు వేసుకోవడం వల్ల ఇలా జరిగిందని ఆమె వెల్లడించినట్టు తెలిపారు.

## బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకై మల్లన్న మాటలు

మాట్లాడారు. కార్యకర్తల శ్రమతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కొందరు నేతలు బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకలై మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ చేయలేనిది తాము చేశామని.. అభినందించాల్సింది పోయి విమర్శలు చేస్తారా అని ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో పోల్చుకునే స్థాయి మల్లన్నది కాదని చెప్పారు. కులగణనపై అభ్యంతరాలు ఉంటే శాససనమండలిలో మాట్లాడాలని అన్నారు. కులగణనకు 50 రోజుల సమయం ఇచ్చామని.. అది సరిపోదా అని మంత్రి సీతక్క నిలదీశారు. కాగా.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో మంత్రి సీతక్క, షబ్బీర్ అలీ, జానారెడ్డి, జీవన్ రెడ్డి, వీహెచ్ తదితరులు విడివిడిగా గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తమ అభిప్రాయాలను చెప్పాలని పీఏసీ సభ్యులను మీనాక్షి నటరాజన్ కోరారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై ఏఐసీసీ కార్యదర్శి వంశీ చంద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్న వ్యాఖ్యలను ఖండించారు. తన ఓటమికి సీఎం రేవంత్ రెడ్డి కారణం అంటూ మల్లన్న చేసిన వ్యాఖ్యలు కేవలం తన ఉనికి కోసమే అని చెప్పారు. తాను మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా పోటీ చేయాలన్నది అధిష్ఠానం నిర్ణయమని తెలిపారు. తన గెలుపు కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎంతో శ్రమించారని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాల్లో భాగంగానే మహబూబ్ నగర్‌లో బీజేపీ గెలిచిందని అన్నారు. ఎమ్మెల్సీ కవిత జైల్లో ఉండటంతో ఆమెను బయటకు తీసుకు రావడం కోసం బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి అమ్ముడుపోయిందని ఆరోపించారు. గతంలో కేసీఆర్ లాంటి నేతలు ఎంపీగా పని చేసిన మహబూబ్‌నగర్ సిట్టింగ్ సీట్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోల్పోయి బీజేపీకి మద్దతు ఇచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి నుంచి గ్రామ స్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ తన గెలుపు కోసం సమష్టిగా కృషి చేశారని వంశీ చంద్ రెడ్డి పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై జానారెడ్డి స్పందించారు. కులగణన అంశంలో తన పాత్ర లేదని చెప్పారు. మల్లన్న గాలి మాటలు మాట్లాడితే కుదరదని హెచ్చరించారు. తప్పు చేసిన వాడిని క్షమించే గుణం తనదని అన్నారు. తనను ఎవరూ తిట్టిన తాను పట్టించుకోనని చెప్పారు. తీన్మార్ మల్లన్న సమావేశంతో తనకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. ప్రత్యేక్ష రాజకీయాలకు తాను దూరం. సలహాలు అడిగితే ఇస్తానని తెలిపారు. పరిపాలన చేసే వారు సైతం అడిగితేనే సలహాలు, సూచనలు ఇస్తానని అన్నారు. తమ నాయకులు తనను విమర్శిస్తే ఖండిస్తాలేరన్నారు. అలాగని సమర్థించడం లేదని చెప్పారు. ఎందుకో వారినే అడిగి తెలుసుకోవాలని జానారెడ్డి అన్నారు. తీన్మార్ మల్లన్న అంశం తనకు సంబంధం లేదని మాజీ ఎంపీ వీ. హనుమంతురావు అన్నారు. పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పానని అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడారు. మీనాక్షి నటరాజన్ తనను ఏమి అడగలేదని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పానని హనుమంతురావు అన్నారు.

## టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం

ఏర్పాటు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కనగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేంద్ర యూనివర్సిటీ సౌజన్యంతో గ్లూకోమా టెస్టింగ్ మిషన్లను నూతనంగా ఏర్పాటు చేసిన కనగల్ పీహెచ్సీలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొట్టమొదటగా కనగల్ మండల కేంద్రాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని మార్చి 6 నుంచి 300 మందికి గ్లూకోమ టెస్టులు చేయనున్నామని చెప్పారు. 40 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు గ్లూకోమా టెస్టులకు సహకరించాలని కోరారు. మెరుగైన వైద్యం కోసం ప్రతి నియోజకవర్గంలో మోడల్ పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని.. తొందరలోనే ప్రతి నియోజకవర్గంలో మోడల్ పీహెచ్?సీ ఏర్పాటు చేస్తామన్నారు. కనగల్ మండల కేంద్రంలోని తిమ్మన్నగూడెం నుండి సాగర్ హైవేకు రూ.15 కోట్లతో నిధులు మంజూరు అయ్యాయని.. అతి త్వరలో రోడ్డు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే.. గ్రామాలలో లింకు రోడ్లను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కనగల్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల మంజూరు చేశామని.. వచ్చే అకాడమీకి ఇయర్ నాటికి బిల్డింగ్ పూర్తి చేసి కాలేజీ ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే.. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ హాస్టల్స్?కు నూతన బిల్డింగులను కట్టిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సమయంలో కూడా కలెక్టర్ ఇలా త్రిపాఠి నిర్విరామంగా జిల్లా మొత్తం తిరుగుతూ.. ఆయా మండలాలలోని ప్రభుత్వ హాస్పిటల్స్, ప్రభుత్వ హాస్టల్స్?ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ జిల్లాను సురక్షితంగా చూసుకుంటున్నారని.. ఇలాంటి కలెక్టర్ మన జిల్లాలో పని చేయడం అదృష్టమన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఎంహెచ్ఓ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ ఓ కళ్యాణ్ చక్రవర్తి, మండల పీహెచ్సీ డాక్టర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మండల ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ "ఛాంపియన్ ట్రోఫీ" బీజేపీదే

(మొదటి పేజీ తరువాయి..)

విజయాన్ని అందించినందుకు చాలా సంతోషంగా ఉంది. మా కార్యకర్తలు టీచర్లు, నిరుద్యోగులు, ప్రజల పక్షాన చేసిన పోరాటాలను గుర్తు చేశాం. లాఠీదెబ్బలను, జైలుకు వెళ్లిన సంఘటలను గుర్తు చేసినం. మోదీ ప్రభుత్వం ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను రాయితీ ఇవ్వడంతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసింది. అవన్నీ గుర్తు చేసినం. మా పక్షాన నిలబడ్డందుకు ఆనందంగా ఉంది. మొన్న ఛాంపియన్ ట్రోఫీలో ఇండియా గెలిచింది. ఆరోజు, ఈరోజు అదే చెప్పిన. మాది ఇండియా టీం. విజయం సాధించి తీరుతామని చెప్పినం. వాళ్లు డబ్బు సంచులు పంచారు. మేం ఓటర్లను నమ్ముకున్నాం. నోట్ల సంచులు ఓడిపోయాయి. ఓటర్లే గెలిచారు. ఈవీఎంలను మేనేజ్ చేసి బీజేపీ గెలుస్తుందని పదేపదే దుష్ప్రచారం చేసిన రాహుల్ గాంధీకి నేను సవాల్ విసురుతున్నా... ఈవీఎంల ద్వారా మాత్రమే కాదు... ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిర్వహించిన బ్యాలెట్ పేపర్ ద్వారా కూడా బీజేపీయే గెలిచింది. దీనికేం సమాధానం చెబుతారు.

బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేసినా, డబ్బు సంచులను పంచినా ఓటుకు రూ.5 వేల చొప్పున పంచినా వారి కుట్రలు ఫలించలేదు. మేం నయాపైసా ఖర్చు చేయలేదు. మా కార్యకర్తలే ఇంటింటికీ తిరిగారు. వారి కష్టం, మోదీ పాలన, అమ్మవారి దయవల్లే ఈరోజే మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ చెంప చెళ్లుమన్పించారు.

వాస్తవానికి బీఎస్పీ అభ్యర్థి 2వ స్థానానికి వస్తారని భావించాం. ఎప్పుడైతే బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆయనకు మద్దతిచ్చి, పైసలిచ్చిందో... అవన్నీ గమనించిన ప్రజలు ఆ అభ్యర్థిని 3వ స్థానానికి పరిమితం చేశారు.

మార్పు కోరుతున్న ప్రజలకు బీజేపీ దిక్సూచిలా కన్పించింది. ఇకపై ఏ ఎన్నికలు జరిగినా విజయపరంపర బీజేపీదే. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ గెలుపు బీజేపీదే. ఎందుకంటే రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులిస్తోంది కేంద్ర ప్రభుత్వమే. సొమ్ము కేంద్రానిదైతే.. సోకు రాష్ట్ర ప్రభుత్వం చేసుకుంటోంది.

ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమైనరు. మా పోరాటాలు, జైళ్లు, తిన్న లాఠీదెబ్బలను గుర్తు చేసుకున్నరు. మా కార్యకర్తల తలలు పగిలి రక్తం చిందించిన సంఘటనలను, త్యాగాలను గుర్తు చేసుకుని ఓటరు మహాశయులు ఓటేసి ఆశీర్వదించారు.

వారి నమ్మకాన్ని నిలబెడతాం. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ యుద్ధం చేసేందుకు సిద్ధమవుతున్నం. ఇకనైనా కాంగ్రెస్ దిగిరావాలి. రాష్ట్రంలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్లు రాష్ట్ర ప్రభుత్వ పాలనపై వ్యతిరేకత వ్యక్తం చేస్తూ తీర్పు ఇచ్చారు. వెంటనే 6 గ్యారంటీలను అమలు చేయాలి. అట్లాగే 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. ఇచ్చిన మాట మేరకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలి. అట్లాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని అమలు చేయాలి. 5 పెండింగ్ డీఏలు, రిటైర్డ్ మెంట్ బెన్ ఫిట్స్, జీపీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలి. వీరితోపాటు రైతులకు, మహిళలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి.

డబ్బుల పంపిణీపై అడిగిన ప్రశ్నకు....

బీజేపీ ఎక్కడైనా పైసలు పంచిందా.. మీరే చెప్పండి. కొందరు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా విచ్చలవిడిగా డబ్బులు పంచారు. ఓటుకు రూ.5 వేల దాకా యూపీఐ ద్వారా పంపిణీ చేశారు. అవన్నీ బయటకు తీస్తాం. అడ్డగోలుగా సంపాదించిన సొమ్మును పంచి ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలుద్దామనుకున్నరు. ఎవరినీ వదిలిపెట్టబోం. రాజకీయాలను కలుషితం చేసే వాళ్లను వదిలిపెట్టబోం. నిజాయితీగా కష్టపడే కార్యకర్తల పోరాటాలను, త్యాగాలకు విలువ లేకుండా చేస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు.

తెలంగాణ ఆదాయంలో హైదరాబాద్ వాటా అధికం. కానీ వెనుకబడ్డ ఆదిలాబాద్ లో నిధులు ఎక్కువ ఖర్చు చేస్తోంది. దీనినేమంటారు? అట్లాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు వ్యతిరేకంగా బీసీ సమాజం, హిందూ సమాజం ఓట్లేసి గెలిపించింది. ఒక వర్గానికి కొమ్ముకాస్తున్న కాంగ్రెస్ పార్టీ యావత్ హిందూ సమాజం ఈ తీర్పు ద్వారా "రంజాన్" గిఫ్ట్ ఇచ్చింది. పండుగ చేసుకోమని చెప్పింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని, బండి సంజయ్ ను ఓడించేందుకు ముస్లిం సంఘాలన్నీ ఏకమై 'బండి సంజయ్ కు గుణపాఠం చెబుదాం. అందరూ ఏకమై బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ కు ఓటేయాలని పిలుపినిచ్చింది. చివరకు ఏమైంది? వాళ్లంతా ఒకటైతే... హిందూ సమాజం కూడా ఏకమై బీజేపీ పక్షాన నిలిచింది.

ఇప్పుడు కాంగ్రెస్ కు సవాల్ విసురుతున్నా... ప్రజలంతా కాంగ్రెస్ పక్షాన ఉన్నారని భావిస్తే... తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. దమ్ముంటే వెంటనే ఎన్నికలు జరపాలి. బీజేపీ దమ్మేందో చూపిస్తాం...

# తప్పులను ప్రశ్నించినందుకే సస్పెండ్ చేశారు

(మొదటి పేజీ తరువాయి..)

విజయాన్ని అందించినందుకు చాలా సంతోషంగా ఉంది. బయటకు రావాలి. నాలాంటి వాళ్ళు పక్కన ఉండొద్దని సీఎం రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతోనే కుల గణనను తప్పుగా చూపారు. 90 ఏళ్ళ తర్వాత కుల గణన చేస్తే.. చప్పట్లు కొట్టేటోడు కూడా లేడు. కుల గణనపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చకు రెడీ. పీసీసీ అధ్యక్షుడిపై ఒత్తిడి చేసి రేవంత్ రెడ్డికి నన్ను సస్పెండ్ చేయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తానన్న రాహుల్ గాంధీ హామీతోనే కాంగ్రెస్‌లో చేరాను. తన పక్కన వారు బానిస మాదిరి బతకాలని రేవంత్ కోరుకుంటారు. రేవంత్ చేసిన కులగణన చిత్తు కాగితంతో సమానం. సొంత మంత్రులకే ముఖ్యమంత్రి పేరు గుర్తుకు రావటం లేదు" ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. 2011లో రాహుల్ గాంధీ చేసిన పనినే తాను చేసినట్లు తెలిపారు. మన్మోహన్ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను రాహుల్ గాంధీ చించలేదా?.. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ఒక న్యాయం.. మల్లన్నకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం అగ్రవర్ణాలకు మాత్రమే అని వెల్లడించారు. ముఖ్యమంత్రి, మంత్రులు.. కులగణనలో నిర్లక్ష్యంగా పాల్గొన్నారని తెలిపారు. అగ్రవర్ణాలను ఎక్కువ చూపి.. బీసీలను తొక్కి పెట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. పదే పదే తప్పులు మాట్లాడుతూ దొరికిపోతున్నారని అన్నారు. ప్లాన్ ప్రకారం కాంగ్రెస్‌ను ఖతం చేసే పనిలో సీఎం రేవంత్ ఉన్నారంటూ సంచలన కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ .. ప్రధాని మోదీ ఒకరికి ఒకరు సహకరించుకుంటున్నారన్నారు. మల్కాజిగిరి, చేవెళ్ళ, మహబూబ్‌నగర్ ఎంపీలను బీజేపీ గెలవటానికి రేవంత్ సహకరించారని ఆరోపించారు. బలమైన కేసీఆర్‌తో తాను కొట్లాడినప్పుడు రేవంత్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీచంద్ రెడ్డిని.. రేవంత్ రెడ్డే ఓడించారన్నారు. మహబూబ్‌నగర్, మల్కాజిగిరి ఎంపీలను గెలిపించుకోలేని రేవంత్ .. తనను గెలిపించారా అంటూ మండిపడ్డారు. రేవంత్ కూర్చున్న సీఎం కుర్చీకి పునాది పడటానికి తాను కారణమని స్పష్టం చేశారు. "నా రెక్కల కష్టంతోని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రావటానికి నా పాత్ర కూడా ఉంది. కేసీఆర్ నియంత పాలనలో కాంగ్రెస్‌కు.. నా న్యూస్ ఆఫీస్ గాంధీ భవన్‌గా మారింది. నేను ప్రచారం చేసిన 45 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ 42 సీట్లు గెలిచింది. రేవంత్‌కు నచ్చకున్నా.. 2028లో బీసీ ముఖ్యమంత్రి ఖాయం. హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్ లాంటి వాళ్ళకు కాంగ్రెస్‌లో స్వేచ్ఛ లేదు. అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినా.. కాంగ్రెస్ కార్యకర్తలు సంతోషంగా లేరు. గౌడ్ కోటాలో జగ్గారెడ్డి సతీమణికి కార్పోరేషన్ పదవి వచ్చింది. రెడ్డిలు పప్పు, బెల్లం లెక్క కార్పొరేషన్ పదవులు పంచుకున్నారు" అంటూ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు చేశారు. అలాగే సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మల్లన్న ప్రెస్‌మీట్‌కు బీసీ జేఏసీ నేతలు మద్దతు తెలిపారు.

## అగ్రకులాల నాయకులు తప్పులు చేస్తే చర్యలు తీసుకోరా..?

- **కాంగ్రెస్ పార్టీపై సీనియర్ నేత మధుయాష్కీ సంచలన వ్యాఖ్యలు**




**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**

కాంగ్రెస్ పార్టీలో రెడ్లు, అగ్రకులాల వాళ్లు ఎలాంటి క్రమశిక్షణ ఉల్లంఘన పనులు చేసినా చర్యలు తీసుకోరు అని మధుయాష్కీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డే క్రమశిక్షణ తప్పాడని ఆయన పేర్కొన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యే మేఘా రెడ్డిపై బహిరంగంగా ఆరోపణలు చేశాడు.. మరి క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడిపై క్రమశిక్షణ చర్యలు ఉండవా? అని ప్రశ్నించారు. కులగణన మీద బీసీ నాయకులతో రేవంత్ రెడ్డి మీటింగ్ పెడితే దానికి జానారెడ్డిని, కేశవరావును పిలిచారు కానీ బీసీ నాయకుడినైనా నన్ను పిలవలేదు అని కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను ఇటీవలే సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే పార్టీ నుంచి ఎమ్మెల్సీ మల్లన్నను సస్పెండ్ చేసినట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. పలు సభల్లో రెడ్లను తీన్మార్ మల్లన్న బహిరంగంగా విమర్శించిన నేపథ్యంలోనే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు రాజకీయ నిపుణులు పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకే సస్పెండ్ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీ సంఘం తెలిపింది.

## ఎపిని ఆర్థికంగా గట్టెక్కించండి

జ్ఞాపికను అందజేశారు. చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్.. అమిత్ షాతో సమావేశమై వివిధ అంశాలపై దాదాపు గంట పాటు చర్చించారు. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్‌ను కలిశారు. చంద్రబాబుతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా నిర్మలా సీతారామన్‌ను కలిసి.. రాష్ట్ర బ్జడెట్ ప్రతులను ఆమెకు అందజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఏపీకి ఆర్థికంగా మరిన్ని వెసులుబాట్లు కల్పించే అంశంపై నిర్మలా సీతారామన్‌తో సీఎం, ఆర్థిక మంత్రి చర్చలు జరిపారు. ఇటీవలే ఏపీలో ప్రవేశపెట్టిన బ్జడెట్ వివరాలను ఆమెకు వివరించారు. క్యాపిటల్ ఎక్స్ పెడించర్ నిధుల కోసం ప్రత్యేకంగా వీజీఎఫ్ స్కీం ప్రవేశపెట్టడంపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలో తొలిసారిగా ఈ తరహా విధానం ఉందన్న చర్చల్లో భాగంగా నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. వీజీఎఫ్ స్కీంలో భాగంగా కార్పస్ ఫండ్ నిమిత్తం రూ. 2 వేల కోట్లు కేటాయించామని సీఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల వివరించారు. వివిధ మార్గాల్లో ఇప్పటి వరకు అందించిన సాయంపై నిర్మలా సీతారామన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇక పైనా ఇదే తరహా సహకారం ఉండాలని.. వీలైనన్ని కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేసేందుకు సిద్దంగా ఉన్నామని, తమకు నిధులు కూడా అదే స్థాయిలో వచ్చేలా చూడాలని కోరారు. తరవాత మరోమంత్రి నితిన్ గడ్కరీతోనూ భేటీ అయ్యారు. వివిధ రోడ్లకు సంబంధించి సిఎం చర్చించారు.

## అహంకారానికి నిలువెత్తు రూపం జగన్

దూరంగానే ఉన్నారని మండిపడ్డారు. పరదాల ప్రభుత్వం పోయాక రాష్ట్రంలో పరదాల అమ్మకాలు తగ్గాయని వ్యాఖ్యానించారు.'వైకాపాకు ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వకూడదని నిర్ణయించారు. ఆ విషయం జగన్‌కు ఎందుకు అర్థం కావట్లేదు? ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా గురించి సీఎంను కించపరిచేలా మాట్లాడుతారా? ప్రతిపక్ష హోదా రావాలంటే 10శాతం సభ్యులుండాలి. 11 సీట్లు ఎందుకు వచ్చాయో ఆత్మ పరిశీలన చేసుకుంటే మంచిది. తల్లి, చెల్లి కూడా నమ్మట్లేదని జగన్ ఇంకా గ్రహించట్లేదు. పవన్ కల్యాణ్‌కు వచ్చిన మెజారిటీ ఎంత? జగన్‌కు వచ్చింది ఎంత? సీఎం, డిప్యూటీ సీఎంపై జగన్‌వి దిగజారుడు మాటలు మానుకోవాలన్నారు. గతంలో లేని విధంగా రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరుగుతుందని ఎన్నికల ముందు చెప్పారు. ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకున్నాం. గత ప్రభుత్వం విధ్వంసం వల్ల ఆదాయం పడిపోయింది. గాడి తప్పిన రాష్ట్రాన్ని సరైన మార్గంలో పెడుతున్నాం' అని లోకేశ్ వివరించారు. 'జగన్‌కు చట్టాలు ఉల్లంఘించటం అలవాటు కాబట్టి.. మేము కూడా చట్టాన్ని ఉల్లంఘించి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అంటున్నారు. ఎమ్మెల్యేగా గెలవకుండా సభకు వస్తా అన్నట్టుగా జగన్ వితండ వాదం ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి మెజారిటీకి భయపడి హడావుడిగా బెంగళూరు నుంచి వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి .. మళ్లీ బెంగళూరురు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. జగన్ 40లక్షల ఉద్యోగాలు ఎవరికి కల్పించారు, ఎక్కడ ఇచ్చారో సమాధానం చెప్పాలి. 40లక్షల ఉద్యోగాల కల్పన జరిగి ఉంటే ఇక నిరుద్యోగ సమస్య ఎక్కడుంటుందని లోకేశ్ ప్రశ్నించారు. జగన్ చేసిన విధ్వంసం వల్ల పడిపోయిన రాష్ట్ర ఆదాయాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నాం. సజ్జల స్క్రిప్ట్ పంపిస్తుంటే మండలిలో అది చదవటం తప్ప బొత్స చేతుల్లో ఏముంది. మూడు రాజధానులపై జగన్ స్టాండ్ ఏంటో బొత్స ఏం చెప్పగలరా అని ఆక్షేపించారు.

# ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీలు

(మొదటి పేజీ తరువాయి..)

చేయాలని నాగబాబుకు పవన్ సమాచారం ఇచ్చారు. నామినేషన్‌కు అవసరమైన పత్రాలు సిద్ధం చేయాలని పార్టీ కార్యాలయాన్ని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం ఐదు స్థానాల్లో ఒకరి అభ్యర్థి పేరు ఖరారైంది. జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు పేరును ఖరారు చేస్తూ పవన్ కళ్యాణ్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న నాగబాబును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నుకుంటారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. దాదాపు గంటపాటు ఈ భేటీ జరిగింది. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు ఎంపికపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అంతకుముందు నాగబాబును కేబినెట్‌లోకి తీసుకుంటామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై సోషల్ మీడియాలో నెగిటివ్ కామెంట్స్ రావడాన్ని గమనించిన జనసేన ఆయనకు రాజ్యసభకు పంపాలని భావించారు. విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో నాగబాబును పంపించాలని అనుకునున్నప్పటికీ ఆ స్థానాన్ని ఖాళీ చేయించింది బీజేపీ కాబట్టి... ఆ స్థానాన్ని కమలం పార్టీకి వదలాలి అనే సూచనలు కూడా వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బుధవారం ఉదయం సీఎం చంద్రబాబుతో మాట్లాడిన తర్వాత పవన్ కళ్యాణ్... ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీగా నాగబాబు పేరును ఖరారు చేసినట్లు జనసేన పొలిటికల్ సెక్రటరీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్ అధికారికంగా జనసేన గ్రూప్‌లో పోస్ట్ చేశారు.ఈనెల పదవ తేదీలోపు నామినేషన్ వేయాల్సిన నేపథ్యంలో మంచి రోజు చూసుకుని నాగబాబు నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. అలాగే మిగిలిన నలుగురు ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లు కూడా ప్రకటించగా.. ఐదుగురు కలిసి నామినేషన్ వేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇక ఐదుగురు ఎమ్మెల్సీలో నాగబాబు పేరు ఖరారవగా.. మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను ప్రకటించాల్సి ఉంది. అయితే నాగబాబు రాజ్యసభకు వెళ్తే ఐదు ఎమ్మెల్సీల్లో ఒకటి టీడీపీ నుంచి వంగవీటి రాధాకు ఇస్తారనే అంతా భావించారు. కానీ ఇప్పుడు ఎమ్మెల్సీగా నాగబాబు పేరు ఖరారు చేయడంతో ప్రస్తుతం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈరోజు సీఎం చంద్రబాబు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత కేబినెట్ సమావేశం అనంతరం ఎమ్మెల్సీలు ఎవరనేది ప్రకటించనున్నట్లు సమాచారం. అయితే ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బీజేపీ అడుగగా.. ఇప్పటికే ఒక స్థానం నాగబాబుకు ఇచ్చేయడంతో బీజేపీకి ఇచ్చే అవకాశం లేదని చంద్రబాబు ముందుగానే స్పష్టం చేసినట్లు తెలిసింది. మరి మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులు ఎవరు అనేది ఉత్కంఠంగా మారింది.

## బీజేపీ కి మరో విజయం
# అంజిరెడ్డి గెలుపు

### కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లి పోయిన కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి



( రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 5:** భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అంజిరెడ్డిగెలుపు ఖాయం కావడంతో, కౌంటింగ్ హాల్ నుంచి బయటకువచ్చికన్నీటి పర్యంతమైన కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి, కాగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి అనూహ్యంగా విజయం సాధించిన



నేపథ్యంలో బీజేపీ నేతలు సంబరాలలో మునిగి తేలుతున్నారు, టీచర్స్ ఎంఎల్ సి అభ్యర్థి మల్కా కొమరయ్య, గ్రాడ్యుయేటు ఎంఎల్ సి అంజి రెడ్డి విజయాలతో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీ హవా కొనసాగుతోంది, అయితే బీజేపీ రాష్ట్ర నేతలు మాత్రం వచ్చే ఎన్నికల్లో బీజేపీ పార్టీ విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు, బీజేపీ పార్టీ రాష్ట్రం లో ఉపాధ్యా,నిరుద్యోగులకు బీజేపీ నాయకత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు, నేటి ఎంఎల్ సీ ఎన్నికల్లో వారి మద్దతు తో రెండు ఎంఎల్ సీ సీట్లు సాధించి తెలంగాణ రాష్ట్రం లో బీజేపీ కి గట్టి మద్దతు ఇచ్చారని బీజేపీ నేతలు తెలిపారు,

# సమయపాలన పాటించాల్సిందే

- డ్యూటీలకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవు
- డాక్టర్లు బాధ్యతగా వ్యవహరిస్తేనే, సిబ్బంది బాధ్యతగా ఉంటారు
- ఉన్నతాధికారులతో సమీక్షలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరిక
- హాస్పిటల్స్‌లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని వెల్లడి
- పలు అంశాలపై మంత్రి సమీక్ష



**హైదరాబాద్ వెలుతురు మార్చి 05:** డాక్టర్లు, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాల్సిందేనని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఆశ వర్కర్ల నుంచి మొదలు పెడితే, టీచింగ్ హాస్పిటల్స్‌లో ప్రిన్సిపల్స్ వరకూఎవరి డ్యూటీ వారు సక్రమంగా చేయాల్సిందేనన్నారు. డ్యూటీలకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు బుధవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో డాక్టర్లు, వైద్య సిబ్బంది సమయపాలన, హాస్పిటల్స్‌లో ఎక్విప్‌మెంట్ నిర్వాహణ, అవయవదానం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. జూబ్లిహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో జరిగిన ఈ సమీక్షలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, జీవన్‌దాన్ ట్రస్ట్ ఇంచార్జ్, డాక్టర్ భూషణ్ రాజు, గాంధీ హాస్పిటల్ ప్రిన్సిపల్ ఇందిరా, సూపరింటెండెంట్ రాజకుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖాన్లపై నమ్మకాన్ని పెంచేలా డాక్టర్లు, సిబ్బంది పనిచేయాలన్నారు. గాంధీ హాస్పిటల్‌లో ముందస్తు సమాచారం లేకుండా డాక్టర్లు డ్యూటీలకు గైర్హాజరు అవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలని, వారిని చూసి వైద్య సిబ్బంది కూడా బాధ్యతగా ఉంటారన్నారు. అన్ని మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లలో అటెండెన్స్ మానిటరింగ్‌పై మరింత శ్రద్ధ పెట్టాలని డీఎంఈ నరేంద్ర కుమార్‌ను మంత్రి ఆదేశించారు. అటెండెన్స్ మానిటరింగ్ కోసం ప్రతి కాలేజీలో ఓ సీనియర్ ప్రొఫెసర్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించాలని సూచించారు. హాస్పిటళ్లలో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయన్నారు. 2022, 2023, 2024లో మూడు దశల్లో ఏర్పాటైన 25 మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ టీచింగ్ హాస్పిటళ్ల నిర్మాణ పనుల పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. వర్షాకాలంలోగా వీలైనంత వేగంగా ముఖ్యమైన పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటళ్లలో



డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్ పనితీరుపై సమావేశంలో చర్చించారు. నిపుణులైన బయోమెడికల్ ఇంజనీర్ల కొరత ఉన్నదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బయోమెడికల్ ఇంజనీర్లు, టెక్నీషియన్ల నియమాకానికి చర్యలు తీసుకోవావాలని, వారికి ట్రైనింగ్ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. ట్రైనింగ్ బాధ్యతలను నిమ్స్‌లో ఉన్న బయోమెడికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించాలని ఆదేశించారు. జీవన్‌దాన్ పనితీరుపై మంత్రి సమీక్షించారు. ప్రభుత్వ దవాఖాన్లలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ల సంఖ్య పెంచాలని, ఆరోగ్యశ్రీ కింద వీలైనంత ఎక్కువ మంది పేషెంట్లకు అవయవ మార్పిడి చికిత్స చేయాలని మంత్రి సూచించారు. గాంధీలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ పనులను త్వరగా పూర్తిచేయాలని, మెడికల్ కార్పొరేషన్ ఎండీ హేమంత్‌ను మంత్రి ఆదేశించారు.

## భవిష్యత్తు భాజపా దే

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు మార్చి 05:** భవిష్యత్తు భాజపా దే తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్తు బాగా పదేనని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు రాష్ట్రఅధ్యక్షుడు కిషన్ రెడ్డి గారి నాయకత్వంలో అసెంబ్లీ ఎన్నికల తో పాటు మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 8 స్థానాలను కైవసం చేసుకోవడంలో కిషన్ రెడ్డి గారి పాత్ర



అభినందనీయమన్నారు ఆయన చేసిన దశ దిశ నిర్దేశంతో పాటు కార్యకర్తలు శ్రమించడంతో ఉపాధ్యాయ పట్టభద్రులా ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారని ఆయన అన్నారు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉపాధ్యాయుల సమస్యలపై 317 పై చేసిన పోరాట ఫలితంగా ఉపాధ్యాయ సోదరులు భాజాపాకు మద్దతుగా నిలిచి గెలిపించాలని ఆయన అన్నారు రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో భాజపా ప్రభుత్వము ఏర్పడుతుందని దానికి నిదర్శనమే నేటి ఫలితాలు అని అన్నారు..

## కోట్లాది రూపాయలు వెదజల్లిన జాతీయపార్టీలకు చుక్కలు చూపించిన బీసీ బిడ్డ పులి ప్రసన్న హరికృష్ణ!



నైతిక విజయం బీసీలదే!

ప్రసన్న హరికృష్ణ ఓటమికి కారణం బీసీల్లో ఉన్న బానిస నాయకులే!

అణిచివేతకు గురవుతున్న బీసీలు ఇంకా చైతన్యం కావాలి!

అగ్రవర్ణ పార్టీల కుట్రలు ఇకనైనా పసిగట్టి కళ్ళు తెరవాలి!

ఉత్తర తెలంగాణ పట్టభద్రులు చైతన్య వంతమైన బిడ్డలు!

గతంలో తెలంగాణ ఉద్యమం ఉత్తర తెలంగాణకు అడ్డా!

రాబోయే రోజుల్లో బీసీలకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా వేదిక కాబోతోందా!

పులి ప్రసన్న హరికృష్ణ దెబ్బకు వనికి పోతున్న అగ్రవర్ణ పార్టీలోని నాయకులు!

బీసీ బహుజనులకు ప్రత్యామ్నాయ వేదిక అవసరం అంటున్న బీసీ మేధావులు!

అగ్రవర్ణ పార్టీల కుట్రలను అట్టడుగు వర్గాలు కొత్తతరం నాయకులు నేటి యువత ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.!

బీసీలు ఇప్పుడు మారకపోతే ఎప్పటికి అగ్రవర్ణ జాతులకు బానిసలుగా బ్రతకాల్సిందేనా?

బీసీల ఓట్లతో గెలిచిన ఉన్నత వర్గాల నాయకులు అధికారం అడ్డం పెట్టుకొని రాజ్యం,సంపదతో ఆర్థికంగాఎదిగి అణగారిన కులాలను అణిచి వేస్తున్నారు.!

కళ్లుండి చూస్తు సబ్సిడీలతో ఉచితాలతో అడుక్కోవటానికి అలవాటు పడ్డ బలహీన వర్గాలు!

**జక్కే వీరస్వామి గౌడ్ రాష్ట వ్యవస్థాపక అధ్యక్షులు**
**సర్వాయిపాపన్న మోకుదెబ్బ(గౌడ సంఘము)**

కరీంనగర్ వెలుతురు మార్చి 05:



## సంపాదకీయం..

# బిజెపి పునర్విభజన రాజకీయం !

దక్షిణాదిలో బిజెపి పెద్దగా పట్టు సాధించలేకపోతోంది. తమిళనాడు, కేరళలో అడుగు పెట్టడమే కష్టంగా ఉంది. గత దశాబ్దంగా ఎంతగా ప్రయత్నించినా ఒక్కసీటు సాధించడం కష్టంగా మారుతోంది. ఈ క్రమంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త ఆందోళనలకు దారితీస్తున్నది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. అయితే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరిగే బదులు తగ్గుతాయన్న ఆందోళన ఇప్పుడు దక్షిణాది నేతల్లో కలవరానికి గురి చేస్తోంది. 2011 జనాభా లెక్కలు తీసుకుంటే, అప్పటికీ ఇప్పటికీ దక్షిణాదిలో జనాభా తగ్గింది. ఈ లెక్కన సీట్లు పెరగాల్సింది పోయి తగ్గే ప్రమాదం ఉంది. ఇదే విషయమై ప్రధానంగా తమిళనాడు సిఎం స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పిల్లలను కనాలని నవదంపతులకు పిలుపునివ్వడం కూడా జరిగింది. రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఈ పునర్విభజన రాజకీయ విభజనగా మారడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజ్యాంగంలోని 82వ అధికరణం ప్రకారం ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలు జరిపించాలి. మార్పులు చేర్పులను బట్టి చట్టసభల నియోజకవర్గాల సంఖ్యలు, హద్దులు సవరణలు చేయాల్సి వుంటుంది. ఎందుకంటే జనాభా అధికంగా వున్నా తక్కువగా వున్నా అన్ని రాష్ట్రాల్లోనూ ఓటుకు ఒకే విలువ వుండాలి. ఎమర్జన్సీలో తెచ్చిన 42వ రాజ్యాంగ సవరణలో నియోజకవర్గాల పునర్విభజన స్తంభింపచేశారు. ఆ సమయంలోనే జనాభా నియంత్రణపై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టారు. జనాభాను తగ్గించే చర్యల కోసం రాష్ట్రాలను ప్రోత్సహించారు. అప్పటికి దక్షిణాది రాష్ట్రల్లో 6 నుంచి 10 శాతం పెరుగుదల వుంటే ఉత్తరాదిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, యు.పి, బీహార్ లలో 12 నుంచి 15 శాతం వుండింది. కనుక జనాభా నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలనీ ఇరవయ్యేళ్ల తర్వాతనే పునర్విభజన చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమయంలో జనాభా తగ్గితే సీట్లు తగ్గించడం సరికాదు గనక పార్లమెంటు స్థానాల సంఖ్యను 2001 వరకూ స్తంభింపచేశారు. అందువల్ల సీట్ల స్వరూపంలో అనేక మార్పులు జరిగినా మొత్తం ఎంపిల సంఖ్యలో మార్పు రాలేదు. సరిహద్దుల మార్పు తప్ప ఆ యా రాష్ట్రాల వారీగా వున్న సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను 2026 వరకూ వాయిదా వేస్తూ 2002 రాజ్యాంగ సవరణ చట్టం తీసుకొచ్చారు. దీంతో ఇప్పటి వరు ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పుడు జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంది. ఈ సమయంలో గందరగోళం చెలరేగుతోంది. ఉన్నసీట్లు తగ్గిస్తే తమకు పార్లమెంటులో పట్టు లేకుండా పోతోందన్న ఆందోళన మొదలయ్యింది. నిజానికి ఇదో కీలకమైన అంశం. విధాన నిర్ణయం కూడా. ఇలాంటి కీలకాంశాలపై పారదర్శకంగా సమగ్రంగా చర్చ జరగాలి. దక్షిణాది నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న వేళ కేంద్రం మాత్ర స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. ఏకపక్ష నిర్ణయాలు లేకుండా చూడడం కేంద్ర ప్రభుత్వ విద్యుక్త ధర్మం. ఎలాగూ దక్షిణాదితో వచ్చే లాభం లేదు కనుక సీట్లు తగ్గిస్తేనే మంచిదన్న కుత్సిత ఆలోచన ఏదైనా ఉందా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. అధ్యక్ష తరహాను తలపించే విధంగా కేంద్రీకృత పెత్తనానికి బిజెపి యత్నిస్తోందని అనేక ఆరోపణలు సైతం ఉన్నాయి. అదే సమయంలో అంతా రాజ్యాంగబద్ధంగా పద్ధతి ప్రకారమే జరగడానికి చర్యలు అవసరం. నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త సవాళ్లకు దారితీస్తున్నది. రాజ్యాంగం ప్రకారం జనాభా లెక్కల తర్వాత జరగాల్సిన పునర్విభజన అనేక కారణాల వల్ల సందేహాస్పదమై పోయింది. దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గిపోతుందనీ, ఒకవేళ పెంచినా వాటి వాటాగా రావలసిన పెరుగుదల రాదనీ స్టాలిన్ విమర్శ చేస్తున్నారు. అయితే హోం మంత్రి అమిత్ షా ఎవరి సీట్లూ తగ్గబోవని ప్రకటించారు. అసలు పునర్విభజన ఏ ప్రాతిపదికపై జరుగుతుందో చెప్పాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గట్టిగా కోరుతున్నారు. దక్షిణాదిపై బిజెపి, కేంద్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా అమిత్ షా హామీలను నమ్మలేమని వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాల నోరు నొక్కేందుకు పునర్విభజన అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రానికి నిజంగా చిత్తశుద్ధి వుంటే ఈ పునర్విభజన ఏ ప్రాతిపదికన జరుగుతుంది, ఇప్పుడున్న సీట్లు ప్రస్తుత జనాభా ప్రకారమే వుంటాయా అని ఆయన ప్రశ్నించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ కూడా కేంద్రం అందరితో చర్చించి అడుగు వేయాలనీ, సందేహాలు తొలగించాలని వ్యాఖ్యానిం చారు. అయితే జమిలి ఎన్నికల బిల్లుతో ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సిద్ధం అవుతున్న వేళ ఈ ఆందోళనపై స్పష్టత రావాల్సి ఉంది. 1976 తర్వాత కాలంలో దక్షిణాది రాష్టాలైన కేరళ, తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తర్వాత ఎ.పి, తెలంగాణలు జనాభా తగ్గింపులో గణనీయమైన ప్రగతిని సాధించాయి. తమిళనాడులో సంతానోత్పత్తి రేటు 2001 నాటికే 2.0గా వుంది. అంటే జనాభా స్థిరీకరణ దశకు చేరింద ని అంచనా వేశారు. అమిత్ షా ప్రకటనను బట్టి చూస్తే 2026లో ఈ ప్రక్రియ చేపట్టడం తథ్యంగా కనిపిస్తుంది. అయితే ఇప్పుడు కేవలం జనాభాను బట్టి సీట్లు నిర్ణయించేట్టయితే తక్కువ జనాభా వున్న దక్షిణాదిన సీట్లు తగ్గితే ఇప్పటికే చాలా ఎక్కువగా వున్న యు.పి, బీహార్ వంటి వాటికి ఇంకా పెరుగుతాయి. సగటు జనాభాను చూస్తే వేరే తేడాలుంటాయి. ఉదాహరణకు నాలుగు కోట్ల జనాభా వున్న తెలంగాణకు 17 లోక్‌సభ సీట్లున్నాయి. 12.6 కోట్ల జనాభా వున్న బీహార్‌కు 40 సీట్లున్నాయి. సగటున తెలంగాణకు 23 లక్షల మందికి ఒక సీటు వుంటే బీహార్‌లో సగటున 32 లక్షల మందికి ఒక సీటు వున్నట్టు లెక్క. అందులోనూ జనాభాను బట్టి దామాషా ప్రాతిపదికన పెంచేట్టయితే ఆ ఫార్ములాను బట్టి ఈ తేడా ఇంకా విపరీతంగా మారొచ్చు. సాంకేతికంగానేగాక రాజకీయంగానూ ఈ మార్పులకు చాలా ప్రభావం వుంటుంది. బిజెపి ఎన్నిఎత్తులు వేసినా దక్షిణాదిన స్వంతంగా అధికారంలోకి వచ్చేంతగా బలం పెంచుకోవడంలో సఫలం కాలేకపోయింది. కర్ణాటక మినహా ఇతర చోట్ల ప్రత్యక్ష, పరోక్ష మిత్రులపైనే ఆధారపడి వుంటున్నది. ఇలాంటి సమయంలో పునర్విభజన పేరిట ఉత్తరాదిన సీట్లు పెంచి దక్షిణాదిన తగ్గించేలా రాజకీయ ఎజెండాతో ముందుకు పోతుందా అన్న అనుమానాలు వస్తున్నాయి.

# జనాభా పెరుగుదలతో యూపి, బీహార్‌లకు లబ్ది

**పార్లమెంట్ సీట్లు పెరిగితే బిజెపికే లాభం**



**న్యూఢిల్లీ,మార్చి5( వెలుతురు):**
పునర్విభజన జనాభా మేరకు జరిపితే ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరిగి, దక్షిణిదిలో తగ్గుతాయి. ముఖ్యంగా జనాభాకు తగినట్టు సీట్లు పెంచాలంటే బీహార్, యు.పి వంటి చోట్ల సంఖ్య రెట్టింపవుతుంది. ఈ పెంపు అన్నది జనాభా పెరుగుదలకు కృషి చేసినందుకు బహుమానంగా భావించాల్సి ఉంటుంది. అయితే దక్షిణాదిలో సీట్లు తగ్గవని అమిత్ షా హామీ ఇస్తున్నా..నమ్మిక కుదరడం లేదు. ఎందుకంటే బిజెపి ఏది అనుకుంటే అది చేసి తీరుతుంది. ఒక లెక్క ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలకు 32 స్థానాలు పెరిగితే దక్షిణాదిన 24 తగ్గుతాయి. కేరళకు 20లో ఆరు నుంచి ఎనిమిది కోల్పోవలసి రావచ్చంటున్నారు. అదే ఉత్తరప్రదేశ్‌కు 80 నుంచి 91కి చేరతాయి. బీహార్‌కు పది పెరగ్గా ఎం.పి, రాజస్థాన్‌కు కూడా గణనీయమైన పెరుగుదల వుంటుంది. 1977లో సగటున ఒక్కో ఎం.పి 10.11 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహించేవారు. సగటు ఓటర్ల సంఖ్య నియోజకవర్గానికి ఎంత వుండాలనేదానిపై నిషేధమేమీ లేదు. ఉదాహరణకు ఇప్పుడు కూడా అదే తరహాలో 10.11 లక్షల మందికి ఒకరి చొప్పున నిర్ణయించేట్టయితే ప్రస్తుత జనాభా ప్రకారం 1400 మంది లోక్‌సభ సభ్యులవుతారు. ఆ ప్రకారం యు.పి, బీహార్‌ల సభ్యుల సంఖ్య మూడంతలు పెరుగుతుంది. తమిళనాడు, కేరళ వంటివి రెండింతలే పెరుగుతాయి. అదే బీహార్, యు.పి లను తీసుకుంటే 2015లో కూడా వాటి జనాభా పెరుగుదల రేటు 4.0గా వుంది. మానవాభివృద్ధి సూచికల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు కొంత మెరుగ్గా వున్నాయి. హిందీ రాష్ట్రాలు ముఖ్యంగా పెద్దవైన ఉత్తర ప్రదేశ్, బీహార్‌ల జనాభా మాత్రం తగ్గకపోగా పెరుగుతూనే వచ్చింది. జనాభా నియంత్రణ చర్యలలో నిర్లక్ష్యం, మత సంబంధాలతో సహా అనేక రాజకీయ కారణాలు దీని వెనక వున్నాయనేది స్పష్టం. ఉన్న చట్టం ప్రకారం ఇప్పుడు నియోజక వర్గాల పునర్విభజన ఎజెండాలోకి రానుంది. అంటే ఇక్కడ ఒకటి పెరిగితే అక్కడ నాలుగు పెరుగుతాయి. ఏమైనా ఎంత జనాభా వుంటే ఒక లోక్‌సభ స్థానం, సాంకేతికంగా సమాన ప్రాతినిధ్య సూత్రమేమిటి అన్నదాన్ని బట్టి ఈ అంశాన్ని నిర్ధారించవలసి వుంటుంది.ఎ.పి, తెలంగాణ విభజన తర్వాత తమిళనాడుకే దక్షిణాదిన అత్యధికంగా 39 స్థానాలున్నాయి. దేశ వ్యాపితంగా చూస్తే అది అయిదో స్థానంలో వుంది. ఏకపక్షంగా పునర్విభజన జరిపితే 7,8 స్థానాలు తగ్గిపోతాయి. 11 వరకూ తగ్గొచ్చని మరో లెక్క కూడా వుంది. కొత్త పార్లమెంటులో 888 మంది సభ్యులకు చోటు కల్పించారు. కనుక పాత నిష్పత్తి ఫార్ములా చెల్లుబాటు కాదు. ఇదేగాక మరో సమస్య కూడా వుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినప్పుడు వారికి రిజర్వు చేసిన మూడో వంతు స్థానాలను అదనంగా కలపాలని తీర్మానించారు. కనుక ఈ రెండు కోణాల్లోనూ సీట్ల సంఖ్య పెంచడమనేది కూడా కీలకాంశంగా వుంటుంది. దీనికి సహేతుకమైన పరిష్కారం కావాలంటే జనాభా దామాషాతో పాటు ఇతర ప్రోత్సాహక సూచికలు కూడా నిర్ణయించాలి. జనాభా ఎక్కువగా వుండటానికి చారిత్రిక కారణాలున్నాయి గనక ఆ ప్రాతిపదికన ఉత్తరాదికి తగ్గించడం సరికాదని ఆ పార్టీని బలపర్చేవారు వాదిస్తున్నారు. ఉత్తరాది నుంచి శ్రామికులు వచ్చి చౌకగా పనిచేయడం వల్లనే తమిళనాడు సంపద పెరిగిందని కూడా వారు వితండ వాదన చేస్తున్నారు. ఇప్పటికే స్వంత మెజార్టీ కోల్పోయిన బిజెపి రేపు మరింత తగ్గిపోకుండా ఉత్తరాది రాజకీయం నడుపుతున్నదా అని రాజకీయ పరిశీలకులు సందేహిస్తున్నారు. భారతదేశ సమైక్యత, సమతుల్యతను కాపాడుకోవడం రాష్ట్రాల హక్కులను సమాఖ్య రాజ్యాంగానుసారం కాపాడటం ఇందులో దాగి వున్నాయి. సీట్లు పైనే పెంచి దక్షిణాదికి గొర్రె తోకగా వుంచేట్టయితే అప్పుడు సమైక్యతా భావనకే విఘాతం కలుగుతుంది. విధాన నిర్ణయాలలోనూ సమతుల్యత దెబ్బ తింటుంది. ఇంకా మహిళల రిజర్వేషన్ కోసం సీట్ల పెంపు, లేదంటే జనాభా ప్రకారం పెంపు వంటి చర్యలు చేపడితే మరింత పకడ్బందీగా అడుగులు వేయవలసి వుంటుంది. దేశమంతటా ఒక ప్రధాన చర్చగా మారిన ఈ అంశంపై కేంద్రం విజ్ఞతతో నిర్ణయం తీసుకుని దేశ సమైక్యతను సమాఖ్య సూత్రాలనూ కాపాడవలసి వుంటుంది. లేకపోతే ఇది పెద్ద పోరాటంగా మారడం అనివార్యమే అవుతుంది.

# తమిళనాట హిందీ పేర్లు తొలగించండి

- **ఎక్స్ వేదికగా సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు**

**చెన్నై,మార్చి5( వెలుతురు):**
కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలు విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. తమిళనాడులోని అన్ని కేంద్ర కార్యాలయాల నుంచి హిందీని తొలగించాలన్నారు. తమిళంపై ప్రేమ ఉంటే.. చేతల్లో చూపించాలన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ప్రధాని నరేంద్ర మోదీకి తమిళం అంటే అపారమైన ప్రేమ అని భాజపా చెబుతోంది. అదే నిజమైతే.. దాన్ని ఆయన చేతల్లో ఎందుకు చూపించడం లేదు..?. పార్లమెంటులో సెంగోల్‌ను ఏర్పాటుచేయడం కంటే.. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీని తొలగిస్తే బాగుంటుంది. హిందీకి బదులుగా తమిళాన్ని అధికార భాషగా చేసి.. మరిన్ని నిధులు కేటాయించండి. కేంద్ర బ్జడెట్‌లో తిరుక్కురల్‌ను ఉటంకిస్తే సరిపోదు. రాష్ట్రానికి ప్రత్యేక పథకాలు, సత్వర విపత్తు సహాయ నిధి, కొత్త రైల్వే ప్రాజెక్టులను అందించాలి. రైళ్లకు అంత్యోదయ, తేజస్, వందేభారత్ వంటి పేర్లు పెట్టడం ఆపండి. దానికి బదులు తమిళ పేర్లను పెట్టండి. తమిళ భాషపై ప్రేమను మాటల్లో కాకుండా.. చేతల్లో చూపించండి' అని స్టాలిన్ పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన ప్రక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని స్టాలిన్ అభ్యర్థించారు. ప్రస్తుత జనాభా ప్రకారం.. పార్లమెంటులో తాము 12 సీట్లు కోల్పోయి.. 10 సీట్లు మాత్రమే వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తమిళ రాజకీయాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనన్నారు. ఈ చర్య రాష్ట్ర గొంతును నొక్కేస్తుందన్నారు. తాము విభజనకు వ్యతిరేకం కాదని.. కానీ, గత 50 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన తమకు ఇది శిక్ష కాకూడదన్నారు. ఈ సందర్భంగా 2026 జనాభా లెక్కల ఆధారంగా విభజన ప్రక్రియ చేపట్టరాదని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది.



# వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధింపు



- **కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ట్రంప్ ప్రకటన**

**వాషింగ్టన్,మార్చి5( వెలుతురు):**
వచ్చే నెల నుంచి భారత్‌పై సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. తాజాగా ట్రంప్ కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో ప్రసంగించారు. దాదాపు గంట 40 నిమిషాల పాటు ట్రంప్ ప్రసంగించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ సెషన్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి. ఈ సెషన్‌లో భారత్, చైనా, కెనడా దేశాలపై సుంకాలు విధించనున్నట్లు స్పష్టం చేశారు. భారత్, చైనా సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి అమలులోకి రానున్నట్లు ట్రంప్ ప్రకటించారు. కొన్ని దశాబ్దాలుగా అమెరికాపై కొన్ని దేశాలు అధిక సుంకాలు విధిస్తున్నాయి. యూరోపియన్ యూనియన్, చైనా బ్రెజిల్, భారత్ వంటి చాలా దేశాలు తమ నుంచి అధిక సుంకాలు వసూలు చేస్తున్నాయి. ఇది చాలా అన్యాయం అని ట్రంప్ చెప్పారు. భారత్ అమెరికాపై వంద శాతం కంటే ఎక్కువ సుంకాలు వసూలు చేస్తుంది. ఇక అమెరికా వసూలు చేసే దానికంటే చైనా రెండింతలు ఎక్కువగా సుంకాలు విధిస్తోంది. ఇప్పుడు తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత తాము కూడా సుంకాలు విధించేందుకు సిద్ధమయ్యామని ట్రంప్ తెలిపారు. ఏ దేశాలు.. తమ ఉత్పత్తులపై ఎంత టారిఫ్‌లు విధిస్తాయో.. తాము కూడా అంతే సుంకాల్ని వసూలు చేస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. తన దేశం ఎదుర్కొంటోన్న ద్రవ్యోల్బణ సమస్య గురించి ప్రస్తావిస్తూ.. జో బైడెన్ పాలనలోని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. చమురు, గ్యాస్ తవ్వకాల గురించి తన ఆలోచనలు వెల్లడించారు. ఏ దేశానికీ లేనివిధంగా మన కాళ్ల కింద ద్రవరూప బంగారం (చమురు, గ్యాస్‌ను ఉద్దేశించి) ఉందని, అది ద్రవ్యోల్బణ సమస్యను తీరుస్తుందని అన్నారు. 'ద్రవ్యోల్బణ సమస్యను పారదోలడం కోసం మేం చేసే పోరాటంలో భాగంగా ఇంధన వ్యయాన్ని వేగంగా తగ్గించడంపై దృష్టిపెట్టాం. బైడెన్ పాలనలో 100కు పైగా విద్యుత్ ఎ÷–లాంట్లు మూసివేశారు. వాటిలో చాలా ఎ÷–లాంట్లను మేం ఇప్పుడు తెరవబోతున్నాం. అందుకే నేను అధికారంలోకి రాగానే జాతీయ ఇంధన అత్యవసర పరిస్థితిని విధించాను. మన కాళ్ల కింద బంగారాన్ని తోడటం ద్వారా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు.

## 1971 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్

- **తమిళనాడు అఖిలపక్ష భేటీ తీర్మానం**

**చెన్నై,మార్చి5( వెలుతురు):**
1971 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని, రాబోయే 30 ఏళ్లపాటు అదే అమల్లో ఉండాలనితమిళనాడు సిఎం స్టాలిన్ స్పష్టం చేశారు.తమిళనాడులో డీలిమిటేషన్ అంశంపై అఖిలపక్ష సమావేశం కీలక తీర్మానాలను ఆమోదించింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేపట్టారు. అఖిలపక్ష సమావేశంలో ప్రస్తుత లోక్‌సభలో ఉన్న 543 సీట్లనే కొనసాగించాలని తీర్మానించారు. దక్షిణాది రాష్ట్రాలు డీలిమిటేషన్ వల్ల నష్టపోకుండా ఉండాలని, ఇతర దక్షిణాది రాష్ట్రాలతో కలిసి కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న డీలిమిటేషన్ ప్రక్రియపై గత కొంతకాలంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాదికి తీవ్ర నష్టం కలుగుతుందని అభిప్రాయపడ్డాయి. అయితే, బీజేపీ ఈ డీలిమిటేషన్ వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని వాదిస్తోంది. అయితే, డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకుండా ప్రధాని నరేంద్ర మోడీ లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని స్టాలిన్ కోరారు. గత 50 ఏళ్లుగా కుటుంబ నియంత్రణను పక్కాగా అమలు చేసిన తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలకు ఈ నిర్ణయం శిక్షగా మారకూడదని స్టాలిన్ స్పష్టం చేశారు.

# మహేశ్వరానికి ప్రపంచ స్థాయి పరిశ్రమలు

- గురువారం మంత్రి శ్రీధర్ బాబు పర్యటన
- కిచ్చెన్నగారిలక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నేత



**వెలుతురు, ఎల్ బి నగర్, మార్చి 5**

మహేశ్వరం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు గురువారం నాడు మహేశ్వరం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారని కేఎల్ఆర్ చెప్పారు.బుధ వారం నాడు లక్ష్మా రెడ్డి రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, డీసీపీ సునీతారెడ్డి సహా పోలీస్ విభాగాధిపతులతో కలిసి మంత్రి పర్యటన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఫోర్త్ సిటీతో మహానగరంగా మారే ఈ ప్రాంతంలో ఆధునిక హంగులతో డీసీపీ కార్యాలయం నిర్మించనున్నాట్లు తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారని కేఎల్ఆర్అన్నారు,జెన్నాయిగూడలో ప్రపంచ స్థాయి హంగులతో ఏర్పాటు కానున్న లెన్స్ కార్ట్ పరిశ్రమ భూమిని పరిశీలించారు. ఈ పరిశ్రమలో స్థానికులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని లెన్స్ కార్ట్ ప్రతినిధులను లక్ష్మా రెడ్డి కోరారు.ప్రభుత్వ భూమిలో జరిగిన ఆక్రమణలను వెంటనే తొలగించాలని కేఎల్ఆర్ కోరారు , ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు నరసింహ, బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, కృష్ణానాయక్, కాకి ఈశ్వర్ ముదిరాజ్, సుభాన్ యాదవ్, సరికొండ పాండు సహా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు,

## అగ్ని ప్రమాద సంఘటన ప్రాంతాన్ని పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం



**వెలుతురు, హయత్ నగర్, మార్చి 5:**

రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న చిరు వ్యాపార దుకాణలులో మంగళ వారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మూలంగా అగ్ని ప్రమాదం జరగడం తో కాలిపోయిన దుకాణాలను స్థానిక హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి అగ్ని ప్రమాదం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు, ఈ ప్రమాద ఘటనలో ఫుట్ పాత్ పై పొట్టకూటికోసం రోడ్డు పక్కనే పండ్లు అమ్ముకునే నాలుగు తోపుడు బండ్లలో ఉన్న పండ్లు పూర్తిగా కాలిపోవడంతో పాటు, పక్కనే ఉన్న దుప్పట్ల షాప్ కూడా పూర్తిగా విద్యుత్ షాక్ తో కాలిపోవడం జరిగిందని స్థానికులు కార్పొరేటర్ జీవన్ రెడ్డి కి తెలిపారు,ఈ పరిశీలన కార్యక్రమంలో బిజెపి మల్కాజ్ గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ ,స్థానికులు పారంద అంజయ్య , పారంద సుభాష్, బీజేపీ నాయకులు నర్సింహా , పారంద సాయి మరియు తదితరులు పాల్గొన్నారు.

## తారామతిపేట లో జరిగిన మహంకాళి అమ్మవారి రథోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే రంగారెడ్డి




**వెలుతురు, పెద్ద అంబర్ పేట్, మార్చి 5**

రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తారామతిపేట గ్రామంలో మంగళవారము రాత్రీ నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మహంకాళి దేవి అమ్మవారి వార్షిక రథోత్సవం మరియు శివ పార్వతుల కళ్యాణ మహోత్సవ%శీ% వైభవంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదం పొందిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి ,గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి , స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహంకాళీ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలి.

- జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు మార్చి 05:**

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ప్రభుత్వ ఉద్యోగులు కలిగిన తల్లిదండ్రులు విడిగా ఉంటున్నట్లయితే వారికి పెన్షన్,రేషన్ కార్డులు కూడా ఇస్తామని స్పష్టంగా హామీ ఇవ్వడం జరిగిందని కానీ ప్రస్తుతం ఇచ్చిన మార్గదర్శకాల్లో టిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలని ఇవ్వడం జరిగిందని దీనిని సవరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు విడిగా ఉంటున్న,వేరు,వేరు ఊర్లలో ఉంటున్న తల్లిదండ్రులకు రేషన్ కార్డులు పెన్షన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్ గౌడ్ ఓయూ జేఏసీ ఛైర్మన్ బండి నరేష్ మాల మహానాడు అధ్యక్షులు చంద్రమోహన్ రాయ్ బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్చార్జి గోదా రవీందర్ పాల్గొన్నారు.

## డివిజన్ లోని కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్ మరియు ఇతర మున్సిపల్ పనులను వెంటనే పూర్తి చేయాలి

- జోనల్ కమిషనర్ రవి కిరణ్ గారికి వినతిపత్రం ఇచ్చిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్




**హైదరాబాద్ వెలుతురు మార్చి 05:**

బుధవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ గారిని కలిసి డివిజన్లో యొక్క కమ్యూనిటీ హాల్ సీసీ రోడ్ మరియు ఇతర మున్సిపల్ పనులను వెంటనే చేపట్టినాలని వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్, సందీప్ హితేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు



# రామన్నపేట మండల ప్రజా సమస్యలపై సిపిఎం ప్రజా చైతన్య పాదయాత్ర జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 5**

మండల సమగ్ర అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారంకై సిపిఎం ఆధ్వర్యంలో, మార్చి 23 నుండి 28 వరకు మండల వ్యాప్తంగా జరిగే సిపిఎం ప్రజా చైతన్య పాదయాత్రను జయప్రదం చేయాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం డి జహంగీర్ పిలుపునిచ్చారు. పాదయాత్ర జయప్రదంకై స్థానిక సిపిఎం మండల కార్యాలయంలో సన్నాక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొని హాజరై మాట్లాడుతూ మండలంలో దశాబ్దాల కాలంగా పేరుకుపోయిన ప్రజా సమస్యల్ని పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో 24 గ్రామాలు, ఆరు రోజులు, 135 కిలోమీటర్లు పాదయాత్ర చేసి సమస్యల్ని అధ్యయనం చేయడం జరుగుతుందన్నారు. రామన్నపేట నియోజకవర్గం పునరుద్ధరించాలని, ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలుగా మార్చి ,నూతన భవనం నిర్మించాలని, ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమను రద్దు చేయాలని, ధర్మారెడ్డి పిల్లాయిపల్లి కాలువలను పూర్తి చేసి అన్ని గ్రామాలకు నీరంబించాలని,మండలంలో అస్తవ్యస్తంగా ఉన్న లింకు రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేయాలని, గ్రామాల్లో అపరిస్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలని జరిగే సిపిఎం పాదయాత్రకు ప్రజలందరూ మద్దతి ఇచ్చి భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైల్ల ఆశయ్య,రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం,జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, బల్గురి అంజయ్య,,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్,కందుల హనుమంతు,మండల కమిటీ సభ్యులు గొరిగే రజిత,గొరిగే సోములు, గాదె నరేందర్, ఎండి రషీద్ భావండ్లపల్లి బాలరాజు,వేముల సైదులు,మేడి గణేష్ పులిబిక్షం తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ రాచన్నస్వామి వారిని దర్శించుకున్న మాజీ చెర్మెన్ వై.నరోత్తం



**జహీరాబాద్ వెలుతురు మార్చి 05:**

టిఎస్ఎస్ సిసీడీసీ (ఎస్సి కార్పొరేషన్) మాజీ చెర్మెన్ వై.నరోత్తం బుధవారం కోహిర్ మండలం బడంపెట శ్రీ రాచన్న స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి పూజల అనంతరం శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు జి.నర్శింలు, పి.జి.ఈశ్వర్, ఈశ్వరప్ప, ఆలయ కమిటీ మాజీ చెర్మెన్ శివరాజ్ స్వామి, చెంగల్ జైపాల్, శివమూర్తి, రఘుపతి రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సి.యం.అశోక్ రెడ్డి, యస్.రవి, దిలీప్,ఈ.ఓ శివరుద్రప్ప తదితరులు ఉన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**నల్లగొండ వెలుతురు మార్చి 05:**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సింగ్ భట్లలో బుధవారం విద్యార్థులు స్వ పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడంతో పాటు, కలెక్టర్, డీఈవో, ఎంఈవోలుగా పాఠశాలకు రావడం పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థులే ఉపాధ్యాయులుగా చక్కటి పాఠశాలను బోధించారు. కలెక్టర్‌గా, డీఈవోగా , ఎంఈవోగా పాఠశాలను సందర్శించి పరిశీలించడం, తనిఖీలు చేయడం ఆకట్టుకుంది. అలాగే పాఠశాల పాటు ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖేడ్ లో మార్కండేయుడి శిఖర ప్రతిష్టకు సర్వం సిద్ధం



ప్రాణ ప్రతిష్టకు భక్తులు తరలిరండి

వైభవంగా కొనసాగుతున్న కార్యక్రమాలు

మార్కండేయుడి శివస్మరణతో మార్మోగుతున్న నారాయణఖేడ్

**వెలుతురు నారాయణఖేడ్ మార్చ్ 05 :**

నారాయణఖేడ్ వెంకటాపూర్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన భక్త మార్కండేయ ఆలయ శిఖర ప్రతిష్టాపన కార్యక్రమాలు గత నాలుగు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. భక్త మార్కండేయ ఆలయ నిర్వాహకులు, పద్మశాలి కుల బాంధవులు నిర్వహిస్తున్నట్టి కార్యక్రమాల్లో నియోజకవర్గంలో నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆ మార్కండేయని ఆశీస్సులు పొందుతున్నారు. ప్రతిరోజు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాల్ని ఆలయ నిర్వహణ కమిటీ బాధ్యులు పెద్ద ఎత్తున చేపడుతున్నారు. కాగా మార్కండేయుడు శిఖర ప్రతిష్టాపన కార్యక్రమం గురువారం రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి, కరణ్ గజేంద్ర భారతి మహారాజ్,యతీశ్వరులు, మునులు, సాధుసంతువుల కరకమలములచే వైభవంగా కొనసాగనుంది. ఈ చారిత్రాత్మక అంతిమ ఘట్టం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మార్కండేయుడు ఆశీస్సులు ఉంది మహా ప్రసాదాన్ని స్వీకరించాల్సిందిగా ఆలయ కమిటీ బాధ్యులు కోరుతున్నారు.

### అంతిమఘట్టంలో పాల్గొని జన్మ ధన్యం చేసుకోండి..

- బ్రహ్మశ్రీ గురురాజ్ శర్మ



మార్కండేయుడు ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని భక్తులు తమ జన్మను సార్ధకత చేసుకోవాలి. దైవచింతన ద్వారా మాత్రమే మోక్షాన్ని పొందగలం. అత్యంత శ్రేష్టమైన బ్రహ్మ సూత్ర లింగాన్ని మార్కండేయ ఆలయంలో ప్రతిష్టించబోతున్నాం. గత నాలుగు రోజుల కొనసాగుతున్న కార్యక్రమాలతో నారాయణఖేడ్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది



### భక్త మార్కండేయుడి ఆశీస్సులు పొందండి

- గున్నాల నర్సింలు...



మార్కండేయుడి విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని మార్కండేయుడు ఆశీస్సులు పొందండి.వేద పండితులు, యతీశ్వరులు, మునులు,సాధుసంతుల మంత్రోచ్చారణలతో మార్కండేయ ఆలయ ప్రాంగణమంతా అత్యంత పవిత్రంగా మారింది.

### ఆలోచనను ఆచరణలో పెట్టాం

- చిప్ప అనంతం



రెండు సంవత్సరాల క్రితం మార్కండేయ సంఘంలో కూర్చుని మాట్లాడుకున్నప్పుడు భక్త మార్కండేయ ఆలయాన్ని నిర్మిద్దామనే ఆలోచన రాగానే, అందరి సహాయ సహకారాలతో ప్రారంభించిన ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా వేగవంతంగా సాగి త్వరితగతిన పూర్తయ్యాయి. ప్రతిష్టాపన కార్యక్రమాలు ప్రస్తుతం అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.



### ఆధ్యాత్మిక దైవచింతన పెంచుకోవాలి..

- గోస్కె శ్రీనివాస్

సనాతన హిందూ హైందవ ధర్మాన్ని కాపాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక దైవచింతన పెంచుకోవాలి. మార్కండేయుడు తన 16 సంవత్సరాల వయస్సులోనే ఓం నమశ్శివాయ అనే మంత్రంతో శివుడిని ఆరాధించి మృత్యుంజయుడిగా ఆశీర్వదించబడ్డాడు. ఇదే భక్తి మార్గాన్ని నేటి యువత తమ దైనందిత జీవితంలో అలవర్చుకోవాలి.చిన్న పిల్లలకు మన ఆచార సాంప్రదాయాలు తప్పకుండా తెలియజేయాలి

## డాక్టర్ గదరాజు చందు ను అభినందించిన మాజీ సీఎం కేసీఆర్



**చేర్యాల వెలుతురు మార్చి 05:**

చేర్యాల మండలం కడవేరుగు గ్రామానికి చెందిన డాక్టర్ గదరాజు చందును టీఆర్ఎస్ అదినేత, మాజీ సీఎం కేసీఆర్ అభినందించారు. గదరాజు చందు ఇటీవల ఓయూ ప్రొఫెసర్ ఎం.గోనా నాయక్ పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్రంలో దొమ్మర కులస్తుల సంస్కృతి, సాహిత్య పరిశీలన అంశం పై పరిశోదన పూర్తి చేసి ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందారు. సంబందిత సిద్ధాంత తొలి గ్రంథాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చొరవతో మాజీ సీఎం కేసీఆర్ ను కలిసి చందు అందజేసి పరిశోధన విషయాలను వివరించారు. అనంతరం కేసీఆర్ స్పందిస్తూ తెలంగాణ ఆదిహిందూ జాతికులాల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ తెలంగాణ బిడ్డలపై ఉందని, గ్రామీణ ప్రాంత బిడ్డగా అరుదైన పరిశోధన జరిపిన చందును అభినందించారు. ఆయనవెంట రాళ్లబండి చందు, బొంగురం జితేందర్ రెడ్డి తదితరులు కెసీఆర్ ను కలిసిన వారిలోఉన్నారు.

## ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ ఎస్కే చాంద్



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 5**

తెలంగాణ ఉద్యమకారులకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రేపు జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం తీర్మానం చేయాలని, ప్రతి ఉద్యమకారునికి గుర్తింపు కార్డు ఇవ్వాలని, 250 చదరపు గజాల స్థలము, 25వేల రూపాయల పింఛన్, తెలంగాణ ఉద్యమంలో, పాల్గొన్న నిజమైన ఉద్యమకారులను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా ఇవ్వాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఇచ్చిన పిలుపుమేరకు, రామన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్కే చాంద్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపినారు. అనంతరం రామన్నపేట మండల కేంద్రం నుంచి పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు అమరవీరులకు నివాళులు అర్పించే, విధంగా వారి గుర్తింపుగా మండల కేంద్రంలో, అమరవీరుల స్తూపం చేయాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు నోముల శంకర్ ఉద్యమ నాయకులు రెబ్బాసు రాములు డాక్టర్ నకిరేకంటి అశోక్ కుమార్, కందాల శివశంకర్ ,బేడిద లింగం, రవి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రామయ్య చెరువుకు హద్దురాళ్ళను ఏర్పాటు చేయాలి

- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా
- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కందుల హనుమంతు



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 5**

మండల కేంద్రంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలో ఉండబడిన చెరువుకుంటలకు హద్దురాలను ఏర్పాటు చేయాలని స్థానిక తహసిల్దార్ లాల్ బహదూర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కందుల హనుమంతు మాట్లాడుతూ సొసైటీ పరిధిలో ఉండబడిన వెంకట్రామయ్య చెరువు మరియు లోతుకుంట తమ్మల్లోని, కుంటలకు ,హద్దురాలను నాటాలని మత్స్యకారులకు జీవనధారమైన చెరువుకుంటలను కాపాడాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పిట్టల మత్స్యగిరి డైరెక్టర్ రేపాక రాజు మాజీ డైరెక్టర్ బచ్చ రాములు యాదగిరి మత్స్య మహిళా సొసైటీ ఉపాధ్యాక్షులు రేపాక పోచమ్మ డైరెక్టర్ కందుల లలిత, రాములమ్మ, లక్ష్మమ్మ, భాగ్యమ్మ, ఇందిరమ్మ, పద్మ, నరసమ్మ, యాట గణేష్, బొల్ల వెంకన్న, పట్ల శ్రీశైలం,శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## తల్లికి వందనానికి త్వరలో మార్గదర్శకాలు: లోకేశ్

**అమరావతి,మార్చి5( వెలుతురు):**

'తల్లికి వందనం' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే ఇస్తాం. బడ్జెట్‌లో రూ.9407 కోట్లు ఈ పథకానికి కేటాయించాం. గత ప్రభుత్వంలో దీనికి ఏడాదికి రూ.5,540 కోట్లు కేటాయించారు, గతంతో పోలిస్తే ఇది 50శాతం అధికం. ఎన్నికలకు ముందు సూపర్-6 అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'తల్లికి వందనం' పథకాన్ని చంద్రబాబు ప్రకటించారు. మే నెలలో తప్పనిసరిగా ఇంటిలో ఎంతమంది చదువుకునే బిడ్డలుంటే అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తాం' అని లోకేశ్ తెలిపారు.

# ప్రభుత్వ హాస్పిటిల్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి

- కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలి...
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్...



**జహీరాబాద్ వెలుతురు మార్చ్ 05:**
ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని, పెర్మనెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ కార్మికులకు ఇవ్వాల్సిన జీతాలు కూడా ఇవ్వకుండా కాంట్రాక్టర్లు కార్మికుల జీతాలలో కట్ చేస్తున్నారని ఫిర్యాదులు చేసినా పట్టించుకోకుండా వ్యవహరిస్తూ, వస్తున్న జీతాలు సరిపోక అనేక అవస్థలు పడుతున్నా జీతాలు పెంచకుండా చోద్యం చూస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఆందోళన తీవ్రతరం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎలీషా, నాయకులు అనిల్, జాఫర్, తదితరులున్నారు.

# అమీన్‌పూర్ మున్సిపాలిటీ బ్యాంక్ కాలనీలో స్థానిక సమస్యల పరిశీలన

- డ్రైనేజ్ & రోడ్డు సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చించిన - కాట సుధా శ్రీనివాస్ గౌడ్



**అమీన్‌పూర్ వెలుతురు మార్చి 05:**
అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బ్యాంక్ కాలనీలో సందర్శించిన సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గారు, కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ మరియు రోడ్డు సమస్యలపై అక్కడి ప్రజలు తన దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల నిత్యజీవితంలో ఇలాంటి సమస్యలు ఉండకూడదని, వీటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

# వెల్లంకి గ్రామంలో వెలుగు నింపిన తేజ అతను అభివృద్ధితో అవార్డును అందించిన మహా నాయకుడుకు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 5**
వెల్లంకి గ్రామానికి చెందిన ఎడ్ల మహేందర్ రెడ్డి మాజీ సర్పంచ్ గ్రామ ప్రజలు ప్రేమానురాగాలతో అందరివాడేటిగా అభివృద్ధిని పరుగులు పెట్టించుటకు, ప్రజల కోరికలను సూచనలను ఎప్పటికప్పుడు ఏ వార్డులో, ఏ వీధిలో, ఏ సమస్య ఉన్న పరిష్కారం దిశగా అడుగులు వేసి పరిష్కరించేవాడు, గ్రామాలలో మురికి కాలువలు సిసి రోడ్లు పరిశుద్ధం పై పట్టు సాధించి పార్టీ ల కు అతీతంగా పనిచేసే నాయకుడుగా ప్రజలకు సుపరిచితుడు అయ్యాడు. ముక్కుసూటితనం ఆయన సొంతం ఏ విషయంలోనైనా ఈ రోజుల్లో నాయకులు తన చుట్టూ తిప్పుకుంటారు . ఉందా అబద్దాలు చెప్పి మోసం చేస్తుంటారు. కానీ ఎవరి వల్ల కాని పని మహేందర్ రెడ్డి తోపని అయితే అయితుందని అందరూ అంటుంటారు. ముక్కుసూటితనం అభివృద్ధిని ఆకాశం అంత ఎత్తులో ఉంచని నాయకునిగా నల దిక్కులు రాష్ట్రంలో ఆయన పేరు మారుమోగుతుందంటే ,గ్రామానికి చేసిన సేవలు ఎంతో గాని చరిత్రలో నిలిచాయి. జన్మదిన వేడుకలు అందరి సమక్షంలో నిర్వహించుకున్నాడు.

# టిటిడి మాజీ ఇవో రమణాచారికి శస్త్రచికిత్స

**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**
తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, టిటిడి మాజీ ఇవో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారికి బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ దవఖానలో బుధవారం మోకాలికి శస్త్ర చికిత్స జరిగింది. గత కొంత కాలంగా మోకాలి నొప్పితో భాధపడుతున్న రమణాచారికి ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ గురువారెడ్డి నేతృత్వంలోని వైద్యుల బృందం మోకాలికి శస్త్ర చికిత్స నిర్వహించారు. రమణాచారికి మోకాలి శస్త్రచికిత్స విజయవంతమైనట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాల క్రితం ఒక కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. మళ్లీ ఆయనకు మరో కాలికి శస్త్ర చికిత్స అవసరం పడడంతో తప్పని పరిస్థితిలో దానికి కూడా బుధవారం చికిత్స చేయించుకున్నారు. ఐసీయులో చికిత్స పొందుతున్న రమణాచారిని గురువారం ప్రత్యేక గదికి తరలించి మరో మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందిన అనంతరం ఆరోగ్యం మెరుగుపడగానే డిశ్చార్జి చేసే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించారు. ఒక నెలరోజుల పాటు ఫిజియోథెరపి ప్రక్రియ ద్వారా ఆయన కోలుకుంటారని వైద్యులు తెలిపారు.

# కనీస వేతననాల పెంపు కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం...

- పెరుగుతున్న ధరలకనుగుణంగా రూ. 26,000 ఇవ్వాలి...
- పాత జీవో ల స్థానంలో కొత్త జీవోలు ఇవ్వాలి...
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు...



**జహీరాబాద్ వెలుతురు మార్చి 05:**
రాష్ట్రంలో అమలు అవుతున్న కనీస వేతనాలు పెరుగుతున్న ధరలతో సరిపోక కార్మికులు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం 26,000 పెంచాలని, వేతనాల పెంపుకొసం సిఐటియు రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడుతుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. బుధవారం జహీరాబాద్ లోని మహీంద్రా ట్రాక్టర్ పరిశ్రమలో సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం సరిపోక పెద్ద ఎత్తున కార్మికులు ఇబ్బందులకు గురవుతున్న కార్మికులు కనీస వేతనాలు పెంచకపోవడం సరైనది కాదని, 11సంవత్సరాలు అయినా కనీసం పాత జీవో ల స్థానంలో కొత్త జీవో లను కూడా ఇవ్వడం లేదని, కేవలం ప్రభుత్వాలు పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తల కోసం కార్మికులను మోసం చేయడం సిగ్గుచేటనీ, సరైన పద్ధతి కాదని అన్నారు. కార్మికులు ఉత్పత్తి చేస్తే ఉత్పత్తి జరుగుతుందని కార్మికులను కాదని పెద్దల కోసం పనిచేయడం సరైనది కాదని అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో ఒకటో తారీకు నుంచి ఏడో తారీఖు వరకు పెద్ద ఎత్తున కర్మికులను సమీకరించి ఆందోళనలను చేస్తున్నమని, కార్మికుల వేతనాలు పెంచక పోతే, కొత్త జీవో లు ఇవ్వకుంటే రాష్ట్రం లో పెద్ద ఎత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు. అన్నారు. కనీస వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న క్యాంపెయిన్ లో సీఐటీయూ కార్యకర్తలు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గణేష్, జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, నాయకులు వంశీక్రిష్ణ, బాబు, ఇస్మాయిల్, సురేష్, శ్రీకాంత్, తదితరులున్నారు.



# శ్రీ చైతన్య స్కూల్, దిల్ సుఖ్ నగర్ బ్రాంచ్ లో ఘనంగా "ఫ్యామిలీ బ్లూమ్ వేడుకలు.

**హైదరాబాద్ వెలుతురు మార్చి 05:**
సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా శ్రీచైతన్య స్కూల్ దిల్ సుఖ్ నగర్ బ్రాంచ్ లో బుధవారము నాడు ఘనంగా "ఫ్యామిలీ బ్లూమ్" మహోత్సవము నిర్వహించి విద్యార్థినీ విద్యార్థులకు కుటుంబము మరియు తల్లిదండ్రుల త్యాగాలు, వారి యొక్క గొప్పతనమును తెలియజేసి - వారిచే నైతిక విలువలు కలిగి, సత్ప్రవర్తన కలిగి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. మరియు విద్యార్థినీ విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు భక్తి శ్రద్ధలతో పాద పూజ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దిల్ సుఖ్ నగర్ జోన్ (శ్రీ చైతన్య పాఠశాల ఏ.జి.యం టి. సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సంస్కారములను అలవర్చుకున్నప్పుడే జీవితానికి సార్థకత లభిస్తుందని మరియు బాల్యంలోనే మంచి గుణాలను అలవర్చకోవడం ఎంతగానో అవసరమని ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహద పడతామని తెలిపారు. ఈ సందర్భముగా నైతిక విలువలు, వినయ విధేయతలు పెంపొందించే విధంగా సంస్కృతిక కార్యక్రమాలని విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమములో శ్రీ చైతన్య స్కూల్స్ దిల్ సుఖ్ నగర్ జోన్ ఆర్.ఐ. వెంకట్ రెడ్డి, ఏకాడమిక్ కోఆర్డినేటర్ జితేందర్ గౌడ్, ప్రిన్సిపాల్ ఉమ, అకాడమిక్ డీన్ శ్రీను, ఐ.పి.ఎల్.ఇంచార్జ్ పద్మజ, సిబిబ్యాచ్ ఇంచార్జ్ నవీన్ గారు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు

# అమెరికా లో దుండగుడి కాల్పుల్లో ప్రవీణ్ మృతి

- విషాదంలో మునిగిన ప్రవీణ్ కుటుంబం
- ఉన్నత చదువుల నిమిత్తం అమెరికా వెళ్లిన ప్రవీణ్



**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 5:**
అమెరికా లో ఉన్నత చదువుల కోసం వెళ్లిన రంగారెడ్డి జిల్లా కేశంపేట కు చెందిన గంప ప్రవీణ్ ను అక్కడి దుండగుడు దారుణంగా కాల్చి చంపాడు,అమెరికా లో ఎం ఎస్ ఉన్నత చదువు ల నిమిత్తం ప్రవీణ్ విస్కా నీన్స్ మిల్వాకి అనే ప్రాంతం లో నివాసం ఉంటున్నాడు, అయితే ప్రవీణ్ తాను నివాసం ఉండే ప్రాంతానికి సమీపంలోని బీచ్ కు వెళ్లగా అక్కడ దుండగుడు ప్రవీణ్ పై కాల్పులను జరిపాడు, దీంతో ప్రవీణ్ అక్కడే మృతి చెందాడు, దీంతో అతన్ని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది,

## బాహుబలి బడ్జెట్ అంటూ గొప్పలు

(మొదటి పేజీ తరువాయి..)
తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ఆయన బడ్జెట్ వ్యవహారాలపై మీడియాకు వివరించారు. అసెంబ్లీలో ప్రతిపక్షం చెబుతున్న మాటలు వినడం లేదు. అందుకే మీడియా ముందుకు వచ్చాం. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రెండు బడ్జెట్‌లు ప్రవేశపెట్టింది. సూపర్ సిక్స్, 143 హామీల కోసం అరకొర కేటాయింపులు చేశారు. అన్నిరకాలుగా మోసం చేసిన తీరు తేటతెల్లంగా కనిపిస్తోందని అన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కాస్త బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ అయ్యింది. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్, సెవెన్ అంటూ ఊదరగొట్టారు. చంద్రబాబు దత్తపుత్రుడు కలిసి మేనిఫెస్టో రిలీజ్ చేశారు. ప్రతీ ఇంటికి బాండ్లు పంచారు. 20 లక్షల ఉద్యోగాలు,. రూ.3 వేల నిరుద్యోగ భృతి సాయం అన్నారు. ఇప్పుడు హామీలపై అడిగితే సమాధానం లేదు. రెండు బడ్జెట్‌లలోనూ నిధులు కేటాయించలేదు. ప్రజలను మోసం చేసిన తీరు స్పష్టంగా కనిపిస్తోంది. తొమ్మిది నెలల్లోనే 4 లక్షల ఉద్యోగాలు ఇచ్చేశామని చెప్పారు . గవర్నర్‌తో అబద్దాలు చెప్పించారని అన్నారు. ఆత్మస్తుతి పరనింద అన్నట్లుగా బడ్జెట్ ప్రసంగం ఉంది. తొలి బడ్జెట్ లో కేటాయించింది బోడి సున్నా. ఈ ఏడాది కూడా నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ప్రతి నిరుద్యోగికి భృతి రూ.72 వేలు ఎగనామం పెట్టారు. 2024-25 సోషియో ఎకనమిక్ సర్వేలో ఎంఎస్ఎంఈ సెక్టార్‌లో 27 లక్షల ఉద్యోగాలిచ్చామని చెప్పారు. బడ్జెట్ లో ప్రతిపాదించకుండా లక్షల ఉద్యోగాలు ఎలా ఇచ్చారని అన్నారు. జగన్ చెప్పినదానికంటే ఎక్కువ ఇస్తున్నామని ఫోజులు కొడుతున్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా.. ఉన్న ఉద్యోగాలను పీకేస్తున్నారు. పారిశ్రామిక వేత్తలను బెదిరిస్తున్నారు. ఏపీ రావాలంటే కంపెనీలు భయపడుతున్నాయన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో వివిధ సెక్టార్‌లో ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య 6 లక్షలు. మొత్తం మా పాలనలో అన్నీ రంగాలకు కలిపి 40 లక్షల పైచిలుకు ఉద్యోగాలిచ్చాం. ఆధార్ కార్డులతో సహా ఆ వివరాలు చెప్పగలం. ఇది ఎవరూ కాదనలేని సత్యాలని అన్నారు. 18 నుంచి 60 ఏళ్ల మహిళకు సంవత్సరానికి రూ.18 వేలు ఆడబిడ్డ నిధి అన్నారు. దానికి ఎగనామం పెట్టారు. ఉచిత బస్సు కోసం మహిళలంతా ఎదురు చూస్తున్నారు. ఉచిత ప్రయాణాలు ఎప్పుడెప్పుడు చేస్తామా అని ఆశగా చూస్తున్నారు. మహిళల సంక్షేమం పేరిట ఈ హామీతో రూ.7 వేల కోట్లు ఎగ్గొట్టారు. స్కూల్‌కి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేల సాయం అన్నారు. ఎంత మంది ఉంటే అంత మందికి ఇస్తామని అన్నారు. తల్లికి వందనం కోసం మొదటి బడ్జెట్ లో రూ. 5, 386 కోట్లు కేటాయింపులు చేశారు. ఈసారి నెంబర్ మోసంతో ప్రజలను మభ్య పెడుతున్నారు. ఎలాగూ మోసం చేసేది కదా అని ఇలా చేస్తున్నారు. చివరికి చిన్న పిల్లాడికి కూడా బకాయిలు పెడుతూ.. ఎగనామం పెడుతున్నారు. చంద్రబాబుకి రైతులను మోసం చేయడం కొత్తేం కాదు రైతు భరోసా పేరిట రైతన్నలను గతంలోనే కాదు.. ఇప్పుడూ మోసం చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల సాయం అందిస్తామన్నారు. కిందటి ఏడాది ఎగ్గొట్టారు. ఈసారి కూడా ఆ పని చేస్తే.. రెండు బ్జడెట్‌లకు కలిపి రూ.40 వేలు ఎగనామం పెట్టినట్లు అవుతుంది. దీపం పథకం కింద మరో మోసానికి దిగారు. ఎలాగూ ఎగనామం పెట్టేదే కదా.. మోసమే కదా అని కేటాయింపులు చేసుకుంటూ పోయారు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం.. 50 ఏళ్లు నిండిన వాళ్లకు పెన్షన్‌ల విషయంలో మరో 20 లక్షల మంది జత కావాల్సి ఉంది. రెండేళ్లలో రూ.96 వేల చొప్పున మోసం చేశారు. సూపర్ సిక్స్.. సెవెన్ కింద అన్ని పథకాలకు కలిపి మొత్తం.. దాదాపు రూ.80 వేల కోట్లు కావాలి. కిందటి ఏడాది రూ.7 వేల కోట్లు పెడితే.. రూ.800 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. ఈసారి బడ్జెట్ కేటాయింపులే రూ.17, 179 కోట్లు మాత్రమే. బాబు షూరిటీ.. మోగ్యారెంటీకి ఇదే నిదర్శనం. వైఎస్సార్సీపీ వాళ్లకు పథకాలు ఇవ్వకూడదని, ఎలాంటి సాయం చేయకూడదని చంద్రబాబు అన్నారు. ఇవ్వకపోవడానికి అదేమైనా మీ బాబుగారి సొమ్మా.అది ప్రజల సొమ్ము.ప్రజల సొమ్ముతో ప్రభుత్వం నడుస్తోంది.పక్షపాతానికి, రాగద్వేషాలకు అతీతంగా పాలన చేస్తానని రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేసి ఇలా.. బహిరంగంగా మాట్లాడతారా?. ఇలాంటి వ్యక్తి సీఎంగా అర్హుడేనా?.. . ఇలాంటికిని సీఎం స్థానంలో కొనసాగించడం ధర్మమేనా?. అని జగన్ ప్రశ్నించారు. మా హయాంలో సంక్షేమానికి కేరాఫ్‌గా నిలిచాం. మా హయాంలో 4 పోర్టులకు శ్రీకారం చుట్టాం. 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చాం. 10 పిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టాం. విద్యారంగంలో కీలక సంస్కరణలు తెచ్చాం. నాడు-నేడు కింద స్కూళ్ల రూపురేఖలు మార్చేశాం. చంద్రబాబు హయాంలో విద్యా వ్యవస్థ పూర్తిగా నాశనం అయ్యింది. మా హయాంలో 66 లక్షల మందికి పెన్షన్‌లు అందించాం. బాబు పాలనలో 62 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నారు. కొత్తగా ఎవరిని చేర్చకపోగా.. ఉన్నవాళ్లలో 4 లక్షల మంది లబ్దిదారులను తొలగించారు.బడ్జెట్ కేటాయింపుల్లోనూ పెన్షన్ నిధులు తగ్గించేశారు. రూ.15 వేలు ఇస్తామని వాహనమిత్రకు ఎగనామం పెట్టారు. ముస్లింలకు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షలు ఇస్తామని మోసం చేశారని జగన్ విమర్శలు గుప్పించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ క్యాలెండర్ అమలు చేశాం. మా హయాంలో అక్కాచె÷-లలెల్లకు భరోసా ఉండేది. తమ కాళ్లపై నిలబడేలా అడుగులు ముందుకు వేశాం. ఇప్పుడు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి పథకాలు లేవు. విద్యాదీవెన పథకానికి నిధులు ఇవ్వలేదు. ఫీజులు కట్టలేక పిల్లలు చదువులు వదిలేసే పరిస్థితికి వచ్చారు. ఈ పరిస్థితిపై వైఎస్సార్సీపీ పోరాటం చేయనుంది. మార్చి 12న విద్యార్థులు, తల్లిదండ్రుల సమన్వయంతో వైఎస్సార్సీపీ ఫీజు పోరు ఉంటుంది కూటమి ప్రభుత్వంలో.. వ్యవసాయం, వైద్యం, ఆరోగ్యం, విద్య ఇలా అన్ని రంగాలను నాశనం చేశారు. అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారు. మేం తెచ్చిన విప్లవాత్మక మార్పులను.. నిర్వీర్యం చేశారు. మిర్చి రైతులను దారుణంగా మోసం చేశారు. సమస్య పరిష్కరించామని అసెంబ్లీలో అబద్దాలు చెబున్నారను. కేజీ మిర్చి కూడా కొనలేదు. ఉద్యోగులను చంద్రబాబు దారుణంగా మోసం చేశారు. కోవిడ్‌లాంటి మహమ్మారి టైంలోనూ మెరుగైన జీతాలు.. అదీ సకాలంలో మేం చెల్లించాం. ఇవాళ జీతాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఏటా ఇచ్చే ఇంక్రిమెంట్లను ఎగ్గొట్టారు. ఐఆర్, పీఆర్సీ, పెండింగ్‌బకాయిలు ఇవన్నీ ఇవ్వబోమని చంద్రబాబు ప్రభుత్వం చెబుతోంది. అయ్యా.. పయ్యావులగారూ.. కరోనా టైంలోనూ సాకులు చెప్పకుండా మేం అన్నీ సక్రమంగా నడిపించాం. ఇప్పుడు మీరు ఎగ్గొటడానికి సాకులు వెతుకుతున్నారు. 2014-19కి రూ.4 లక్షల కోట్ల అప్పులు ఉంటే.. 2024 నాటికిరూ.6 లక్షల కోట్ల అప్పు ఉంది. కాగ్ లెక్కలు కూడా ఇదే స్పష్టం చేశాయి. కానీ, రూ. 10 లక్షల కోట్ల అప్పు ఉందని ప్రచారం చేశారు. గవర్నర్ ప్రసంగంలోనూ అబద్దాలు చెప్పించారు. సాధారణంగా.. బడ్జెట్ గ్లాన్స్‌లో పదేళ్ల కిందట అప్పుల లెక్కలు ఉంటాయి. కానీ, లెక్కలు చూపిస్తే ఎక్కడ దొరికిపోతామోనని మొన్నటి బడ్జెట్ లో అది చూపించలేదు. చంద్రబాబు, ఆయన మనుషుల జేబుల్లోకి డబ్బులు వెళు _న్నాయి. ఆర్థికవేత్తల అంచనాకి కూడా అందకుండా చంద్రబాబు ప్రజలపై బాదుడు బాదబోతున్నారు. అయ్యా స్వామీ.. ఏంది ఈ మోసాలు?.. బడ్జెట్ అంతా అంకెల గారడీ.. దీనిని పట్టుకుని బాహుబలి బడ్జెట్ అనడం వాళ్లకు మాత్రమే చెల్లుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సొంత ఆదాయం ఏకంగా 9.5 శాతం పెరిగిందని చంద్రబాబు చెబుతున్నారు. ఎ కానీ, కాగ్ నివేదిక చూస్తే.. ఎస్ఓఆర్ తగ్గింది. చంద్రబాబు వచ్చాక ఆదాయం తగ్గింది. రాష్ట్ర సొంత ఆదాయం ఎస్ఓఆర్ పెరగలేదు. అది పెరగకపోగా, చాలా తగ్గింది. మూల ధన వ్యయం కూడా దారుణంగా తగ్గింది. ఇలాంటి పరిస్థితులున్నా, చంద్రబాబు ఏమంటున్నాడు. జీఎస్‌డీపీ 12.94 శాతం నమోదు అవుతుందని చెబుతున్నాడు. ఎలా సాధ్యం?. వాస్తవాలు ఇలా ఉంటే, ఈ ఏడాది బడ్జెట్ రూ.3,22,359 కోట్లు ఎలా సాధ్యం? ఇది అంకెల గారడీ కాదా?. పైగా దీన్ని బాహుభలీ బడ్జెట్ అనడం మీకే చెల్లిందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ విజయంతో ప్రజల్లో తమకు సానుకూలత ఉందన్న కూటమి ప్రభుత్వ వాదనపై జగన్ స్పందించారు. ప్రపంచ చరిత్రలో ఎమ్మెల్సీ ఫలితాల్లో రిగ్గింగ్ చేసేవాళ్లను ఎక్కడా చూడలేదు. ఫస్ట్ టైం ఇక్కడే చూశా. అయినా ఉత్తరాంధ్ర స్థానంలో టీచర్లు కూటమికి బాగా బుద్ధి చెప్పారు. అక్కడ రిగ్గింగ్ కుదరదు కాబట్టి ఓడిపోయారు అసెంబ్లీలో రెండే పక్షాలు ఉన్నాయి.. ఒకటి అధికారం.. మరొకటి ప్రతిపక్షం . ప్రధాన ప్రతిపక్ష హోదా మాకు కాకుంటే ఇంకెవరికి ఇస్తారు . రెండు వైపులా మీరే కొడతామంటే.. ఇదేమైనా డబుల్ యాక్షన్ సినిమానా? గతంలో టీడీపీ నుంచి ఐదుగురు మా వైపు వచ్చారు. మరో పది మందిని లాగుదామంటే నేనే వద్దన్నా.. ఏం మాట్లాడతావో మాట్లాడు.. నేను వింటా అని చంద్రబాబుకి ప్రతిపక్ష హోదా ఇచ్చా. ఇదే ఆయనకు నాకు తేడా మైక్ ఇస్తేనే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి. అది ఇవట్లేదు కాబట్టే ఇలా మీడియా ముందుకు రావాల్సి వస్తోందని అన్నారు. టీడీపీ తర్వాత జనసేన అతిపెద్ద పార్టీ అని.. కాబట్టి తాము ఉండగా ఈ ఐదేళ్లు వైఎస్సార్సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా రాదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారని మీడియా ప్రతినిధులు జగన్ వద్ద ప్రస్తావించారు. పవన్ కల్యాణ్ అనే వ్యక్తి కార్పొరేటర్‌కు ఎక్కువ.. ఎమ్మెల్యేకు తక్కువ. జీవిత కాలంలో ఒక్కసారి ఆయన ఎమ్మెల్యే అయ్యారు అని జగన్ సెటైర్ వేశారు. అసెంబ్లీలో ప్రతిపక్షం వర్షన్ వినిపించే అవకాశం లేకపోవటంతో.. తమ వైపు నుంచి ప్రజలకు వివరించటం కోసమే ఈ సమావేశం అని తెలిపారు.

# ఘనంగా నరహరి ఐఏఎస్ పుట్టిన రోజు వేడుకలు





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ మార్చి 05**
మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, దేశంలోని ప్రముఖ ఐఏఎస్ అధికారులలో ఒకరైన, పేద ప్రజల ఆశాజ్యోతి సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి పుట్టిన రోజు వేడుకలు బసంత్ నగర్ లోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు తినిపించారు. ఆయన అభిమానులు, మిత్రులు, ఆలయ ఫౌండేషన్ సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జడ్పిటీసి ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొయ్యల ఏమాజి పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, సీనియర్ నాయకుడు కేశవ్ రెడ్డి, ఆర్ టి సి కార్మిక నాయకులు కే.ఎస్. రావు, ఆలయ ఫౌండేషన్ సీఇఓ రమేష్, డిప్యూటీ సీఈఓ రాజేందర్, తిరుపతి, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

- శాంతి గాని లాంగ్ వాల్ పనులను విరమించుకోవాలి
- లాంగ్ వాల్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు సింగతి కిరణ్ కుమార్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ మార్చి 05**
మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని శాంతి గని ఉపరితల గనిలో లాంగ్ వాల్ 2 విస్తరణ కోసం నేడు ప్రజాభిప్రాయ శ్రీకరణ నిర్వహించినట్లు సింగరేణి అధికారులు తెలిపారు. దీనికి విరుద్ధంగా లాంగ్ వాల్ వ్యతిరేక కమిటీ అధ్యక్షులు సంగతి కిరణ్ కుమార్ పలు గ్రామాల ప్రజలను లాంగ్ వాల్ వద్దు రైతుల బాగోగులే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ గ్రామ గ్రామాన ప్రచార నిర్వహించారు. నేడు జరగబోయే లాంగ్ వాల్ 2 ప్రజాభిప్రాయ సేకరణ ను రద్దు చేయాలంటూ కమిటీ అధ్యక్షులు సింగతి కిరణ్ కుమార్ హెచ్చరించారు. లాంగ్ వాల్ పనులు మొదలుపెడితే పెరిక పల్లి, ఆకనపల్లి, లింగాపూర్, దుబ్బుపల్లి, పాత బెల్లంపల్లి గ్రామాలలో బోర్లు ఎండిపోయి నీటి వసతి దొరకదని మండిపడ్డారు ఏది ఏమైనా లాంగ్ వాల్ 2 ను వ్యతిరేకిస్తున్నట్లు నేడు జరగబోయే ప్రజాభిప్రాయ సేకరణ ను వ్యతిరేకిస్తున్నట్లు ఆ కమిటీ అధ్యక్షులు సింగతి కిరణ్ కుమార్ తెలియజేశారు.

# నేడే శాంతి గాని లాంగ్ వాల్ 2 ప్రజాభిప్రాయ సేకరణ

- సింగరేణి జనరల్ మేనేజర్ దేవేందర్




**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ మార్చి 05**
మంచిర్యాల జిల్లా మందమర్రి సింగరేణి ఏరియా జిఎం జి. దేవేందర్ నేడు శాంతి గని లాంగ్ వాల్ 2 లో ప్రజాభిప్రాయ సేకరణ జరుపనున్నట్లు తెలిపారు. నేడు శాంతి గాని మైన్ లో జరిగే ప్రజాభిప్రాయ సేకరణకు పలు గ్రామాల ప్రజలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జనరల్ మేనేజర్ దేవేందర్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# రాష్ట్ర ఎన్నికల కమీషనర్ను మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ మార్చి 05**
మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలోని సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఐ.రాణి కుముదిని ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్) ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

# ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష కేంద్రాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్.

- ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు
- పరీక్షా కేంద్రాల వద్ద 163 BNSS-2023 అమలు




**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ మార్చి 04**
గోదావరిఖని లోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామగుండంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష కేంద్రాలను పరిశీలించి పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు గురించి తగు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షలు జరిగే సమయంలో సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు పేపరు వచ్చేటప్పుడు, పరీక్ష అనంతరం జవాబు పత్రాలు తీసుకొని వెళ్లేటప్పుడు తప్పకుండా ఎస్కార్ట్ ఉండాలని సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో అధికారులు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ లు ఇంద్రసేన రెడ్డి, రవీందర్ లు, రామగుండం సీఐ ఓ ప్రవీణ్ కుమార్, రామగుండం ఎస్ఐ సంధ్య రాణి, సిసి హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ మార్చి 05**





మంచిర్యాల జిల్లాలో ఈ నెల 25వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మొదటి రోజు జనరల్ పరీక్షకు 5 వేల 697 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 5 వేల 472 మంది, ఒకేషనల్ పరీక్షకు 668 మంది హాజరు కావలసి ఉండగా 606 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, త్రాగునీరు, ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, విద్యార్థుల పరీక్ష కేంద్రంలోనికి వెళ్ళే సమయంలో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలోని మొబైల్, ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరుగదని, ప్రతి పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ. ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో సమయానుసారంగా బస్సులు నడిపించడం జరుగుతుందని, పరీక్ష ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలను బందోబస్తు మధ్య తరలించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచుతూ పరీక్ష సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ మార్చి 05**





మంచిర్యాల జిల్లాలో ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ లతో కలిసి ఎ.సి.పి.లు, తహశిల్దార్లు, సి.ఐ.లు, ఎస్.ఐ.లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన తరువాత ఈ నెల 10వ తేదీ నుండి ప్రారంభమయ్యే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి తహశిల్దార్, ఎస్.హెచ్.ఓ., మండల పంచాయతీ అధికారి, మున్సిపల్ పరిధిలో తహశిల్దార్, ఎస్.హెచ్.ఓ., మున్సిపల్ కమీషనర్ హాజరై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి కనీసం 15 రోజులు, గరిష్టంగా 21 రోజులలోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిధిలో పరిష్కారమయ్యే భూ సమస్యలను రికార్డులను సరి చూడాలని, దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలని తెలిపారు. డివిజన్ స్థాయిలో రాజస్వ మండల అధికారి, ఎ.సి.పి.లు, జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డి.సి.పి.లు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి అప్పటికప్పుడు పరిష్కారమయ్యే వాటిని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి ఆయా స్థాయిలలో రిజిస్టర్ ఖచ్చితంగా నిర్వహించాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, తమ పరిధిలో లేని సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పైస్థాయికి సిఫారసు చేయాలని తెలిపారు. కోర్టులో పరిష్కారమయ్యే సమస్యలపై సంబంధిత అర్జీదారులకు అవగాహన కల్పించాలని, బెదిరింపులు, ఆందోళన చర్యలకు పాల్పడినట్లయితే సంబంధిత వ్యక్తులపై ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారం కొరకు అవసరమైన సమాచారాన్ని ఆయా స్థాయిల పరిధిలోని వివిధ శాఖల నుండి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఆక్రమిత ప్రభుత్వ భూములను చేపట్టిన నిర్మాణాలను తొలగించి స్వాధీనపర్చుకోవాలని తెలిపారు. భూములకు సంబంధించి తప్పుడు / నకిలీ ధృవపత్రాలకు సంబంధించి జిల్లా స్థాయి అధికారులకు రిపోర్టు చేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఎ.సి.పి.లు ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, మండలాల తహశిల్దార్లు, సి.ఐ.లు, ఎస్.ఐ.లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సైరెడ్డి నరసింహ రెడ్డి



**బోడుప్పల్ వెలుతురు:**
సామాన్య ప్రజలకు సరైన సమయంలో ప్రథమ చికిత్స అందించడంలో అర్ఎంపీ,పీఎంపీల పాత్ర చాల కీలకమ ని అర్ఎంపీ,పీఎంపీల అధ్యక్షుడు సైరెడ్డి నరసింహ రెడ్డి అన్నారు. బుధవారం నాడు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి లో జరిగిన అర్ఎంపీ,పీఎంపీల సమావేశంలో నూతన అధ్యక్షుడిగా సైరెడ్డి నరసింహ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న అర్ఎంపీ,పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షు లుగాఎ. శ్రీనివాస్,మహేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి రాజేందర్ రావు, సంయుక్త కార్యదర్శిగా భాసాని విద్యాసాగర్,వెంకట్ రెడ్డి. కోశాధికారిగా ఎ.కుమార్, గౌరవ అధ్యక్షులుగా వి.చంద్రమౌళి, ముఖ్య సలహాదారుగా ఎం.ఆనంద రాజ్,డి సంజీవ, కార్యవర్గ సభ్యులుగా రచ్చ వాసుదేవ్ ,ఎం వి గౌడ్,శ్యాంసుందర్ లను ఎన్నుకున్నారు.

# నియోజక వర్గం అభివృద్ధి లక్ష్యం గా పని చేస్తా

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



**వెలుతురు, ఆదిలాబాద్,మార్చి 5:**
నియోజవర్గ అభివృద్ధి లక్ష్యం పార్లమెంట్ సభ్యులు గేడం నాగేశ్ అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా తాను పనిచేస్తున్నానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ప్రతిపక్ష ఎమ్మెల్యే అయి ఉండి కూడా నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నానని ఆయన అన్నారు ఇది ఓర్వలేకనే మాజీ మంత్రి జోగు రామన్న లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు ఏదైనా మాట్లాడే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించి మాట్లాడాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో. .. జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం రఘుపతి . లాలా మున్న . అదినాద్. నగేష్. విజయ్. రాందాస్. వేదవ్యాస్. కృష్ణ యాదవ్ కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

# శాసన మండలిలో రైతు సమస్యలపై చర్చ

- వ్యవసాయంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- వాకౌట్ చేసిన వైకాపా సభ్యులు
- వైకాఆ తీరుపై మండిపడ్డ మంత్రులు



అమరావతి,మార్చి5( వెలుతురు):
ఏపీ అసెంబ్లీ సమావేశాలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మండలిలో ప్రశ్నోత్తరాలసమయం కొనసాగుతోంది. అసెంబ్లీకి మాత్రం వైకాపా సభ్యులు హాజరు కావడంలేదు. మండలిలో మాత్రం చర్చల్లో ఆ పార్టీ సభ్యులు పాల్గొంటున్నారు. పలు అంశాలను మంత్రులు శాసన మండలిలో ప్రస్తావించారు. శాసన మండలిలో రైతు సమస్యలపై చర్చ జరిగింది. ప్రభుత్వానికి రైతులు, వ్యవసాయంపై చిత్త శుద్ధి లేదని సభ నుంచి వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. అన్నదాత సుఖీభవ అమలుపై అచ్చెన్నాయుడు కీలక ప్రకటన చేశారు. మే నెల నుంచి అన్నదాత సుఖీభవ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్హత కలిగిన రైతులందరికీ రూ. 20 వేల నగదు అందజేస్తామని చెప్పారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అమలుపై విధివిధానాలు ఖరారు చేస్తున్నామని అన్నారు. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా తాము రైతులను మోసం చేయమని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వ్యవసాయ రంగాన్ని నష్టపరిచిందని అన్నారు. వ్యవసాయ యంత్రాలు లేవు, భూసార పరిక్షలు లేవు, పంటల భీమా చెల్లింపులు లేవని అన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. వచ్చే సీజన్ నాటికి హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి తక్షణం చేయాల్సిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలకు సంబంధించి జీవనాడి అయినా హంద్రీ నీవా ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. అందువల్లనే రాష్ట్రంలో ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా కనీవిని ఎరుగని రీతిలో ఏడాది బ్జడెట్లో అత్యధికంగా హంద్రీనీవాకు రూ.3243 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. హంద్రీనీవా పాపానికి, జాప్యానికి రాయలసీమ ముద్దుబిడ్డననే చెప్పుకునే జగనే ముమ్మాటికి కారణమని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హంద్రీనీవాకు సంబంధించి 80 శాతం పనులు పూర్తయితే జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క శాతం పనులు కూడా పూర్తి చేయలేక చేతులెత్తేశారని విమర్శించారు. ఈ రకంగా రాయలసీమ ప్రజల పాలిట జగన్ ద్రోహిగా మిగిలిపోయారని చెప్పారు. 2014 -19 టీడీపీ పాలనలో హంద్రీనీవాకు రూ.4000 కోట్లు ఖర్చు పెడితే వైసీపీ పాలనలో కేవలం రూ.500 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని అన్నారు. హంద్రీనీవాలో 3850 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న మోటార్లను సైతం పూర్తిస్థాయిలో వైసీపీ ప్రభుత్వం ఉపయోగించుకోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తను పట్టుకున్న భార్య




హైదరాబాద్,మార్చి5( వెలుతురు):
వేరే మహిళలో అక్రమ సంబంధం పెట్టుకున్న భర్తను భార్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సంఘటన బుధవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మారెడ్డి పాలెంలో చోటుచేసుకుంది. భర్త గత కొద్ది నెలలుగా ఇంటికి రాకుండా ఉండటంతో భార్యకు అనుమానం వచ్చింది. దీంతో అతడిని నిలదీసింది. తీరా ఫోన్ లాక్కొని చూడగా అసలు విష యం బయటపడింది. ఫోన్‌లో ఛాటింగ్‌లు చూసి షాక్ అయిన భార్య శ్వేత తన కుటుంబ సభ్యులతో టీచర్ వాణి ఇంటికి వచ్చి భర్తను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. మహిళను భయంకరంగా చితకబాదింది. భయంతో భర్త ప్రశాంత్ గోడ దూకి పరారయ్యాడు. ఆ వీడియోలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. తన తండ్రి మరణిస్తే వచ్చిన డబ్బులను వ్యాపారంలో పెడతా అని చెప్పి 30 లక్షల రూపాయలు, కారు, స్కూటీ, బంగారం తీసుకుని వెళ్లిన భర్త అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళకి ఇచ్చాడని భార్య ఆరోపిస్తోంది. తనకి న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది బాధితురాలు.

## భీమిలిలో గోడకూల్చివేత ఘటన

- నేహారెడ్డి నుంచి ఖర్చులు రాబట్టండి
- విచారణ సందర్భంగా హైకోర్టు ఆదేశం



అమరావతి,మార్చి5( వెలుతురు):
భీమిలి బీచ్‌లో అక్రమంగా నిర్మించిన గోడల కూల్చివేత ఖర్చులను నేహారెడ్డి నుంచి రాబట్టాలని మైకోర్టు ఆదేశించింది. విశాఖపట్నంలోని భీమిలి బీచ్ వద్ద అక్రమ నిర్మాణాలపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా గోడ నిర్మాణం చేపట్టడంపై ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయసాయి కుమార్తె నేహా రెడ్డి వ్యాపార భాగస్వామిగా ఉన్న కంపెనీపైనా న్యాయస్థానం మండిపడింది. కంపెనీపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించిన న్యాయమూర్తి.. అలా చేస్తేనే క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని పేర్కొన్నారు.బీచ్‌లో గోడ తొలగించి ఆరు అడుగుల పునాదిని అలాగే వదిలేయడం సరికాదు. గోడ వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలి. గోడ కూల్చివేత ఖర్చు, పర్యావరణ నష్టం నేహా రెడ్డి కంపెనీ నుంచి రాబట్టాలి అని న్యాయమూర్తి ఆదేశించారు. భీమిలి వద్ద 4 రెస్టో బార్ల అక్రమ నిర్వహణపై దాఖలైన పిల్ పైనా హైకోర్టులో విచారణ జరిగింది. రెస్టో బార్లపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించింది. తదుపరి విచారణను న్యాయస్థానం మూడు వారాలకు వాయిదా వేసింది.

## సభలో బలం మేరకే ప్రతిపక్ష హోదా

- హోదా కోసం జగన్ హైకోర్టుకూ వెళ్లారు
- బెదరింపు తరహాలో తనకూ లేఖ రాశారు
- హోదా అన్నది స్త్రీ రాదని స్పష్టం చేసిన స్పీకర్



అమరావతి,మార్చి5( వెలుతురు):
ప్రతిపక్ష హోదాపై నిరాధార ఆరోపణలతో వైకాపా ఎమ్మెల్యే జగన్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం సభ ప్రారంభం కాగానే ఆయన మాట్లాడారు. 'ప్రతిపక్ష హోదాపై వైకాపా ఎమ్మెల్యే జగన్ హైకోర్టుకు కూడా వెళ్లారు. న్యాయ ప్రక్రియ కొలిక్కి వచ్చేవరకు వేచి చూద్దామకున్నా. ఇటీవల జగన్, వైకాపా సభ్యులు చేసిన వ్యాఖ్యలు నా దృష్టికి వచ్చాయి. ఎంతటివారిపైనైనా అసత్యాలు ప్రచారం చేసే ధోరణితో జగన్ వ్యవహరిస్తున్నారు. వారు చేస్తున్న ఆరోపణలు గందరగోళానికి దారి తీస్తున్నాయి. స్పీకర్‌కు దురుద్దేశాలు ఆపాదించడం సభా నియమాల ఉల్లంఘన కిందికి వస్తాయి. దేవుడు తిరస్కరించిన వరాన్ని పూజారి నుంచి ఆశించడం తప్పని అయ్యన్న వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే సరైన సంఖ్యా బలం ఉండాలని చట్టం చెబుతోంది. 175 మంది సభ్యులున్న శాసనసభలో కనీసం 18 మంది సభ్యుల బలం ఉంటే తప్ప ప్రతిపక్ష హోదా రాదు. అంటే కనీసం 10 శాతం సభ్యులు ఉంటేనే ప్రతిపక్ష హోదా వస్తుందనే నిబంధనను గతంలో జగనే సభలో ప్రస్తావించారు. ఇవన్నీ తెలిసీ జగన్ చేసిన ప్రేలాపనలను సభాపతి హోదాలో క్షమించి వదిలేస్తున్నా. అభియోగాలు, ప్రేలాపనలు, బెదిరింపులతో జగన్ నాకు గత ఏడాది జూన్ 24న లేఖ రాశారు. ప్రతిపక్ష హోదా కావాలంటూ హైకోర్టును కూడా ఆశ్రయించారు. తనకు ప్రతిపక్ష హోదా ఇచ్చేలా సభను ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరారు. జగన్ పిటిషన్ ఇప్పటికీ విచారణకు తీసుకోవాలా.. వద్దా అనే దశలోనే ఉంది. అయినా ప్రతిపక్ష హోదాపై ఆయన అసత్యాలు ప్రచారం చేస్తూనే ఉన్నారు. తప్పుడు ప్రచారానికి తెరదించేందుకు రూలింగ్ ఇవ్వాలని నిర్ణయించా. సభకు దూరంగా ఉంటున్న ఎమ్మెల్యేలు.. ప్రజలు తమను ఎందుకు గెలిపించారో ఆలోచించాలి. సభకు రాకుంటే తమ నియోజకవర్గ ప్రజల సమస్యలు ఎవరు లేవనెత్తుతారు? ఇవన్నీ గ్రహించి సభకు రావాలని వైకాపా సభ్యులను కోరుతున్నానని స్పీకర్ పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబుతో గాదె శ్రీనివాసులు నాయుడు భేటీ

- ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషికి హామీ

అమరావతి,మార్చి5( వెలుతురు):




టీచర్ల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పాలసీల రూపకల్పన విషయంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాకే నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన బోధనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉపాధ్యాయ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని నివాసంలో బుధవారం ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు కలిశారు. గాదె శ్రీనివాసులు నాయుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. కూటమి ప్రభుత్వానికి తన మద్దతు గాదె శ్రీనివాసులు నాయుడు ప్రకటించారని చెప్పారు. ప్రభుత్వానికి - ఉపాధ్యాయులకు మధ్య శ్రీనివాసులు నాయుడు వారధిగా పనిచేస్తారని సీఎం చంద్రబాబుకు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సహకారంతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తెలిపారు. తన గెలుపు కోసం సీఎం చంద్రబాబుతో పాటు కూటమి పార్టీలన్నీ సహకరించాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వంతో కలిసి పని చేయటం తనకు అలవాటు అని చెప్పారు. చంద్రబాబు ఆశీర్వాదంతో తనకు కొండంత ధైర్యం వచ్చిందని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు పేర్కొన్నారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు మెట్రో కనెక్టివిటీ

- అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి


అమరావతి,మార్చి5( వెలుతురు):




భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు గాజువాక నుంచి ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, కొత్త రోడ్ల నిర్మాణంపై అసెంబ్లీలో మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... విశాఖపట్నంలో భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు వెళ్లేందుకు ట్రాఫిక్ రద్దీ తగ్గింపునకు మెట్రోతో పాటు కొత్త రోడ్ల ప్రతిపాదనలు ఉన్నాయని గుర్తుచేశారు. ట్రాఫిక్ నివారణకు విశాఖ మెట్రో ప్రతిపాదన ఉందని చెప్పారు. గాజువాక నుంచి భోగాపురం వరకూ మద్దిలపాలెం, మధురవాడ మీదుగా 34.6 కిలోమీటర్లు మెట్రో నిర్మాణం జరుగుతుందని అన్నారు. మెట్రో ప్రతిపాదనలు కేంద్రానికి పంపించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఖచ్చితంగా ఆమోదం పొందేలా చూస్తామని... ఆమోదం రాగానే పనులు ప్రారంభిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో మెట్రో రైలు వస్తే ట్రాఫిక్ కొంతమేర తగ్గుతుందని.. కానీ మెట్రో ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి నాలుగేళ్ల సమయం పడుతుందని తెలిపారు. ఏహెచ్ 45 రోడ్డుపై ట్రాఫిక్ తగ్గించడానికి 15 అంతర్గత రోడ్లు ఏడాదిన్నరలోగా పూర్తయ్యేలా అధికారులను ఆదేశించానని అన్నారు. పాత హైవే ఏహెచ్ 47 నుంచి ఎన్ హెచ్ 16కు ఆరు రోడ్లు ప్రతిపాదన ఉందని గుర్తుచేశారు. విశాఖపట్నంలోని ఎమ్మెల్యేలు, అధికారులతో మీటింగ్ పెట్టాలని మంత్రిని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు కోరారు. వచ్చే వారమే మీటింగ్ పెడతానని మంత్రి నారాయణ సభలో చెప్పారు.

## బీజేపీ లో చేరిన పలువురు నాయకులు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



వెలుతురు,ఆదిలాబాద్, మార్చి 5:
మండలం లో ని సైదపూర్ గ్రామం లో బీజేపీ లో మాజీ సర్పంచ్ లు. ఉప సర్పంచ్ లు. వార్డ్ మెంబర్స్. ఆదివాసీ సంఘాల. అధ్యక్షులు. వివిధ సంఘాల నాయకులు పార్టీ లో చేరడం జరిగింది. పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ శాసనసభ్యులు పాయల్ శంకర్ జిల్లా అధ్యక్షులు. పతంగి బ్రహ్మానందం. సమక్షంలో పార్టీ కండువా కప్పి బీజేపీ పార్టీ లో ఆహ్వానించడం జరిగింది, శాసనసభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ. రైతుల సమస్య ల కోసం ఎల్లవేళలా పనిచేస్తున్న అసెంబ్లీ లోకూడా రైతుల సమస్యల గురించి ప్రభుత్వాన్ని నిలదీసిన సందర్బన్ని గురించి గుర్తుచేయడం జరిగింది ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పీఎం. కిసాన్ సమ్మాన్ నిధి క్రమం తప్పకుండ వస్తున్నది కానీ ఈ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం



ఇప్పటివరకు రైతు భరోసా ఇవ్వలేదు అని రుణమాఫీ పూర్తి చేయలేదు అన్ని పథకాలు తుంగలో తొక్కిందని గుర్తుచేశారు ,బీజేపీ లో చేరిన వారు. రాథోడ్ రోహిదాస్ పిఏస్సీ వైస్ చేర్మెన్. మాజీ సర్పంచ్. సుమన్ బాయి. దౌన సర్పంచ్ వినోద్. మెస్రం శ్యారావు ఖరా మాజీ సర్పంచ్. వేలాది కిస్టు. దౌన ఉపసర్పంచ్ లక్ష్మి బాయి. ఖరా ఉపసర్పంచ్ రైసిదాం కాశీరం. మరియు ఎస్.టి సెల్ కన్వినర్. మెస్రం ప్రకాష్. మరియు వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్. బిఆర్ఎస్ పార్టీ ల నుండి సుమారుగా 300వందల మంది కార్యకర్తలు బీజేపీ లో చేరడం. జరిగింది ఈ కార్యక్రమం లో జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు. అస్తక్ సుభాష్. మండల్ కౌన్సిల్ మెంబర్ పోతారాజు రమేష్. అసెంబ్లీ కన్వినర్ బోయర్ విజేయ్. బీజేపీ నాయకులు సురేష్. రాము . తారు. దినేష్. ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు,

## ఆడుదాం ఆంధ్రా అవకతవకలపై కమిటీ: మంత్రి



అమరావతి,మార్చి5( వెలుతురు):
ఆడుదాం ఆంధ్రా'లో జరిగిన అవకతవకల పట్ల పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు చాలా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని శాసన మండలిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని లోతుగా పరిశీలించడానికి ఒక ఇండిపెండెంట్ కమిటీతో విచారణ వేసి 45 రోజుల్లో నివేదిక సమర్పిస్తామని అన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' పేరిట తప్పుచేసిన అధికారులు ప్రజా ప్రతినిధుల పాత్రల గురించిన రిపోర్ట్ సభకు అందజేస్తామని అన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' కోసం గత వైసీపీ ప్రభుత్వం మొత్తం రూ.119 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. ఈ మొత్తాన్ని ఆర్ అండ్ బీ, స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్, జిల్లా కలెక్టర్స్ ద్వారా ఖర్చు చేశారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.

## పిపిపి మోడల్‌లో 10 మెడికల్ కాలేజీల నిర్మాణం

- మండలిలో వైకాసా సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం



అమరావతి,మార్చి5( వెలుతురు):
రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేస్తున్నామని మంత్రి సత్య కుమార్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో 17 కొత్త మెడికల్ కాలేజీలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కాలేజీల నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. కేవలం 15 శాతం పనులు మాత్రమే గత ఐదేళ్లలో పూర్తి చేశారని అన్నారు. ఏపీలో మెడికల్ కాలేజీలపై శాసనమండలిలో చర్చ జరిగింది. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తున్నారా అంటూ వైసీపీ సభ్యులు ప్రశ్నించారు. వైసీపీ సభ్యుల ప్రశ్నలకు వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ సమాధానం చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణాల గురించి పట్టించుకోని నేతలు ఇప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఒక్క పులివెందుల కాలేజికి మాత్రం 59 శాతం నిధులు ఖర్చు చేశారన్నారు. టెండర్‌లే పిలవని పార్వతిపురం కాలేజీని అద్భుతంగా కట్టామని అప్పటి డిప్యూటీ సీఎం చెప్పడం హాస్యస్పదంగా ఉందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం మెడికల్ విద్యను పేద వాడికి దూరం చేసిందని మంత్రి సత్య కుమార్ విమర్శించారు.

## మంత్రి బొత్సపై అమరావతి రైతుల ఫిర్యాదు

గుంటూరు,మార్చి5( వెలుతురు):
గుంటూరు జిల్లాలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణపై రాజధాని అమరావతి రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శాసనమండలిలో అమరావతిని స్మశానంతో పోలుస్తూ బొత్స మాట్లాడారు. దీంతో బొత్స వ్యాఖ్యలు తమ మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని రాజధాని రైతు కంచర్ల జగన్మోహనరావు, అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య ఆరోపించారు. ఈ మేరకు తుళ్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# రెచ్చిపోతున్న సైబర్‌నేరగాళ్లు

- ఎమ్మెల్యే వేముల వీరేశంకు న్యూడ్ వీడియో కాల్
- డబ్బులు ఇవ్వాలని డిమాండ్.. పోలీసులకు ఫిర్యాదు




**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**
రాష్ట్రంలో సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంను టార్గెట్ చేసి న్యూడ్ కాల్స్‌తో బెదిరింపులకు దిగారు. న్యూడ్ వీడియో కాల్‌ను రికార్డు చేసి ఆయన మొబైల్‌కు పంపించడమే కాకుండా.. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివరాల ప్రకారం.. నకిరేకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు నిన్న రాత్రి సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేశారు. ఆ కాల్ లిఫ్ట్ చేయగానే అవతలి అమ్మాయి నగ్నంగా కనిపించింది. మొబైల్ స్క్రీన్‌పై ఆ సీన్ చూడగానే వేముల వీరేశం ఫోన్ కట్ చేశాడు. కానీ అదంతా స్క్రీన్ రికార్డు చేసిన సైబర్ నేరగాళ్లు.. ఆ వీడియోను ఆయనకే పంపించారు. తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆ వీడియోను కుటుంబసభ్యులు, మిత్రులకు పంపించడమే కాకుండా సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. కానీ ఆయన స్పందించకపోవడంతో ఆ వీడియోను కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు పంపించారు. ఆ వీడియో చూసిన వెంటనే సదరు నేతలు, కార్యకర్తలు వేముల వీరేశానికి ఫోన్ చేసి ఆరా తీశారు. దీంతో కంగుతిన్న ఎమ్మెల్యే.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. పోలీసుల సలహాలతో సైబర్ నేరగాళ్ల నంబర్‌ను బ్లాక్ చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు.

# ఫలించిన హరీశ్‌రావు ప్రయత్నం

- రంగనాయకసాగర్‌కు నీటి ఎత్తిపోతలు ప్రారంభం



**సిద్దిపేట,మార్చి5( వెలుతురు):**
సిద్దిపేట నియోజకవర్గ రైతుల పక్షాన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ప్రయత్నం ఫలించింది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ మీదుగా రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి తక్షణమే నీటిని ఎత్తిపోయాలని హరీశ్ రావు ఇటీవల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖకు స్పందన లేకపోవడంతో ఫోన్ చేసి మాట్లాడారు. రైతుల కష్టాల గురించి క్షుణ్ణంగా చర్చించారు. వెంటనే నీరు ఎత్తిపోయకుంటే 50 వేల ఎకరాల్లో పంట ఎండిపోతుందని.. రైతులంతా తీవ్రస్థాయిలో నష్టపోతారని.. క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యాసంగి పంట చేతికొచ్చేదాకా సాగునీటిని అందుబాటులో ఉంచాలని.. గడిచిన నాలుగేళ్ల పాటు సాగునీరు అందించిన తీరును వివరించారు. కనీసం 1టీఎంసీ నీటిని ఎత్తిపోయాలని కోరారు. ఈ క్రమంలోనే ఈ రోజు ఉదయం అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్‌లోకి గోదావరి జలాలు ఎత్తిపోయడం ప్రారంభించారు. ఇదిలా ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని.. ఎందుకూ పనికిరాదని విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వమే నేడు ఇదే కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగాలైన అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్ల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తూ పంటలకు నీరందిస్తున్నారనే చర్చ జరుగుతున్నది.

# 15 నెలల్లోనే రూ. 1.65 లక్షల కోట్ల అప్పు

- నాడు అప్పులు చేసి ప్రజల కష్టాలు తీర్చితే..
- నేడు అప్పులు చేసి జేబులు నింపుకుంటున్న సీఎం రేవంత్



**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**
నాడు బీఆర్ఎస్ చేసిన అప్పులపై ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ.. నేడు 15 నెలలకాలంలోనే రూ. 1.65 లక్షల కోట్లు అప్పులు చేశారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. నాడు అప్పు చేసి 70 లక్షల అన్నదాతలకు అండగా నిలిచి వారికి రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు ఖాతాల్లోకి వేసి.. రూ.28 వేల కోట్లు రుణమాఫీ చేసి.. రూ.6 వేల కోట్లతో రైతుబీమా చేసి.. లక్ష 11 వేల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందేలా చేసి.. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు.. పారిశ్రామిక, గృహావసరాలకు 24 కరెంటు అందించి.. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, సీతారామసాగర్ కట్టి 45 వేల చెరువులు కుంటలు బాగుచేసి.. 45 లక్షల మందికి పైగా ఆసరా ఫించన్లతో అండగా నిలిచి.. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, కళ్యాణలక్ష్మి, వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, 30 మెడికల్, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటుచేస్తే అప్పులు తప్పని రాద్ధాంతం చేశారని విమర్శించారు. 15 నెలల పాలనలో రూ.1.65 లక్షల కోట్లు అప్పు చేసి.. రుణమాఫీ ఎగ్గొట్టి.. రైతుబంధు ఎగ్గొట్టి.. రైతుబీమా లేకుండా చేసి.. కరెంటుకు కోతలు వేసి.. గురుకులాలను గాలికి వదిలేసి.. కాళేశ్వరాన్ని ఎండబెట్టి.. పాలమూరు రంగారెడ్డిని పడావుపెట్టి.. శ్రీశైలం సొరంగం కుప్పకూల్చి 8 మంది ప్రాణాలు బలితీసుకున్న బాధ్యతలేని ప్రభుత్వం ఇది అని కాంగ్రెస్‌పై కేటీఆర్ మండిపడ్డారు. తట్టెడు మట్టి తీసింది లేదు.. ఒక్క పథకం అమలు చేసింది లేదు.. గల్లీలో గాలిమాటలు, ఢిల్లీకి ధనం మూటలు మోసుడు తప్ప.. 15 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏంటి అని నిలదీశారు. నాడు అప్పులు తప్పని అడ్డగోలు అభాండాలు.. నేడు అందినకాడికి అప్పులు అని విమర్శించారు.

# స్పీకర్‌ను కించపరిచేలా చేయవద్దు

- ప్రతిపక్ష హోదా ఇస్తే వచ్చేది కాదు
- గతంలో సభలో జగన్ ఏం మాట్లాడారో గుర్తుకు తెచ్చుకోవాలి
- మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్‌ల వ్యాఖ్యలు

**అమరావతి,మార్చి5( వెలుతురు ):**
వైకాపా అధ్యక్షుడు జగన్ ప్రతిపక్ష బాధ్యతను నిర్వహించకుండా ఆ హోదా కోరుకోవడం శోచనీయమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సభలో గవర్నర్‌ను అవమానించడం అత్యంత దారుణమని మండిపడ్డారు. బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాల్లో శాసనసభలన్నీ పార్లమెంట్ సంప్రదాయాలనే అనుసరిస్తాయన్నారు. సెక్షన్ 121 సి ప్రకారం ఏదైనా సభలో సభ్యుల సంఖ్యలో పదో వంతు ప్రతిపక్షానికి ఉండాలని లోక్‌సభలో రూలింగ్ ఉందని లోకేశ్ గుర్తుచేశారు. తెదేపాకు ఉన్న 23 మంది శాసనసభ్యుల్లో ఐదుగురిని లాగేస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా ఉండదంటూ గతంలో సీఎంగా జగన్ చేసిన వ్యాఖ్యలను లోకేశ్ ప్రస్తావించారు. ఇప్పుడు స్పీకర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ సభ గౌరవాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజాతీర్పును గౌరవించి వారి కోసం పోరాడాల్సిన బాధ్యత పార్టీలదేనని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కంటే ఎక్కువ భద్రత జగన్‌కు కల్పిస్తున్నామన్నారు. తగిన సభ్యులు లేకుండా ప్రతిపక్ష హోదా కోరుకుంటూ దుష్ప్రచారం చేసే సంప్రదాయం కొనసాగకూడదన్నారు. ప్రభుత్వం ఎక్కడా వ్యక్తిగత కక్షలకు వెళ్లడం లేదని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మాజీ సీఎం



వైఎస్ జగన్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి కంటే ఎక్కువగా జడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చామన్నారు. స్పీకర్‌పై తప్పుడు రాతలు బాధాకరమన్నారు. ఎవరు ఎక్కడ ఉండాలో ప్రజలు నిర్ణయిస్తారని, ప్రజాప్రతినిధులుగా ప్రజలు తరపున పోరాడాల్సి ఉందన్నారు. ఎవరు అధికారంలో ఉన్నా ఇది కరెక్టు కాదని, చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరిగితేనే ప్రజలకు మేలు జరుగుతుందని మంత్రి చెప్పుకొచ్చారు. బుధవారం అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. 'చట్టసభలు చూస్తూ పెరిగా. చిన్నవయసులో చట్టసభలను చూశాను. అప్పట్లో వ్యక్తిగత దూషణలు ఉండేవి కావు, ప్రజలకు ఏమి కావాలో దానిపైనే చర్చలు జరిగేవి. చట్టసభల్లో ఇది నాకు రెండో అవకాశం. తొలిసారి శాసనసభకు వచ్చా. ఇటీవల ప్రతిపక్ష సభ్యులు బాధ్యత లేకుండా గవర్నర్ స్పీచ్‌ను డిస్టర్బ్ చేసి వెళ్లారు. గతంలో మేం నిరసన తెలియజేసినపుడు బెంచిల వద్దే ఉండి ధర్నా చేశాం. పోడియం వద్దకు రాలేదు, మేం ఎప్పుడూ లక్ష్మణరేఖ దాటలేదు. నేను అసెంబ్లీలో కొత్త మెంబర్. పార్లమెంటులోని 121సి నిబంధన ప్రకారం ప్రతిపక్ష హోదాకు టోటల్ నెం.లో 1/10 ఉండాలని స్పష్టంగా ఉంది. అసెంబ్లీ కండీషన్స్ ఫర్ రికగ్నిషన్లో కూడా ఈ విషయం పొందుపర్చబడి ఉంది' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్పీకర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేయడం హౌస్ పరువు తగ్గిస్తుంది. ఎవరు ఎక్కడ ఉండాలో ప్రజలు నిర్ణయిస్తారు. ప్రజాప్రతినిధులుగా ప్రజలు తరపున పోరాడాల్సి ఉంది. జగన్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి కంటే ఎక్కువగా జడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చాం. ప్రభుత్వం ఎక్కడా వ్యక్తిగత కక్షలకు వెళ్లడం లేదు. చట్టాన్ని ఉల్లంఘించడం, దానిని హౌస్ పైన రుద్దడం బాధాకరం. ఎవరు అధికారంలో ఉన్నా ఇది కరెక్టు కాదు. చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరిగితేనే ప్రజలకు మేలు జరుగుతుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదాపై వైకాపా నేతలు కావాలనే బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. జగన్ తనకు లేని అధికారాన్ని కోరుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గౌరవం ఇవ్వకుండా ఛీ కొట్టినప్పుడు హోదా ఇవ్వాలని ఎలా కోరుకుంటారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ప్రచార మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారంపై సభా హక్కుల సంఘానికి నివేదించాలని జనసేన తరఫున కోరుతున్నట్లు తెలిపారు. జగన్ అనాలోచిత వ్యాఖ్యలు, మూర్ఖమైన నిర్ణయాలను ఇతరులకు ఆపాదించటం సరికాదని హితవు పలికారు.

# గందరగోళంగా మారిన టౌన్ ప్లానింగ్

**నెల్లూరు, మార్చి 5, ( వెలుతురు)**
ఏపీ మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పేది ఒకటి ఆ శాఖలో జరిగేది మరొకటి.. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణ రంగానికి ఊతం ఇచ్చేలా పలు నిర్ణయాలను .నారాయణ ప్రకటించారు. వంద గజాల్లోపు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మొదలుకుని అపార్ట్‌మెంట్ల నిర్మాణం వరకు భవన నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు పలు నిర్ణయాలను ప్రకటించారు. అయితే మంత్రి నారాయణ చెప్పిన వాటిలో ఇప్పటి వరకు ఒక్క నిర్ణయం కూడా అమలు కాలేదు. తాజాగా గత వారం హైకోర్టు ఆదేశాలతో పురపాలక శాఖ భవన నిర్మాణ నిబంధనలు మరింత కఠినతరం చేసింది.ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విషయంలో ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల్ని ఉల్లంఘిస్తే మరింత కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పిన దానికి ఆ శాఖలో క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలకు పొంతన కుదరడం లేదు. దీనిపై భవన నిర్మాణ రంగంలో ఉన్న వారి నుంచి బహిరంగంగానే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.తాజాగా భవన నిర్మాణదారుల కోసం అందుబాటులోకి వచ్చిన కొత్త సాఫ్ట్ వేర్ తీసుకొచ్చినట్టు మంత్రి నారాయణ ప్రకటించారు. 18 మీటర్ల ఎత్తు లోపు నిర్మించే భవనాలకు స్వీయ ధ్రువీకరణ పత్రం సరిపోతుందని టౌన్ ప్లానింగ్ అధికారులతో సంబంధం లేకుండా సరైన పత్రాలు సమర్పిస్తే ఆటోమెటిక్ గా అనుమతులు మంజూరవుతాయని ప్రకటించారు. ఈ విధానం 2019 నాటికి విజయవాడలో అమల్లో ఉంది. అయితే ఆటోమెటిక్ అనుమతుల జారీ విధానాన్ని పూణేకు సంబంధించిన కంపెనీకి అప్పట్లో అప్పగించారు. ప్రభుత్వం భవన నిర్మాణదారులకు ఎవరి జోక్యం లేకుండా ఈ అనుమతులు జారీ చేసే ఉద్దేశంతో సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెడితే అందులో కూడా టౌన్ ప్లానింగ్ వేలు పెట్టింది.కార్పొరేషన్ల పరిధిలో అధికారుల్ని ప్రసన్నం చేసుకుంటేనే ఆన్‌లైన్‌లో అనుమతి జారీ అయ్యేలా మార్పులు చేశారు. దీంతో గత ఐదేళ్లలో భవన నిర్మాణదారులు నరకం అనుభవించారు. అన్ని రకాల ఫీజులు చెల్లించినా కొర్రీలు వేసి ముప్ప తిప్పలు పెట్టేవారు. మునిసిపల్ కమిషనర్లను కూడా ఖాతరు చేయకుండా టౌన్ ప్లానింగ్ విభాగం వ్యవహరించేది.

**సెల్ఫ్ సర్టిఫికేషన్ సరిపోతుందా..?**

భవన నిర్మాణాలకు అనుమతుల విషయంలో స్వీయ ధృవీకరణ సరిపోతుందని గత నెలలో జీవో జారీ చేశారు. ఆ తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విషయంలో మరికొన్ని నిబంధనలు విధించారు.తాజాగా రిజిస్టర్డ్ ఇంజినీర్లు,ఆర్కిటెక్ట్ లు




యజమానుల సమక్షంలో ఆన్ లైన్ లో సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇస్తే సరిపోతుందని ప్రకటించారు. భవన నిర్మాణ అనుమతులను త్వరితగతిన జారీ చేసేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి నారాయణ చెబుతున్నారు. APDPMS పోర్టల్ లో సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానం అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. అయితే భవన నిర్మాణాలను కొనసాగించడానికి కార్పొరేషన్ల పరిధిలో మార్టగేజ్ చేయాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే తనఖా పెట్టిన భాగాలను జప్తు చేయడంతో పాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విడుదల కాదు.ఏపీలో 2019 నాటికి 250కు మించిన స్థలంలో 18మీటర్ల ఎత్తు వరకు భవనాలను నిర్మించుకనే వెసులుబాటు ఉంది. ఆ తర్వాత నిర్ణత బాండ్లను చెల్లించి ఆరో అంతస్తు నిర్మాణం చేపట్టేందుకు కూడా వైసీపీ ప్రభుత్వంలో అనుమతులిచ్చారు. దీంతో 250-30గజాల్లోపు స్థలాల్లో ఆరంతస్తుల వరకు నిర్మాణాలను చేపట్టే అవకాశం లభించింది.ఇకపై 18 మీటర్ల లోపు లేదా ఐదంతస్తుల లోపు భవనాల నిర్మాణాల అనుమతులకు స్వీయ ధృవీకరణ పత్రం ఇస్తే సరిపోతుందని ...టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి అవసరం లేకుండానే భవన నిర్మాణాలకు పర్మిషన్ వచ్చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది.భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్ టీపీలు,ఇంజినీర్లు లేదా ఆర్కిటెక్ట్ ల సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి స్వీయ ధృవీకరణ(అఫిడవిట్)ఇవ్వాల్సి ఉంటుందని మెలిక పెట్టారు. గత నెలలోనే భవన నిర్మాణ అనుమతులకు కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది.భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీ చేసేలా ఈ కొత్త విధానాన్ని సర్కార్ అందుబాటులోకి తీసుకొచ్చిందని మంత్రి నారాయణ చెబుతున్నారు. సెల్ఫ్ సర్టిఫికేషన్ ద్వారా నిర్మాణాలకు అనుమతులిచ్చేందుకు అవసరమైన సాఫ్ట్ వేర్ ను APDPMS పోర్టల్ లోకి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ విధానం ఆమోదం పొందిన లేఅవుట్లు, గ్రామ కంఠం,సర్కులేషన్ ప్లాన్లు ఉన్న ప్రాంతాలు,1985 కు ముందు నిర్మించిన భవనాల పునర్నిర్మాణానికి ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు.

**టౌన్ ప్లానింగ్‌పై తీవ్ర విమర్శలు..**

ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళిక విభాగం పనితీరుపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా విజయవాడ, విశాఖపట్నం వంటి మునిసిపల్ కార్పొరేషన్లలో భవన నిర్మాణాలకు అనుమతులు, ప్లాన్ మంజూరు అంటే ముడుపులతో కూడుకున్న వ్యవహారంగా మారిపోయింది. ఏ ఫీజు ఎంత వసూలు చేస్తారనే వివరాలు ఎవరికి దొరకవు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది చెప్పినంత చెల్లించాల్సిందే. నిర్ణీత ఫీజులు చెల్లించినా టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ప్రసన్నం చేసుకోకపోతే వారిని ముప్ప తిప్పలు పెడతారు. ప్లాన్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే దగ్గర నుంచి దానికి ఫీజులు జనరేట్ అయ్యే వరకు రకరకాల కొర్రీలు వేసి వేధింపులకు గురి చేస్తుంటారు.ఇక ఖాళీ స్థలాలు కట్టే నిర్మాణాలకు ఆ స్థలం కొన్నప్పటి నుంచి వేకెంట్ ల్యాండ్ టాక్స్ వసూలు చేస్తారు. మధ్యలో ఎందరి చేతులు మారినా అది రికార్డుల్లో ఎక్కినప్పటి నుంచి నిర్మాణదారులు పన్ను చెల్లించాల్సి వస్తోంది. భవన నిర్మాణాలు పూర్తై అవి అమ్ముడుపోయే వరకు ఖాళీగా ఉన్న కాలానికి కూడా ఏపీలో పన్నులు వసూలు చేస్తున్నారు.పాత ఇళ్లను కూల్చి నిర్మాణాలు చేపడితే నిర్మాణం జరిగే సమయానికి కూడా వేలకు వేలు పన్నులు వసూలు చేస్తున్నారు. పాత ఇళ్లకు ఇంటి పన్నులు, డ్రైనేజీ, వాటర్ టాక్స్‌లు చెల్లిస్తూ, కొత్త నిర్మాణాలను చేపడితే ఆ కాలానికి కూడా పన్నులు వసూలు చేస్తున్నారు.అదే సమయంలో కొత్త నిర్మాణాలకు నిబంధనల మేరకు ఫీజులు జనరేట్ చేస్తూ అవే కనెక్షన్లను కొత్తగా ఇస్తున్నట్టు అదనపు వసూళ్లు చేస్తున్నారు. ఒక పాత భవనాన్ని కూల్చి కొత్త నిర్మాణం చేపడితే పాత భవనానికి, కొత్త నిర్మాణానికి కలిపి రెండు వేర్వేరు పన్నుల్ని ఏపీలో మునిసిపల్ కార్పొరేషన్లు వసూలు చేస్తున్నాయి. నిర్మాణదారుల సమస్యల్ని పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు.

# ప్రైవేట్ పనుల్లో బెజవాడ పోలీసులు

**విజయవాడ, మార్చి 5, ( వెలుతురు)**
సోషల్ మీడియా, యూ ట్యూబర్లతో దోస్తీ చేస్తున్న బెజవాడ పోలీసులు ప్రజల వ్యక్తిగత గోప్యతతో చెలగాటాలు ఆడుతున్నారు. గత కొన్ని నెలలుగా సాగుతున్న ఈ వ్యవహారంలో కొందరు పోలీసులే వీడియోలు రికార్డు చేసి ప్రైవేట్ వ్యక్తులకు షేర్ చేయడం చర్చనీయాంశంగా మారింది.విజయవాడలో ట్రాఫిక్ చలాన్లు, నిబంధనల ఉల్లంఘన, హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపే వారిని పోలీసులు ప్రశ్నించే వీడియోలు ఇటీవల కాలంలో వైరల్ అవుతున్నాయి. మహిళలు, వృద్ధులు, ఉద్యోగుల వాహనాలను తనిఖీ చేసే సమయంలో నిబంధనల్ని ఉల్లంఘిస్తే వారికి జరిమానా విధిస్తున్నారు. జరిమానాలతో పాటు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారి వీడియోలను పోలీసులే సోషల్ మీడియాలో షేర్ చేయిస్తున్నారు.ట్రాఫిక్ నిబంధనల్ని కఠినంగా అమలు చేసే విషయంలో ఎవరికి అభ్యంతరం లేకున్నా, చలానాలను విధించే సమయంలో పోలీసులు బాడీ కెమెరాలతో రికార్డు చేస్తున్న వీడియోలు, మొబైల్ ఫోన్లలో రికార్డు చేసే వీడియోలను యూ ట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లతో షేర్ చేస్తున్నారు. ఈ తరహా వీడియోలు వైరల్ అవుతున్నాయి.తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని సైతం మీడియా ముందు ప్రవేశ పెట్టే సమయంలో ముసుగులు వేసి చూపించే పోలీసులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వారి విషయంలో వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ కూడళ్ల వద్ద సాధారణంగా విఐపి మూమెంట్ ఉంటే తప్ప పోలీసులు కనిపించరు. రద్దీ సమయాల్లో జనం ఎవరి బాధలు వారు పడాల్సిందే.ట్రాఫిక్ నియంత్రణ సంగతి ఎలా ఉన్నా నిత్యం ఉదయం, సాయంత్రం చలాన్లు రాయడం మాత్రం విధిగా చేపడుతున్నారు. ట్రాఫిక్ జరిమానాలు మార్చి 1 నుంచి గణనీయంగా పెరిగాయి. ఈ క్రమంలో ప్రతి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో పోటాపోటీగా చలాన్లు విధిస్తున్నారు. మద్యం సేవించి పట్టుబడే వారిని న్యాయస్థానంలో హాజరు పరిస్తే రూ.10వేల జరిమానాతో పాటు జైలు శిక్షలు కూడా విధిస్తున్నారు.ట్రాఫిక్ చలాన్లు వసూలు చేసే క్రమంలో పోలీస్ అధికారులు ఉద్దేశ పూర్వకంగా వాటిని సొంత పబ్లిసిటీ కోసం వాడుకుంటున్నారు. కానిస్టేబుళ్లతో వీడియోలు తీయించుకుని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు షేర్ చేస్తున్నారు. ఆ వీడియోల్లో హెల్మెట్ పెట్టుకోని యువతీ యువకుల్ని పోలీసులు మందలించడం, హెచ్చరించడం వంటివి కూడా ఉంటున్నాయి. జరిమానాలు చెల్లించక పోతే వాహనాలను సీజ్ చేస్తున్నారు.పోలీసులు రికార్డు చేసే వీడియోలను న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా మాత్రమే పరిగణించాల్సి ఉండగా పబ్లిసిటీ కోసం సోషల్ మీడియా వేదికలపై షేర్ చేయడం, వారి ముఖాలను అందరూ గుర్తించేలా షేర్ చేస్తున్నారు. పోలీసుల అధికారిక హ్యాండిల్స్‌లో కూడా మహిళలు, మైనర్ల ఫోటోలను ముఖాలను గుర్తించేలా షేర్ చేస్తున్నారు. పోలీసుల తనిఖీల సందర్భంగా యువతులు, విద్యార్థినులు, మహిళల్ని ప్రశ్నిస్తున్న ఫోటోలను బహిరంగ వేదికలపై షేర్ చేస్తున్నారు.విజయవాడ సీపీగా కాంతి రాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీలు ఉన్న సమయంలో సొంత పబ్లిసిటీ కోసం కొన్ని యూ ట్యూబ్ ఛానళ్లను ప్రోత్సహించారు. పర్సనల్ వీడియోలతో పబ్లిసిటీ చేయించడం, యువతలో గుర్తింపు తెచ్చుకోవడం కోసం వీటిని కొందరు అధికారులు ఉపయోగించే వారు. ఈ తరహా వీడియోలకు మిలియన్లలో వ్యూలు, వేలల్లో లైక్‌లు వస్తున్నాయి తద్వారా అయా ఛానళ్లకు భారీగా ఆదాయం కూడా లభిస్తోంది. ఏపీ పోలీస్ శాఖ వీడియోలను బయటి వారికి షేర్ చేయడం వాటితో ప్రైవేట్ వ్యక్తులకు ఆదాయం పొందడంపై అధికారులు కిమ్మనడం లేదు.పోలీస్ అధికారులు విధుల్లో ఉన్న సమయాల్లో క్లోజప్ షాట్స్, డ్రోన్ షాట్స్ తో సినిమాటిక్ ఎఫెక్ట్‌లతో పబ్లిసిటీ చేయించుకునే వారు. ఆ తర్వాత అధికారులు మారినా మిగిలిన వారు కూడా వాటిని అనుసరించడం మొదలు పెట్టారు. సీఐ స్థాయి అధికారుల నుంచి డీసీపీల వరకు ఇదే బాట పట్టారు. ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగమని తెలిసినా తీవ్ర నేరాలకు పాల్పడినట్టు సోషల్ మీడియాలో దోషులుగా చిత్రీకరిస్తున్నారు. ట్రాఫిక్ చలాన్ల విధించే సమయంలో రికార్డు చేస్తున్న వీడియోలను సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై షేర్ చేయడంపై విజయవాడ ట్రాఫిక్ డీసీపీ వివరణ కోరినా స్పందించలేదు.

# అకీరానందన్ మొదటి సినిమాకు ఆ హీరోయిన్ అయితే బాగుంటుంది

## డిమాండ్ చేస్తున్న ఫ్యాన్స్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయాలలోకి వచ్చాక సినిమాలపై ఫోకస్ తక్కువగా పెడుతున్నాడు. దీంతో పవన్ తనయుడు అకీరాని హీరోగా చూడాలని అభిమానులు అనుకుంటున్నారు. అకీరా నందన్ తొలిసినిమా ఎప్పుడు ప్రారంభం అవుతుందని కొన్నాళ్లుగా జోరుగా డిస్కషన్ జరుగుతుంది. అయితే పవన్ తన వారసుడు అకీరా నందన్ ను అతి త్వరలో లాంచ్ చేసే పనిలో నిమగ్నమయ్యారని ఫిల్మ్ నగర్‌లో టాక్ వినిపిస్తోంది. అకీరా నందన్‌ను ప్రముఖ నిర్మాత అశ్వినీ దత్ లాంచ్ చేయనున్నట్టు సమాచారం. సూపర్ స్టార్ మహేశ్ బాబు, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్‌లను కూడా ఇండస్ట్రీకి పరిచయం చేసింది అశ్వినీ దత్ కాగా, ఇప్పుడు అకీరా నందన్ బాధ్యతలను కూడా ఆయనే తీసుకున్నారని తెలుస్తోంది. అయితే అకీరా నందన్ హీరో అయితే ఆయన సరసన నటించే కథానాయిక ఎవరు అయితే బాగుంటుందనే చర్చ కూడా మొదలైంది.. అఖీరానందన్ ఎప్పుడు ఇండస్ట్రీలోకి హీరోగా ఎంట్రీ ఇచ్చిన సరే హీరోయిన్ మాత్రం మహేష్ బాబు కూతురు సీతార అయి ఉండాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో మొదటి నుంచి పవన్ కళ్యాణ్, మహేష్ బాబు మధ్య మంచి స్నేహ బంధం ఉంది. ఈ క్రమంలో అకీరా సరసన సితారని హీరోయిన్‌గా పరిచయం చేయడానికి మహేష్ ఎలాంటి అభ్యంతరం తెలపకపోవచ్చు. మరోవైపు సితార కూడా సినీ ఇండస్ట్రీలో తన సత్తా చూపించాలని ఎంతగానో అనుకుంటుంది. మరి అకీరా-సితార జంటగా ఎవరైన సినిమా తీస్తే మాత్రం అది బ్లాక్ బస్టర్ కావడం ఖాయం. ఇది జరుగుతుందా లేదా అనేది చూడాల్సి ఉంది. కాగా,అకీరా నందన్ మొదటి సినిమాకు తమిళ దర్శకుడు విష్ణువర్ధన్ దర్శకత్వం వహించనున్నాడని గత కొద్ది రోజులుగా సినీ వర్గాల్లో చర్చ నడుస్తుంది. పవన్ కళ్యాణ్‌తో 'పంజా' సినిమాను తెరకెక్కించిన విష్ణువర్ధన్, ఇప్పుడు అకీరా నందన్‌ను లాంచ్ చేయడంకి సంబంధించి కూడా పూర్తి క్లారిటీ రావలసి ఉంది.



# కల్యాణ్‌రామ్ సినిమాలో కీలక పాత్రలో విజయశాంతి

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. విజయశాంతి కీలక పాత్రలో కనిపిస్తారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, అర్జున్ రాంపాల్ విలన్ రోల్ పోషిస్తున్నారు. ఈ సినిమాకు 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఇందులో విజయశాంతి పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారని సమాచారం. కొన్నేళ్ల గ్యాప్ తర్వాత ఆమె మహేశ్ నటించిన సరిలేరు నీకెవ్వరూ' సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చారు. తదుపరి కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో కీలక పాత్ర చేయడానికి అంగీకరించారు. ముప్పా వెంకయ్య చౌదరి, సునీల్ బలుసు, అశోక్ వర్దన్, కల్యాణ్ రామ్ కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ స్వరాలు అందిస్తున్నారు.





# నాగార్జున్‌తో ఊరమాస్ సాంగ్ చేసిన పూజా హెగ్డే

ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత డల్ అయింది. వరుస పరాజయాలతో ఆమెకి అవకాశాలే కరువయ్యాయి. స్టార్ హీరోలతో కలిసి పని చేసిన పూజా హెగ్డే ఇప్పుడు చిన్న హీరోలతో కూడా పని చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తుంది. అయితే పూజా హెగ్డేకి ఇప్పుడు తెలుగులో పెద్దగా అవకాశాలు లేవు. తమిళంలో మాత్రం రెండు సినిమాలు చేస్తుంది. అవి రెండూ భారీ మూవీస్ కావడం విశేషం. సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న కూలీలో స్పెషల్ సాంగ్ కూడా చేయబోతున్నట్టు టాక్ వినిపిస్తుంది. ఈ సినిమాలు పూజా హెగ్డేకి ఎంత వరకు ప్లస్ అవుతాయా అని అభిమానులు చర్చించుకుంటున్నారు. పూజా హెగ్డే తెలుగులో ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్, నాగచైతన్య, అఖిల్, వరుణ్ తేజ్ వంటి హీరోలతో నటించింది. క్రేజ్ ఉన్న సమయంలో రెచ్చిపోయింది. రెమ్యునరేషన్ కూడా భారీగానే పెంచేసింది. వచ్చిన అవకాశాలని దేనిని వదులుకోలేదు. అయితే ఇందులో కొన్ని దెబ్బ కొట్టడంతో పూజా ఇప్పుడు రూట్ మార్చింది. కంటెంట్ ఉన్న సినిమాలు, బలమైన పాత్రలే చేయాలని అనుకుంటుందట. ఇప్పుడు కోలీవుడ్‌లో పూజా నటిస్తున్న విజయ్..జన నాయగన్, సూర్య..రెట్రో.. చిత్రాలు కూడా అలాంటివే అని తెలుస్తుంది. అయితే క్రేజ్ ఉన్న సమయంలోనే పూజా హెగ్డే రంగస్థలంలో జిగేల్ రాణి అనే స్పెషల్ సాంగ్‌కి చిందులేసింది. ఆ పాట థియేటర్లని ఊపేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు దాన్ని మించి..కూలీలో ఐటెమ్ సాంగ్ ఉంటుందట. అందులో కింగ్ నాగార్జునతో ఈ అమ్మడు ఆడిపాడనుందని అంటున్నారు. ఊరమాస్‌గా ఈ పాట ఉండనున్నట్టు తెలుస్తుండగా, ఇందులో నాగ్‌తో కలిసి పార్టీలో తెగ రచ్చ చేయనుందట. ఇందులో పూజా లుక్ కూడా అదిరిపోయేలా ఉంటుందని అంటున్నారు. కాగా, రజనీకాంత్ కూలీలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. నెగటివ్ షేడ్ ఉన్న రోల్ అని సమాచారం. ఇదిలా ఉంటే ఇప్పటికే నాగ్ తనయులు నాగచైతన్యతో ఒక లైలా కోసం, అఖిల్‌తో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ చిత్రాల్లో నటించిన పూజా హెగ్డే ఇప్పుడు నాగార్జునతో చిందులేయడం హాట్ టాపిక్‌గా మారింది.



# కమల్, అజిత్‌ను ఫాలో అవ్వుతున్న నయన్



ఒకప్పుడు నటీనటులకు తమకు పెద్దవారు ఇచ్చే బిరుదులను ఆదరంగా స్వీకరించి, గొప్పగా చెప్పుకునే వారు. ఆ తర్వాత అభిమానులు ప్రేమతో ఇచ్చే బిరుదులనూ స్వీకరించడం మొదలు పెట్టారు. కొందరైతే దర్శక నిర్మాతలకు సూచన చేసి మరీ బిరుదులను పొందిన వారూ ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం సినిమా రంగంలో సేవ చేసిన వారికి గుర్తింపుగా పద్మశ్రీ పురస్కారాలను ప్రకటిస్తూ ఉంటుంది. అయితే అది బిరుదు కాదనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. సినిమా టైటిల్స్ కార్డుల్లో పేరు ముందు పద్మశ్రీ అనే పదాన్ని బిరుదులా ఉపయోగించడం నిషిద్ధం. కావాలనుకుంటే సదరు వ్యక్తి 'పద్మశ్రీ పురస్కార గ్రహీత' అని పేరు ముందు వేసుకోవచ్చు. అయితే... ప్రభుత్వం ఇచ్చే పద్మ పురస్కారాల కంటే... స్టార్ హీరోలకు, హీరోయిన్లకు, దర్శకులకు అభిమానులు, సినిమా ఇండస్ట్రీ వాళ్ళు ఇచ్చే బిరుదులంటే భలే ఇష్టం. ఎలాంటి సంకోచం లేకుండా ఆ బిరుదులను సినిమా టైటిల్స్ కార్డుల్లోనూ, మీడియాకు ఇచ్చే ప్రెస్ నోట్స్ లోనూ వాడేసుకుంటారు.

ఇటీవల ఇలాంటి బిరుదల పట్ల, అభిమానులు తమ పేర్ల ముందు చేర్చుతున్న విశేషణాల పట్ల కొందరు నటీనటులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. తమను పేరుతో సంభోదిస్తే చాలని, ప్రత్యేకమైన బిరుదలను పెట్టవద్దని బహిరంగంగా అభిమానులను వేడుకుంటున్నారు. ప్రముఖ నటుడు, దర్శక నిర్మాత కమల్ హాసన్‌ను కొంతకాలంగా ఉళగనాయకన్ అనే పేరుతో సంభోదిస్తున్నారు. అయితే... తనకు అలాంటి బిరుదులు తగిలించుకోవడం ఇష్టం లేదని కమల్ హాసన్ ఇటీవల స్పష్టం చేశారు. అలానే తమిళ స్టార్ హీరో అజిత్‌ను ఫ్యాన్స్ ప్రేమతో 'తల' అని పిలుస్తుంటారు.

అజిత్ కూడా ఇటీవల అభిమానులకు ఓ ఓపెన్ లెటర్ రాసి... అతను అజిత్ అని పిలిస్తే చాలని అన్నారు. ఇప్పుడు అదే బాటలో లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా నడుస్తోంది. గత కొంతకాలంగా సౌతిండియన్ సూపర్ స్టార్ అనే పేరును నయన్ కు విశేషణంగా తగిలించారు. ఆమె ఇటీవల ఉత్తరాదిలోకీ అడుగుపెట్టి, అక్కడా 'జవాన్' సినిమాతో తన సత్తాను చాటింది. దాంతో ఉత్తరాది వారు సైతం నయన్ ను 'లేడీ సూపర్ స్టార్' అనడం మొదలైంది. అయితే... తన పేరు ముందు ఇలాంటివేవీ ఇక మీద పెట్టవద్దని నయనతార ఓ బహిరంగ లేఖను విడుదల చేసింది. నయన్ అనే పేరే తన మనసుకు ఎంతో దగ్గరగా ఉంటుందని, అందువల్ల అదే పేరుతో తనను సంభోదించమని ఆమె కోరింది.

"రేపు ఎలా ఉంటుందో మనకు తెలియదు. కానీ అభిమానుల ప్రేమ నాకు ఎప్పుడూ ఉంటుందని భావిస్తున్నాను. వారికి వినోదం పంచడానికి నేను ఎల్లప్పుడూ కష్టపడుతూనే ఉంటాను. సినిమా అనేది మనందరినీ కలిపింది. దానిని అందరం కలిసి ఆస్వాదిద్దాం' అని నయన్ ఆ లేఖలో పేర్కొంది. ఇక సినిమాల విషయానికి వస్తే నయనతార 'ముక్కుత్తి అమ్మన్ -2, రక్కాయి, మన్నన్గట్టి సిన్స్ 1960, టెస్ట్' తదితర ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉంది.

# అందంతో కట్టిపడేస్తున్న రెబామోనికా

రెబా మోనికా జాన్ ఒక భారతీయ నటి, మోడల్, ఆమె తమిళ, మలయాళ చిత్రాలలో ప్రముఖంగా పని చేస్తుంది మరియు కొన్ని తెలుగు మరియు కన్నడ చిత్రాలలో పని చేసింది. తాజా సోషల్ మీడియా ఈ కోమలి షేర్ చేసిన తెగ వైరల్ అవుతున్నాయి. మీరు కూడా వీటిపై ఓ లుక్ వెయ్యండి. 4 ఫిబ్రవరి 1994న కర్ణాటక రాజధాని బెంగుళూరులో ఓ మలయాళీ కుటుంబంలో జన్మించింది వయ్యారి భామ రెబ మోనికా జాన్. ఈ ముద్దుగుమ్మ తండ్రి పేరు జాన్, ఈమె తల్లి పేరు మినీ జాన్. ఈ బ్యూటీ కుటుంబం క్రైస్తవ మతానికి చెందినవారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో సేక్రేడ్ హార్ట్ గర్ల్స్ హై స్కూల్ లో పాఠశాల విద్యను పూర్తి చేసింది ఈ భామ. బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీ పట్టా పొందింది ఈ అందాల తార రెబ. 2022లో క్రైస్తవ సంప్రదాయంలో కుటుంబీకులు, బంధుమిత్రుల మధ్య జోమోన్ జోసెఫ్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. ఈ వయ్యారి సినిమాలకు ముందు కొన్ని ప్రకటనలలో కనిపించింది. అందులో ధాత్రి హెయిర్ ఆయిల్ ప్రకటన చాల ప్రముఖమైనది. 2016లో జాకోబింటే స్వర్గరాజ్యం అనే మలయాళీ ఫ్యామిలీ డ్రామాతో సినీరంగ ప్రవేశం చేసింది. తర్వాత మలయాళీ, తమిళ చిత్రాల్లో కనిపించింది. 2023లో శ్రీవిష్ణుకి జోడిగా కామెడీ డ్రామా చిత్రం సామజవరగమన చిత్రంతో తెలుగు చలనచిత్ర అరంగేట్రం చేసింది రెబ జాన్. ఈ నెల 29న విడుదల కానున్న తెలుగు కామెడీ ఎంటర్టైనర్ మ్యాడ్ స్క్వేర్ సినెమా ఓ స్పెషల్ సాంగ్ లో కనిపించనున్న ఈ ముద్దుగుమ్మ. ఇప్పటికి విడుదలైన ఈ పాట లిరికల్ వీడియోకి ప్రేక్షకుల్లో మంచి రెస్పాన్స్ వచ్చింది.



# పైరసీ కోసం ఉద్యమం చేపట్టాలి : దిల్‌రాజ్

తెలుగు సినిమాలు విడుదల రోజే పైరసీ అవుతున్న సందర్భంగా వాటిని అరికట్టేందుకు ఒక ఉద్యమం రావాలని ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత దిల్ రాజు అన్నారు. దిల్ రాజ్ నిర్మాణంలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు'. విక్టరీ వెంకటేశ్, సూపర్ స్టార్ మహేశ్ బాబు, ప్రకాశ్ రాజ్ జయసుధ తదితరులు ప్రధాన పాత్రల్లో వచ్చిన ఈ చిత్రం 2013న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ సినిమా వచ్చి 12 ఏండ్లు అవుతున్న సందర్భంగా రీ రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. మార్చి 07న ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తుండగా.. ఈ సందర్భంగా దిల్ రాజు ప్రెస్‌మీట్ నిర్వహించారు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వచ్చి 12 ఏండ్లు అవుతున్న ఈ సినిమాను ఇంకా ఆదరిస్తున్నారు. రీరిలీజ్ ఓపెనింగ్స్ చూస్తుంటే ఆనందంగా ఉంది. హైదరాబాద్‌లో పది థియేటర్లు హౌస్‌ఫుల్స్ అయిపోయాయి. ఆంధ్రాలో కూడా మంచి ఓపెనింగ్స్ వస్తాయి. ఈ వసూళ్లు చూస్తుంటే మాలో కొత్త ఎనర్జీ వస్తుంది. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చిత్రంలో యాడ్ చేయడానికి ఎక్స్ ట్రా ఫుటేజ్ చాలా ఉంది. కానీ అలాంటి ప్రయోగాలు ఏమీ చేయట్లేదు. ఇంతకు ముందు ఉన్న సినిమాను అలాగే విడుదల చేస్తున్నాం. మంచి చిత్రాలు ఎన్నిసార్లు రిలీజ్ చేసినా చూసేందుకు ప్రేక్షకులు సిద్ధంగా ఉన్నారంటూ దిల్ రాజ్ తెలిపాడు. ఈ క్రమంలోనే తెలుగు సినిమాను భూతంలా పీడిస్తున్న పైరసీకి సంబంధించి స్పందించారు దిల్ రాజు. పైరసీని అరికట్టేందుకు ఒక ఉద్యమం రావాలని దిల్ రాజు అన్నారు. పైరసీని అరికట్టేందుకు మనం అందరం కలిసి ఒక ఉద్యమం లాంటిది తీసుకురావాలి. చాలామంది నిర్మాతలు తమ సినిమా విడుదల సమయంలో మాత్రమే ఈ సమస్య గురించి మాట్లాడతారు, కానీ ఆ తర్వాత అందరూ దాన్ని మర్చిపోతారు. అందుకే ఈ సమస్య ఎక్కడ వేసిన గొంగళిలా అక్కడే ఉంటోంది అంటూ చెప్పుకోచ్చాడు దిల్ రాజు. పైరసీ వల్ల సినిమా పరిశ్రమకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని, కొత్త సినిమాలు విడుదలైన కొద్ది గంటల్లోనే అక్రమ వెబ్‌సైట్‌లలో అందుబాటులోకి వస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమం విజయవంతం కావాలంటే, నిర్మాతలతో పాటు దర్శకులు, నటులు, డిస్ట్రిబ్యూటర్లు మరియు ప్రేక్షకులు కూడా సహకరించాలని దిల్ రాజు అభిప్రాయపడ్డారు.

## నిలకడగా గాయని కల్పన ఆరోగ్యం

- హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసిన వైద్యులు




**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**

ప్రముఖ నేపథ్య గాయని కల్పన ఆరోగ్యం నిలకడగా ఉందని కూకట్‌పల్లి హోలిస్టిక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. గాయని కల్పన నిద్రమాత్రలు మింగిందని, ఊపిరితిత్తుల్లో నీరు చేరడంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామన్నారు. ఆమెకు ఇన్ఫెక్షన్ ఉండటం వల్ల ఆక్సిజన్ అందిస్తున్నామని, ప్రస్తుతం సింగర్ కల్పన ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్ చైతన్య తెలిపారు. మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు అపస్మారక స్థితిలో ఉన్న సింగర్ కల్పనను హాస్పిటల్‌కు తీసుకు వచ్చారని డాక్టర్ చైతన్య తెలిపారు. నిద్ర మాత్రలు ఎక్కువ తీసుకు న్నారని చెప్పారు.. మాత్రల డోస్ ఎక్కువ అవ్వడంతో.. స్టమక్ వాష్ చేసామని.. బ్రీతింగ్ సమస్యలకు పరీక్షలు చేసి.. పలమనరి సమస్యకు చికిత్స అందించామని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో 12 గంటలు వెంటిలేటర్ పెట్టామని.. ప్రస్తుతం వెంటి లేటర్ తీసేసామన్నారు. లంగ్ ఇన్ఫెక్షన్ ఉందని.. ఆ సమస్యను క్లియర్ చేస్తామన్నారు. ప్రస్తుతం కల్పన ఆక్సిజన్‌పై ఉన్నారని.. రెండు మూడు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని డాక్టర్ చైతన్య తెలిపారు. మరోవైపు సింగర్ కల్పన కేసులో కేపీహెచ్‌బీ పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఆమె నిద్ర మాత్రలు వేసుకున్నారు. దీంతో ఆమె అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారు. కాగా బుధవారం కల్పన స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేయనున్నారు. హైదరాబాదులో సింగింగ్‌తో పాటు లా కూడా చేస్తున్నారు. తన పెద్ద కూతురును హైదరాబాదుకు రావాలని కల్పన కోరారని అయితే తాను హైదరాబాదుకురానని కేరళలోని ఉంటానని చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో మంగళవారం ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరిగినట్లు తెలియవచ్చింది. కాగా సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో ఆత్మహత్యాయత్నానికి కల్పన పాల్పడ్డారు. రోజూ వేసుకునే నిద్ర మాత్రలను ఎక్కువ మోతాదులో తీసుకున్నారు. అనంతరం సాయంత్రం 4:30 గంటలకు కల్పనకు భర్త ప్రసాద్ ఫోన్ చేశారు. ఆమె ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో విల్లా సెక్రటరీకి కాల్ చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కల్పనను హాస్పటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

## నా తల్లి ఆత్మహత్మయత్నానికి పాల్పడలేదు

- ఓవర్‌డోస్ టాబ్లెట్ వేసుకుంది
- కల్పన కూతురు పోలీసులకు స్టేట్‌మెంట్



**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**

కల్పన ఆత్మహత్యాయత్నంపై ఆమె కూతురు స్పందించింది. కల్పన ఆత్మహత్యాయత్నంపై సమాచారం అందుకున్న ఆమె కూతురు.. హుటాహుటిన కేరళ నుంచి హైదరాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా పోలీసులు ఆమె స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. మరి పోలీసులకు కల్పన కూతురు ఏం చెప్పింది.. పూర్తి వివరాలు తెలుసుకుందాం. కల్పన ఆత్మహత్యాయత్నంపై ఆమె కూతురు స్పందించింది. తన తల్లి కల్పన ఆత్మహత్యాయత్నం చేయలేదని తెలిపింది. నిద్రమాత్రలు ఓవర్ డోస్ వేసుకుందన్నారు. డాక్టర్ సూచించిన నిద్రమాత్రలే వేసుకుందని వివరించింది. మానసిక ప్రశాంతత కోసం నిద్రమాత్రలు వేసుకుంటోందని కల్పన కూతురు తెలిపింది. తమ కుటుంబంలో ఎలాంటి సమస్యా లేదన్నారు. తన తల్లి కల్పన హైదరాబాద్‌లో లా పీజీ చేస్తోందని వివరించింది. కల్పన మానసిక ఒత్తిడికి గురవుతూ, నిద్రలేమి సమస్యతో బాధపడేదని పేర్కొంది. కల్పన పెద్ద కూతురు స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు. అంతకుముందు.. కేరళ నుంచి హైదరాబాద్ రమ్మంటే కూతురు రావడం లేదని కల్పన మనస్థాపనం చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. కేరళ వెళ్లిన సందర్భంలో కూడా ఈ విషయంపై ఇరువురి మధ్య గొడవలు జరిగాయట. హైదరాబాద్‌కి వచ్చిన తరువాత మరోసారి కూతురుని తన వద్దకు రావాలని కల్పన కోరిందట. అయినప్పటికీ ఆమె అంగీకరించలేద. దీంతో తన కూతురు తన మాట వినడం లేదని కల్పన మనస్తాపానికి గురైందని, అలా నిద్ర మాత్రలు వేసుకున్నట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. కల్పన మొదటి భర్త కూతురు కేరళలో చదువుతోంది. అక్కడి నుంచి హైదరాబాద్‌కు వచ్చేయాలని కల్పన ఆమెను అనేకసార్లు కోరింది. ఈ విషయంలోనూ ఇద్దరి మధ్య గొడవలు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు.

## తగ్గుతున్న రాత్రిపూట ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్,మార్చి5( వెలుతురు):**

రాబోయే రెండు రోజులు తెలంగాణలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోనున్నట్లు వాతావరణశాఖ నిపుణుడు టీ బాలాజీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రజలకు కొంత ఉపశమనం లభించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాలు కాస్త కూల్‌గా మారనున్నాయి. ఆ జిల్లాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గనున్నట్లు పేర్కొన్నారు. రాత్రితో పాటు తెల్లవారుజామున కూడా టెంపరేచర్లు కూల్‌గా ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం వేళ యధావిధిగా ఉష్ణోగ్రతలు ఉంటాయన్నారు. కొంత వరకు హీట్ నుంచి రిలీఫ్ ఉంటుందన్నారు. హైదరాబాద్ నగర ప్రజలకు కూడా కొంత గుడ్‌న్యూస్ చెప్పారు. ఇవాల్టి రాత్రి నుంచి హైదరాబాద్‌లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గనున్నట్లు తెలిపారు. అయితే నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో హీట్ ఉన్నా.. ఉదయం పూట మాత్రం టెంపరేచర్లు తగ్గనున్నట్లు వెల్లడించారు. ఇక నగర శివార ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోనున్నట్లు చెప్పారు. ఉత్తర భారతం నుంచి అకస్మాత్తుగా వీస్తున్న చలిగాలుల వల్ల ఈ మార్పు ఉంటుందన్నారు. ఉత్తర తెలంగాణ దిశగా ఆ శీతల గాలులు వీస్తున్నట్లు చెప్పారు. మార్చి 6, 7 తేదీల్లో.. ఉదయం ఉష్ణోగ్రతలు 10 నుంచి 12 డిగ్రీల మధ్య ఉండనున్నాయి. ఇక మధ్యాహ్నం మాత్రం 35 నుంచి 36 డిగ్రీల సెల్సియస్ ఉండనున్నది. మార్చి 5, 7 తేదీల్లో హైదరాబాద్‌తో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో హీట్ నుంచి రిలీఫ్ ఉంటుందన్నారు. ఉదయం పూట 14 నుంచి 15 డిగ్రీల టెంపరేచర్ ఉండనున్నది. ఇక మార్చి 9వ తేదీ తర్వాత మళ్లీ ఉష్ణోగ్రతలు మండనున్నాయి.

## బీఆర్ఎస్ చేసిన మంచి పనులు

# కప్పిపుచ్చే ప్రయత్నం

- బీఆర్ఎస్‌పై కక్షను రైతులను మీద చూపించొద్దు
- కాంగ్రెస్ నాయకులు కళ్లున్న కబోదులు
- కాళేశ్వరం తెలంగాణకు వరప్రదయిని
- నాడు అడ్డుకొని.. నేడు ఫొటోలకు ఫొజులు
- కాంగ్రెస్‌కు చేతకాని తనంతో రైతులకు నీటి కష్టాలు
- కృష్ణా జలాలను కాపాడుకోలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం : మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్ సిద్దిపేట ,మార్చి5( వెలుతురు):**

బీఆర్ఎస్ చేసిన మంచిపనులను కాంగ్రెస్ పార్టీ కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తుందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. గతంలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని కూడా చెరపేసే ప్రయత్నాలు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని దుయ్యబట్టారు. చిన్న కోడూరు మండలం, చంద్లపూర్‌లోని రంగనాయక సాగర్ ప్రాజెక్ట్‌ను హరీష్ రావు బుధవారం సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజక వర్గంలో 50వేల ఎకరాల్లో పంట సాగు అవుతుందని, తన కోరిక మేరకు ఒక్క టీఎంసీ నీటిని ఉత్తమ్ కుమార్ రెడ్డి విడుదల చేశారన్నారు. గత ప్రభుత్వం (బీఆర్ఎస్) చేసిన మంచి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తుడిచి పెట్టాలని చూస్తోందని, ఎస్ఆర్ఎస్పీ నీరు తగ్గినా కూడా కాళేశ్వరం ద్వారా రెండు పంటలకు సాగునీరు విడుదల చేశామని హరీష్ రావు చెప్పారు. మేడిగడ్డలోని ఒక్క బ్లాక్‌లోని ఒక పిల్లర్ మాత్రమే కుంగితే బీఆర్ఎస్ పై బురద జల్లి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇప్పుడు గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, కేసీఆర్‌పై కోపంతో తెలంగాణ రైతులకు అన్యాయం చేయవద్దని కోరారు. కళ్లులేని కబోదుల్లగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. కాళేశ్వరం తెలంగాణకు వరప్రదయిని అని.. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కళ్లు తెరవాలని హరీష్ రావు సూచించారు.కాగా ప్రభుత్వ భూముల అమ్మకానికి కాంగ్రెస్ సర్కార్ పన్నాగం వేసిందని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. భూములు అమ్మే ప్రసక్తే లేదని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే ఇంచు భూమిని కూడా అమ్మబోమని ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి.. ఇప్పుడు రూ. వేల కోట్ల విలువైన భూములను వేలం వేసేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ పేరిట వేలం పాట నిర్వహించేందుకు కన్సల్టెంట్ నియామకానికి గత నెల 28న టెండర్లు పిలవడం సర్కారు దిగజారుడు తనానికి పరాకాష్ఠ అన్నారు. తెలంగాణ దేశానికి రోల్‌మోడల్ అయిందని టెండర్ నోట్‌లో ప్రస్తావించారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో అద్భుతమైన ప్రగతిని సాధించిన తెలంగాణను కాంగ్రెస్ 14 నెలల పాలనలో తిరోగమనం బాట పట్టించారని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. రంగనాయక సాగర్‌లోకి నీటిని విడుదల చేసినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

కేసీఆర్ కృషి ఫలితం.. సీతారామా ప్రాజెక్టు, నెర్రెలు బాసిన సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. నాడు సీతారామ ప్రాజెక్టును వ్యతిరేకించిన కాంగ్రెస్.. అప్పట్లో అనుమతులు రాకుండా కోర్టుల్లో కేసులు వేశారని అన్నారు. కానీ నేడు కాంగ్రెస్ మంత్రులు, నాయకులు మాత్రం గోదావరి జలాల వద్ద ఫొటోలకు ఫోజులిస్తున్నారని విమర్శించారు. తిట్టడం తప్పు.. కట్టడం రాని కాంగ్రెస్‌కు, కేసీఆర్ గొప్పతనం ఇప్పటికైనా అర్థం కావాలని అన్నారు. ఈ ప్రాజెక్టుతో ఒక్క ఎకరాకు నీరు రాదు అన్నోళ్ళు, ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి హక్కులను కాపాడలేని కాంగ్రెస్ చేతగానితనం వల్ల సాగర్ ఆయకట్టుకు కరువు వచ్చిందని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల రోజుకు పదివేల క్యూసెక్కుల కృష్ణ జలాలను ఆంధ్ర తరలించుకుపోతున్న పరిస్థితి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో రైతులను ఆదుకునేందుకు ఏకైక మార్గం గోదావరి జలాలను ఒడిసి పట్టి, ఎత్తిపోయడమే అని తెలిపారు. దీన్ని ముందే అంచనా వేసిన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూప కల్పన చేశారని పేర్కొన్నారు. కేంద్రం కొర్రీలను, కాంగ్రెస్ పార్టీ కుట్రలను ఛేదించి వడివడిగా 90 శాతం పనులు పూర్తి చేశారని హరీశ్‌రావు తెలిపారు. ఇదే కాంగ్రెస్ నేతలు నాడు సీతారామ ప్రాజెక్టే వృథా అన్నారని.. అనుమతులు రాకుండా కోర్టుల్లో కేసులు వేయించారని చెప్పారు. కానీ కేసీఆర్ పట్టుబట్టి న్యాయపరమైన చిక్కులు తొలగించి, అత్యంత క్లిష్టమైన అటవీ పర్యావరణ అనుమతులు సాధించి సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయించారని పేర్కొన్నారు. ఆ ఫలితమే నేడు కరువు కోరల్లో చిక్కుకున్న ఖమ్మం జిల్లా రైతులకు వరంగా మారిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించి సిద్ధంగా ఉంచిన సీతారామ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తూ అక్కడ ఫోటోలకు మంత్రులు, నాయకులు ఫోజులు ఇస్తున్నారంటే అందుకు కేసీఆర్ ఏ కారణమని తెలి పారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల సాగు, తాగునీటి కష్టాలకు సీతారామ ఒక శాశ్వత పరిష్కార మార్గం అని హరీశ్‌రావు అన్నారు. ప్రత్యక్షంగా ఆరు లక్షల ఎనబై వేల ఎకరాలకు, పరోక్షంగా పది లక్షల ఎకరాలకు సీతారామ ద్వారా గోదావరి జలాలు అందించామని తెలిపారు. సీతారామ ద్వారా ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని నాడు ప్రతిపక్షంలో ఉండి ఇదే కాంగ్రెస్ నాయకులు విమర్శించారని గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 7న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిందని.. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు మీద విషం చిమ్మారని పేర్కొన్నారు. వృథా ప్రాజెక్టు అన్నారని.. ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదన్నారని.. డీపీఆర్ లేదని చెప్పారు. ఒకే ఒక్కసారి మంత్రులు బృందం పర్యటించి, 2024 ఆగస్టు15వ తేదీన మూడు పంపు హౌసులను ఏకకాలం స్విచ్ ఆన్ చేసి ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. కేసీఆర్ మొక్కవోని దీక్షముందు కాంగ్రెస్ నేతల ఆరోపణలు పటాపంచలు అయిపోయారని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కష్టం, నేడు సగౌరవంగా రైతుల ముంగిట నిలబడిందని.. 60 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనకు, పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు తేడాను సుస్పష్టం చేసిందని చెప్పారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే పది లక్షల ఎకరాలకు నీళ్లించే ప్రాజెక్టును ప్రారంభించారంటే దాని వెనుక బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఓట్లు, సీట్లు, అధికారం శాశ్వతం కాదని, మనం చేసిన అభివృద్ధే శాశ్వతమని నమ్మే నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. అలా నమ్మి నిర్మించినవే కాళేశ్వరం, సీతరామ ఎత్తిపోతల ప్రాజెక్టులు అని స్పష్టం చేశారు.

## పోలీసుల ఔదార్యం

## ఇంటర్ విద్యార్థిని సకాలంలో పరీక్షా సెంటర్ తీసుకెళ్లిన సీఐ,ఎస్ఐ




**జనగామ,మార్చి5( వెలుతురు):**

ఖాకీలంటే కాఠిన్యమే కాదు, కరుణను సైతం పంచుతారనే ఉదంతం జనగామలో చోటు చేసుకుంది. పోలీసులు సకాలంలో విద్యార్థినిని పరీక్ష కేంద్రానికి చేర్చి శభాష్ అనిపించుకున్నారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు హాజరు కావాల్సిన ఓ విద్యార్థిని జనగామ అర్బన్ పోలీసులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. సునీత అనే ఫస్టియర్ విద్యార్థిని పొరపాటున తను పరీక్ష రాయాల్సిన సెంటర్‌కు బదులు మరొక సెంటర్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ప్రెస్టన్ కాలేజీ వద్ద విద్యార్థిని సునీత కంగారు పడుతున్న తీరును గమనించిన సీఐ దామోదర్ రెడ్డి, ఎస్ఐ చెన్నకేశవులు సదరు విద్యార్థినిని సకాలంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీ సెంటర్‌కు పోలీసు వాహనంలో చేర్చారు. పోలీసులు స్పందించిన తీరుపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. కాగా, ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొత్తం మూడు గంటలపాటు పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులను కాస్త ముందుగానే సెంటర్‌లోకి అనుమతిస్తారు. విద్యార్థులు ఉదయం 8:45 గంటలలోపు సెంటర్‌లో ప్రవేశించడం ఉత్తమమని అధికారులు సూచించారు. ఆలస్యంగా వచ్చే వారిని అంటే 9:05 గంటల తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించరు. బుధవారం ఫస్టియర్ విద్యార్థులకు రెండోభాష పేపర్-1కు పరీక్ష నిర్వహిస్తారు. గురువారం సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,532 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫస్టియర్‌లో 4,88,448 విద్యార్థులు, సెకండియర్‌లో 5,08,523 విద్యార్థుల చొప్పున 9,96,971 విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. వీరిలో గతంలో ఫెయిలైన 67,735 మంది విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరుకాబోతున్నారు. పరీక్షల కోసం 29,992 మంది ఇన్విజిలేటర్లు, 72 మంది ఫ్లయింగ్‌స్కాడ్, 124 సిట్టింగ్ స్కాడ్‌లకు విధులు కేటాయించారు. ఇంటర్‌బోర్డు అబ్జర్వర్లను (పరిశీలకులు) సైతం రంగంలోకి దించనున్నది.

## టీడీపీలోకి మల్లన్న.. గ్రేటర్ కోసం కసరత్తు..

**హైదరాబాద్, మార్చి 5, ( వెలుతురు)**

ఆంధ్రప్రదేశ్‌లో విజయం తర్వాత తెలుగుదేశం పార్టీ కేడర్ జోష్‌లో ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వడానికి చంద్రబాబు ప్లాన్ చేస్తున్నట్టు పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతోంది. తెలంగాణలో పార్టీని యాక్టివ్ చేయాలని ఇక్కడి నేతలు చాలా రోజులుగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.మరో 10 నెలల్లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలపై టీడీపీ ఫోకస్ పెట్టినట్టు సమాచారం. ఇందుకు సంబంధించి ఇప్పటికే గ్రౌండ్ వర్క్ కూడా ప్రారంభం అయినట్టు తెలుస్తోంది. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కోసం పనిచేసిన పొలిటికల్ కన్సల్టెన్సీ 'షోటైమ్'.. ఇప్పుడు హైదరాబాద్‌లో కార్యాకలాపాలు ప్రారంభించింది హైదరాబాద్‌లో ఆఫీసు ఏర్పాటు చేసిన షోటైమ్ ప్రతినిధులు.. టీడీపీ కోసం గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలే ట్రార్గెట్‌గా ఆ సంస్థ ప్రతినిధులు పని చేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా గతంలో టీడీపీ విజయం సాధించిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ సానుభూతిపరులను వీరు కలుస్తున్నారు. టీడీపీ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేయబోతోందని.. అందరూ గతంలో లాగా యాక్టివ్ అవ్వాలని సూచించినట్టు తెలిసింది.ఎల్బీనగర్, మహేశ్వరం, కూకట్‌పల్లి, జూబ్లిహిల్స్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం గ్రౌండ్ వర్క్ చేస్తున్నట్టు సమాచారం. ఇక్కడ చేస్తున్న వర్క్, పురోగతి గురించి ఎప్పటికప్పుడు చంద్రబాబుకు తెలియజేస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్నికలకు ఇంకా 10 నెలలు సమయం ఉండటంతో ముఖ్యనేతలు డైరెక్ట్‌గా ఇన్వాల్వ్ అవ్వడం లేదని తెలుస్తోంది. ఎన్నికలు సమీపించాక.. నారా లోకేష్ ఫోకస్ పెడతారని విశ్వసనీయంగా తెలిసింది.ప్రస్తుతం ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా ఈ మూడు పార్టీలు కలిసి పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా వెస్టర్న్ హైదరాబాద్‌లో టీడీపీ, జనసేన ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈస్టర్న్ హైదరాబాద్‌లో బీజేపీ ఇంపాక్ట్ ఉండే ఛాన్స్ ఉంది. దీంతో మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తే.. ఏపీలో మాదిరిగా విజయం సాధిస్తామని.. హైదరాబాద్‌కు చెందిన టీడీపీ సీనియర్ నేత ఒకరు చెప్పారుఇటీవల తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. దీంతో ఆయన టీడీపీలో చేరవచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది. కొత్త పార్టీ కూడా పెడతారనే ప్రచారం జరిగినా.. తెలుగుదేశం వైపే మొగ్గుచూపే అవకాశం ఉందని అంటున్నారు. అటు టీడీపీ మల్లన్నను చేర్చుకోవడానికి చర్చలు జరిపినట్టు వార్తలు వచ్చాయి. మల్లన్న పార్టీలో చేరితే ప్లస్ అవుతుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు. ఆయకే తెలంగాణ టీడీపీ అధ్యక్ష పదవీ ఇవ్వొచ్చనే వార్తలు కూడా వచ్చాయి.గతేడాది టీడీపీ సభ్యత్వ కార్యక్రమం చేపట్టింది. దీనికి తెలంగాణలోనూ మంచి స్పందన లభించింది. తెలంగాణ నుంచి లక్షా 21 వేల మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. దీంట్లో దాదాపు హైదరాబాద్ నుంచే ఎక్కువ మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందుకే చంద్రబాబును కలుస్తున్న తెలంగాణ నేతలు.. పార్టీపై ఫోకస్ పెట్టాలని కోరుతున్నారు.

